V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

విశ్వంభర

అక్షరం సాక్షిగా..

ఆదివారం
20-10-2024

సంపుటి : 01 | సంచిక : 168 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD



## గ్రూప్-1 అభ్యర్థుల చలో సెక్రటేరియట్‌లో

# ఉద్రిక్తత

### పోలీసుల అదుపులో బండి సంజయ్

అశోక్‌నగర్ నుంచి అభ్యర్థులతో కలిసి బండిసంజయ్ ర్యాలీగా సచివాలయం వైపు బయలుదేరగా ముందుకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డ సంజయ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారీగా చేరుకున్న పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నించగా.. గ్రూప్-1 అభ్యర్థులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు నిరసనకారులకు మధ్య తోపులాట వాగ్వాదం చోటు చేసుకుంది. భారీగా చేరుకున్న పోలీసులు గ్రూప్-1 అభ్యర్థులు, బీజేపీ కార్యకర్తలను చెదరగొట్టిన పోలీసులు.. అతి కష్టం మీద బండి సంజయ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆయన్ని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద వదిలిపెట్టారు.

### మద్దతు పలికిన విపక్షాలు

- సచివాలయం వద్ద అభ్యర్థుల ధర్నా
- మద్దతుగా వచ్చిన బీఆర్ఎస్, బీజేపీ నేతలు
- ఇరు పార్టీల నేతలు, కార్యకర్తల మధ్య వాగ్వాదం
- అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించిన బండి

**విశ్వంభర, హైదరాబాద్:** గ్రూప్ -1 అభ్యర్థుల పోరాటం శనివారం కూడా కొనసాగింది. పరీక్షను యథాతథంగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశించినా మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాలంటూ మరోసారి ఆందోళనకు దిగారు. పరీక్షలు రద్దు చేయాలంటూ ర్యాలీగా సచివాలయానికి బయలుదేరారు. తెలుగుతల్లి ఫ్లై ఓవర్ వద్ద వీరికి బీఆర్ఎస్, బీజేపీ నేతలు మద్దతు పలికారు. అయితే ఈ సమయంలో బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. ముందుగా సచి వాలయానికి ర్యాలీగా వెళ్తున్న గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతుగా వచ్చిన బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్‌లను కొందరు గ్రూప్-1 అభ్యర్థులు అడ్డుకున్నారు. గులాబీ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు.

**రెండు పార్టీల శ్రేణుల మధ్య తోపులాట**

ఇదే సమయంలో అక్కడికి బీజేపీ నేతలు రావడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకున్నాయి. ఆందోళనకారులకు మద్దతు తెలిపేందుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకుల్ని అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా అక్కడకు చేరుకున్నారు. మిగతా2లో...

## గ్రూప్-1 పరీక్షలు ఆగవు

- రేపటి నుంచి యథాతథంగా జరుగుతాయి
- బీఆర్ఎస్ ఉచ్చులో పడకండి
- అండగా నేనున్నా...ఆందోళన వద్దు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు




2

## మూసీ పునరుజ్జీవం

# హైడ్రా వేర్వేరు

- మదపుటేనుగులను అణచడానికే హైడ్రా పనిచేస్తుంది
- హైడ్రా అనగానే హరీశ్, కేటీఆర్ బయటకు వస్తున్నారు..
- ఫామ్ హౌస్ కు బుల్డోజర్ వస్తుందనే వాళ్ల డ్రామాలు
- రియల్ ఎస్టేట్ సంస్థలు భయపడొద్దు, వారికి నేను హామీ ఇస్తున్నా..
- హరీశ్, కేటీఆర్ ఫామ్‌హౌస్‌ల విషయంపై అఖిలపక్షం
- రాజీవ్ సద్భావన యాత్ర స్మారక దినోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

2

## గ్రూప్-1 అభ్యర్థుల డిమాండ్ న్యాయమైంది

### సీఎం వెంటనే స్పందించాలి.. కేంద్రమంత్రి బండి సంజయ్

**విశ్వంభర, హైదరాబాద్:** జీవో 29 వెనుక రిజర్వేషన్లు రద్దు చేసే కుట్ర దాగి ఉందని అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో శనివారం బీజేపీ రాష్ట్ర మిగతా2లో...

## బండి సంజయ్, రేవంత్ రెడ్డి కావాలనే నాటకం ఆడుతున్నారు

### ఉద్యోగార్థులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది: కేటీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** గ్రూప్-1 అభ్యర్థుల్ని ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని బీఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అభ్యర్థుల్ని చర్చలకు పిలవకపోవడం దుర్మార్గమన్న ఆయన.. కనీసం సుప్రీం కోర్టు ఏదైనా నిర్ణయం తీసుకునే వరకైనా ప్రభుత్వం వేచి చూడాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి మిగతా2లో...

## నేడు ప్రభుత్వ ప్రకటన?

### గ్రూప్-1 అభ్యర్థుల డిమాండ్లపై మంత్రుల సమావేశం

**విశ్వంభర, హైదరాబాద్:** మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు.. ఉన్నతాధికారులతో శనివారం సమావేశమయ్యారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష, జీవో 29 అంశంపై చర్చించినట్టు సమాచారం. గ్రూప్-1 అభ్యర్థులు చేస్తున్న విజ్ఞప్తులు, పరీక్షల వాయిదా సాధ్యాసాధ్యాలపై సుదీర్ఘంగా చర్చించారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు సూచించారు. ఏ ఒక్క అభ్యర్థి నష్టపోకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గ్రూప్-1 అభ్యర్థుల డిమాండ్లపై ప్రభుత్వం ఆదివారం ప్రకటన చేసే అవకాశముందని సమాచారం.

## సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌కు నేను సిద్ధం

### మూడు నెలల పాటు మూసీ తీరంలో ఉంటా

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సవాల్



**విశ్వంభర, హైదరాబాద్:** మూసీ సుందరీకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌కు తాను సిద్ధమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మూసీ ప్రక్షాళన వ్యతిరేకించే బీఆర్ఎస్, బీజేపీ నేతలు మూడు నెలలపాటు ఆ ప్రాంతంలో నివాసం ఉంటే సుందరీకరణ అంశాన్ని పక్కనపెడతానని రేవంత్ రెడ్డి సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు తాను రేవంత్ రెడ్డి సవాలును స్వీకరిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. మూడు నెలలపాటు మిగతా2లో...




## మూసీకి అడ్డుపడితే

# మరో ఉద్యమం తప్పదు

### నల్గొండ అంటే పోరాటాల గడ్డ-రెచ్చగొడితే రెచ్చిపోరు


- కేటీఆర్, హరీశ్ రావుల ఫాంహౌజులను ముట్టడిస్తాం
- మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరంలో లక్షల కోట్లు దోచుకుతున్నారు.
- కేసీఆర్ – కేటీఆర్ రాజకీయాల కోసం నల్గొండ ప్రజలు బలికావాలా..?
- సచివాలయంలో మీడియా సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్ :** నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని దాదాపు కోటిమంది ప్రజల జీవితాలతో ముడిపడ్డ మూసీ శుద్ధీకరణను అడ్డుకుంటే ఆనాటి రజాకార్లపై తిరుగుబాటు, తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమం మళ్లీ పునరావృతం అవుతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హెచ్చరించారు . సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో మంత్రి మాట్లాడుతూ మూసీ కాలుష్యంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అన్యాయం జరిగిందనే తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి సాధించుకుంటే.. గడిచిన పదేండ్లలో నల్గొండ జిల్లాకు మిగతా8లో...

### బాల్య వివాహాల నిరోధానికి

## జిల్లాకో ప్రత్యేక అధికారి

- నిషేధ చట్టాన్ని అమలు చేయాల్సిందే
- నిరోధానికి బహుముఖ కార్యాచరణ అవసరం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్



2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

### గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు

## పటిష్ఠ బందోబస్తు

ఇబ్బందులకు గురిచేస్తే చట్టప్రకారం చర్యలు: డీజీపీ


2

### గాజాపై విరుచుకుపడ్డ

## ఇజ్రాయెల్

### 33 మంది మృతి...

మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం



2



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 120 | ₹ 142 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 206 | ₹ 234 |

## ప్రేమ పేరుతో రాక్షసత్వం

### ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ దాడి.. కడప జిల్లాలో దారుణం..



**విశ్వంభర, బద్వేలు:** తనను కలవకపోతే చనిపోతానని బెదిరించి యువతిని పిలిపించాడు. రాగానే ఆమపై పెట్రోలు పోసి నిప్పంటించాడు. 80 శాతం గాయాలైన ఆమె ఇప్పుడు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. తీవ్రంగా కలచివేసి, కలకలం రేపిన ఈ ఘటన కడప జిల్లా బద్వేలు మిగతా2లో...

## జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించండి

- కేంద్రాన్ని కోరుతూ ఆ రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం
- లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం
- ప్రధానితో భేటీ అయ్యేందుకు త్వరలో ఢిల్లీకి సీఎం



2

# గ్రూప్-1 అభ్యర్థుల చలో సెక్రటేరియట్‌లో ఉద్రిక్తత

**(మొదటి పేజీ తరువాయి)**
గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలని బండి సంజయ్, గ్రూప్-1 అభ్యర్థులు చేపట్టిన చలో సచివాలయం అరెస్టులకు దారితీసింది. హైదరాబాద్ అశోక్‌నగర్‌లో ఆందోళన చేస్తున్న అభ్యర్థుల వద్దకు వెళ్లిన బండి సంజయ్, వారితో కాసేపు మాట్లాడి.. చలో సచివాలయానికి పిలుపునిచ్చారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఆందోళనలో ఉన్న విద్యార్థులు పరీక్షలు ఎలా రాస్తారని ఆయన ప్రశ్నించారు. మహిళలను, గర్భిణీలను కొడుతున్నారని, జీవో 29పై ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించారు. మహిళల్ని, గర్భిణీలను పోలీసులు కొడుతున్నారని, ఇది దాష్టీకానికి నిదర్శనమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# బండి సంజయ్, రేవంత్ రెడ్డి కావాలనే నాటకం ఆడుతున్నారు

**(మొదటి పేజీ తరువాయి)**
కావాలనే నాటకం ఆడుతున్నారని విమర్శించారు.
''భద్రత కల్పించి మరీ సంజయ్‌తో ర్యాలీ చేయించారు. బీఆర్ ఎస్ నాయకులను మాత్రం పోలీసులు అరెస్టు చేశారు. బండి సంజయ్‌ను చర్చలకు పిలిస్తే ఏం జరుగుతుంది? సంజయ్ ఏం చదివారు? పరీక్షల గురించి ఆయనకేం తెలుసు? పరీక్షపత్రాలు లీక్ చేయించే సంజయ్ గ్రూప్-1 గురించి ఏం మాట్లాడతారు?'' అని కేటీఆర్ విమర్శించారు.

**సుప్రీంకోర్టులో గ్రూప్-1 అభ్యర్థుల తరపున పిటిషన్**
మా నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దాసోజు శ్రవణ్ సుప్రీంకోర్టులో గ్రూప్-1 అభ్యర్థుల తరపున పిటిషన్ దాఖలు చేశారు. మొండిగా మూర్ఖంగా వ్యవహరించకుండా అభ్యర్థులతో చర్చలు జరపాలి. సహేతుకమైన కారణాలు చెప్పాలి. పోస్టుపోన్ ఉట్టిగానే అగడలేదు. మధ్యప్రదేశ్‌లో ఇదే విధంగా మొండిగా పోయి పరీక్షలు పెట్టాక కోర్టు తీర్పు వచ్చింది. మళ్లీ పరీక్షలు నిర్వహించాల్సి వచ్చిందని కేటీఆర్ గుర్తు చేశారు.

**అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం..**
గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతుగా వెళ్లిన మా నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, దాసోజు శ్రవణ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.. ఈ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం.. ప్రజా పాలన అని ఫోజులు కొట్టిన రేవంత్ రెడ్డి ఈ నిర్బంధం ఎందుకు తీసుకొచ్చావ్..? చర్చలు జరిపేందుకు ఎందుకు భయపడుతున్నవ్. మా నాయకులను అరెస్టు చేసి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నవ్.. నీ దోస్తు బండి సంజయ్‌ను బ్రహ్మాండంగా అక్కడికి పంపించావు. సకల రాచమర్యాదలతో సీఆర్పీఎఫ్ బలగాలను పెట్టి ఆయనను అక్కడికి పంపుతవ్. అదే మా నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తరలిస్తావు. ఇకనైనా సిగ్గు, బుద్ధి తెచ్చుకోని గ్రూప్-1 అభ్యర్థులను చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించండి అని కేటీఆర్ కోరారు.

# గ్రూప్-1 అభ్యర్థుల డిమాండ్ న్యాయమైంది

**(మొదటి పేజీ తరువాయి)**
కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ''అన్ని వర్గాలకు న్యాయం చేసేందుకే మోదీ ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తెచ్చింది. జీవో 29 వల్ల అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందనేది వాస్తవం. గ్రూప్-1 రద్దు చేయాలని ఎవరూ అడగట్లేదు, వాయిదా వేయాలని మాత్రమే కోరుతున్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోంది. పరీక్ష పూర్తయిన తర్వాత కోర్టు రద్దు చేస్తుందనే భయం అభ్యర్థుల్లో ఉంది. సోనియాగాంధీ జన్మదినం రోజున ఇంకా ఎంతమందిని బలి తీసుకుంటారో తెలియదు. గ్రూప్-1 అభ్యర్థులపై రోజూ లాఠీఛార్జి జరుగుతోంది. వారిది న్యాయమైన డిమాండ్. రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించాలి. సమస్యను పరిష్కరించేందుకు ఆలోచించాలి కానీ, ప్రభుత్వం మొండిపట్టుతో వ్యవహరించడం మంచికాదు. నిరుద్యోగుల ఆందోళనపై బీఆర్ ఎస్ పెద్ద కుట్ర చేసింది. మా ర్యాలీలో చొరబడి విధ్వంసాలకు పాల్పడాలని చూస్తే నిరుద్యోగ యువత అడ్డుకున్నారు. మా పార్టీ కార్యకర్తలతో గొడవకు దిగారు'' అని బండి సంజయ్ వివరించారు.

# సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌కు నేను సిద్ధం

**(మొదటి పేజీ తరువాయి)**
తాను నివాసం ఉంటానని, మరి ఇందుకు సీఎం సిద్ధమేనా అని ప్రశ్నించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి మూసీ పరివాహక ప్రాంతంలో పర్యటించారు.
ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. " మూసీ ప్రాంతంలో నివాసం ఉండటానికి నేను సిద్ధం. ముఖ్యమంత్రి సిద్ధమేనా?. సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు నేను మూడు నెలలపాటు మూసీ ప్రాంతంలో నివాసం ఉంటాను. నది శుద్ధికి బీజేపీ వ్యతిరేకం కాదు. పేదల ఇళ్లు కొడితే బీజేపీ ఊరుకోదు. బీఆర్ఎస్ నేత కేటీఆర్‌తో నీతులు చెప్పించుకునే స్థితిలో మేంలేము. మూసీ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్, బీఆర్ఎస్‌కు లేదు. నది సుందరీకరణకు తెరతీసిందే బీఆర్ఎస్ ప్రభుత్వం. ప్రజలు తిరగబడటంతో అప్పటి ప్రభుత్వ పెద్దలు తోక ముడిచారు. చేతనైతే మూసీలో వ్యర్థాలు కలవకుండా రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలి. నదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ కడితే వరదల నుంచి కాపాడుకోవచ్చు. ప్రజలు కోరుకోనప్పుడు మూసీ సుందరీకరణ ఎందుకు?. నదీ పరీవాహక ప్రాంత ప్రజల తరుపున బీజేపీ పోరాడుతోంది. వారి ఇళ్లు కూలుస్తామంటే ఒప్పుకునేది లేదు. మూసీ నిర్వాసితులకు అండగా ఉంటాం. వారి తరఫున పోరాడుతాం. అడ్డగోలుగా వచ్చి ఇళ్లపై పడితే చూస్తూ ఊరుకోం" అని అన్నారు.

# జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలిగా

## విజయ కిషోర్ రహతాకర్ నియామకం

**ఢిల్లీ:** జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలుగా విజయ కిషోర్ రహతాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ఈ పదవిలో మూడు సంవత్సరాల పాటు కొనసాగుతారు. ఆ మె గతంలో భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా, మహారాష్ట్ర రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం బీజేపీ జాతీయ సెక్రెటరీగా, రాజస్థాన్ రాష్ట్ర బీజేపీకి సహ ఇంఛార్జిగా వ్యవహరిస్తున్నారు.

**గత పలు దశాబ్దాలుగా పార్టీలో ఎన్నో కీలక పదవుల్లో ఉన్నారు. 'రహతాకర్'.**
సైన్స్ లో గ్రాడ్యుయేషన్, హిస్టరీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టాలను పుణె యూనివర్సిటీ నుంచి అందుకున్నారు. రహతాకర్ మహారాష్ట్రలో ఔరంగాబాద్ జిల్లాకు చెందినవారు. 1995లో 'బూత్ వర్కర్ గా బీజేపీలో చేరేటప్పటికీ కుటుంబ పరంగా ఎటువంటి రాజకీయ సంబంధ బాంధవ్యాలు లేవు. ఔరంగాబాద్ మేయర్ గా పనిచేశారు. జాతీయ మేయర్స్ కౌన్సిల్ కు ఉపాధ్యక్షురాలుగా, మహారాష్ట్ర మేయర్స్ కౌన్సిల్ కు అధ్యక్షురాలిగా పనిచేశారు.

# గ్రూప్-1 పరీక్షలు ఆగవు



**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ అధికారంలో ఉన్న 10 ఏళ్లపాటు ఉద్యోగాలు భర్తీ చేయకుండా కాలయాపన చేసిందని సీఎం రేవంత్ మండిపడ్డారు. ఇప్పుడేమో పోటీ పరీక్షలను వాయిదా వేయాలని అంటోందని అన్నారు. పోలీసు డ్యూటీ మీట్ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఈ నెల 21 నుంచి యథాతథంగా జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. 'పరీక్షలకు సిద్ధం కండి. 95శాతం మంది అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకున్నారు. మరో 5 శాతం మంది డౌన్లోడ్ చేసుకోండి. ప్రతిపక్షాల మాయమాటలను నమ్మకండి. గత ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. మేం వచ్చాకే వేల ఉద్యోగాలు కల్పిస్తున్నాం' రేవంత్ పేర్కొన్నారు. "తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశాం. పదేళ్లుగా వాయిదాలు పడుతున్న అన్ని ఉద్యోగాలను భర్తీ చేశాం. 15 వేల మంది పోలీస్ సిబ్బందిని కొత్తగా నియమించాం.1,637 ఇంజినీరింగ్ పోస్టులు, 65 రోజుల్లోనే 11,067 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేశాం. నిరుద్యోగుల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని కొందరు చూస్తున్నారు. 564 గ్రూప్ వన్ పోస్టుల నియామకాల కోసం మెయిన్స్ పరీక్షను సోమవారం నిర్వహించబోతున్నం. ప్రతిపక్షాల ఉద్యోగాలు పోయాయి. వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయి. గతంలో ఉన్న జీఓ 55 రద్దుచేసి గ్రూప్ వన్ నోటిఫికేషన్ ఇచ్చాం. అదే సమయంలోనే జీఓ 29 తెచ్చాం. ఈ జీవో ద్వారా రిజర్వేషన్లు ఖాళీల భర్తీ విషయంలో ఒక పోస్టు ఖాళీగా ఉన్న 1:50 పిలవాలని నిర్ణయించాం. 31 వేల మందికి పైగా మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఇప్పుడు 1:100 లెక్కన పిలవాలి అని ఆందోళన చేస్తున్నారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధనలను మధ్యలో మారిస్తే కోర్టులు ఊరుకుంటాయా? నోటిఫికేషన్ ఇచ్చే సమయంలోనే 1:100 కోరుకుని ఉంటే మీ ఆలోచనకు తగ్గట్టే ఇచ్చేవాళ్లం.
రిజర్వేషన్ ప్రకారమే సెలెక్ట్ చేస్తే వేలమంది ఎస్సీ, ఎస్టీలకు అవకాశం వచ్చింది. రిజర్వేషన్లు పకడ్బందీగా అమలు చేస్తుంటే కొంతమంది గందరగోళం సృష్టిస్తూ ఉన్నారు. 10 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు కనీసం మీకు అపాయింట్మెంట్ అయినా ఇచ్చారా..? ప్రజా యుద్ధనౌక గద్దర్ సమస్యలు చెప్పుకోవడానికి వెళ్తే నాలుగు గంటలపాటు ఎండలో నిల్చోబెట్టిన నీచమైన చరిత్ర వాళ్లది. గ్రూప్ 1 హాల్ టికెట్లు 95 శాతం మంది తీసుకున్నారు.. ఇంకా తీసుకొని వారు హాల్ టికెట్లు తీసుకొని పరీక్షకు సన్నద్ధం-కండి. న్యాయస్థానాలు కూడా ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల విధానాన్ని సమర్థించాయి. మీ భావోద్వేగాలతో బీఆర్ఎస్ ఆడుకుంటోంది. వారి ఉచ్చులో పడకండి. ప్రభుత్వం మీ సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉంది. అన్నగా నేను పరీక్షలు నిర్వహిస్తుంటే, వద్దు అని ఆందోళన చేస్తున్నారు ఆలోచించండి. మీకు అవకాశాలు ఇవ్వడం కోసమే పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఆందోళనలను విరమించి అపోహాలకు దూరం కండి. నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నప్పుడు ఉదారంగా వ్యవహరించండి. నిరుద్యోగులపై కేసులు పెట్టాల్సిన అవసరం లేదు.. పొరపాటున కేసులు పెడితే ఉద్యోగాలు సాధించడంలో ప్రతిబంధకంగా మారుతాయి. నిరుద్యోగులు ఆందోళన చేస్తున్న క్రమంలో కేసులు పెట్టవద్దని పోలీసులను ఆదేశిస్తున్నా" అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

# మూసీ పునరుజ్జీవం హైడ్రా వేర్వేరు



**విశ్వంభర, హైదరాబాద్ :** మురికి కూపంలో మగ్గిపోతున్న నిరుపేదలకు మంచి భవిష్యత్తును అందించాలన్న లక్ష్యంతోనే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం కోసం చేపట్టిన ప్రాజెక్టు, జీహెచ్ఎంసీ పరిధిలో చేపట్టిన హైడ్రా వ్యవస్థ రెండు వేర్వేరని చెప్పారు. హైదరాబాద్ చార్మినార్ వద్ద నిర్వహించిన రాజీవ్ సద్భావన యాత్ర స్మారక దినోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ సద్భావన అవార్డును మాజీ మంత్రి గీతారెడ్డికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహూకరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూదేశ సమగ్రతను కాపడటానికి చేపట్టిన రాజీవ్ గాంధీ సద్భావన యాత్రను స్ఫూర్తిగా తీసుకుని మత సామరస్యాన్ని కాపాడుకుంటూ తెలంగాణ అభివృద్ధికి ముందుకు సాగుతామన్నారు ట్రాఫిక్ నియంత్రణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, కలుషితాలను నిలుపుదల చేయడం, ప్రభుత్వ భూముల ఆక్రమణలను నిరోధించడం వంటి ఎన్నో ప్రజా-సౌలభ్యాల కోసం హైడ్రా పనిచేస్తుందని సీఎం తెలిపారు .చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారు, 111 జీవోను ఉల్లఘించిన వారు మాత్రమే హైడ్రాను చూసి భయపడుతున్నారని అన్నారు.మదపుటేనుగులను అణచడానికి అంకుశం తరహాలో హైడ్రా పనిచేస్తుందని చెప్పారు.అనుమతులున్న ఆస్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, సామాన్యులకు అండగా ఉంటామని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు . తెలంగాణ ఆర్థిక మూలాలు దెబ్బతీయాలని కొంతమంది చూస్తున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. హైడ్రా అనగానే కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్ బయటకు వచ్చారని, పేదలు ఎవరైనా ఫామ్‌హౌస్‌లు కట్టుకోగలరా అని ప్రశ్నించారు. ఆక్రమణదారులే హైడ్రాను చూసి భయపడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మూసీ మురికిలో ఉన్న పేదలను ఆదుకోవడానికి తాము ప్రయత్నిస్తున్నామని చెప్పారు. వాళ్ల ఫామ్ హౌస్‌లపైకి బుల్డోజర్లు వస్తాయనే భయంతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు నాటకాలు ఆడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. కేటీఆర్, హరీశ్ రావులు తమ ఫామ్ హౌస్ లు కాపాడుకోవడానికి, పేదలను ముందు ఉంచుతున్నారని చెప్పుకొచ్చారు. మూసీ బాధితులకు తాము ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నా కూడా బీఆర్ఎస్ నేతలు సహించలేక పోతున్నారన్నారు. హరీశ్‌రావు చెప్పులు మోసే రకమని, తన ఇంటి ముందు చేతులు కట్టుకొని నిలబడ్డ రోజులు మరచిపోయావా అంటూ ఆయనను ఉద్దేశించి అన్నారు. మూసీ పునరుజ్జీవం కోసం తాము తాపత్రయ పడుతుంటే.. అడ్డుకొనేందుకు బీఆర్ఎస్ విశ్వ ప్రయత్నం చేస్తుందన్నారు.
అజీజ్ నగర్ లో హరీశ్ రావు, జన్వాడ లో కేటీఆర్ ఫామ్ హౌస్ లు ఆక్రమణలకు పాల్పడి నిర్మించారని, వాటిపై నిజనిర్ధారణ కమిటీ వేస్తామన్నారు. పేదప్రజల పక్షపాతిగా తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందన్నారు. ఇటీవల ఎన్నో పథకాలు ప్రవేశపెట్టామని, నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించామన్నారు. అంతేకాకుండా.. రాష్ట్రంలో విద్యాభివృద్ధికై యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, యూనివర్శిటీలు నిర్మిస్తున్నామన్నారు. తానెప్పుడూ పేదల వైపే ఉంటానని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రేమ పేరుతో రాక్షసత్వం

**(మొదటి పేజీ తరువాయి)**
సమీపంలో చోటు చేసుకుంది. విద్యార్థినిని రోడ్డు పక్కనే చెట్లలోకి తీసుకెళ్లి విఘ్నేశ్ అనే యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని స్థానికులు కడప రిమ్స్‌కు తరలించారు. ఘటనపై బద్వేలు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమ పేరుతో 8వ తరగతి నుంచే విఘ్నేశ్ .. తమకు కుమార్తెను వేధిస్తున్నాడని బాధితురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. అతనికి వివాహమైనా వేధింపులు ఆపలేదని, శనివారం పెట్రోల్ పోసి నిప్పంటించాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని నుంచి జిల్లా జడ్జి వాంగ్మూలం నమోదు చేసుకున్నారు.

**నిందితుడి కోసం నాలుగు బృందాలతో గాలింపు: ఎస్పీ**
''గాయపడిన ఇంటర్ విద్యార్థినికి కడప రిమ్స్‌లో చికిత్స కొనసాగుతోంది. 80శాతం గాయాలయ్యాయి. చిన్నప్పటి నుంచి ఇద్దరికీ పరిచయం ఉంది. ఇద్దరూ బద్వేలు రామాంజనేయనగర్‌కు చెందినవారే. తనను కలవాలని విద్యార్థినికి విఘ్నేశ్ ఫోన్ చేశాడు. కలవకపోతే చనిపోతానని ఆమెను బెదిరించాడు. ఇద్దరూ పీపీకుంట చెక్‌పోస్టు సమీపంలోని ముళ్ల పొదల్లోకి వెళ్లారు. విద్యార్థినిపై పెట్రోల్ పోసి నిప్పంటించి విఘ్నేశ్ పరారయ్యాడు. నిందితుడి ఆచూకీ కోసం నాలుగు బృందాలతో గాలింపు చేపట్టాం'' అని కడప ఎస్పీ హర్షవర్ధన్ తెలిపారు.

**నిందితుడిని అరెస్టు చేయండి: చంద్రబాబు**
ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ దాడి ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు అధికారులతో మాట్లాడారు. ఆమె ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని, నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని అధికారులను ఆదేశించారు.

# బాల్య వివాహాల నిరోధానికి జిల్లాకో ప్రత్యేక అధికారి

**దిల్లీ:** బాల్యవివాహాలు చిన్నారుల విద్య, జీవన అవకాశాలను, ఆశలను చిదిమివేసి వారి ఆరోగ్యాన్ని, హక్కులను దెబ్బతీస్తాయంటూ సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సామాజిక రుగ్మతను రూపుమాపేందుకు బహుముఖ కార్యాచరణ అవసరమని స్పష్టం చేసింది. బాల్య వివాహాల నిషేధ చట్టాన్ని అమలు చేయాల్సిందేనని పేర్కొనడంతో పాటు ఈ లక్ష్య సాధనకు అనుసరించాల్సిన పలు మార్గదర్శకాలను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు జారీ చేసింది. బాల్య వివాహం జరగక ముందే దానిని అడ్డుకోవాల్సిన ఆవశ్యకతను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం 141 పేజీల తీర్పులో నొక్కి చెప్పింది. బాల్య వివాహాలు మైనర్లకు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛను హరిస్తాయని పేర్కొంది. ఈ రుగ్మత వేళ్లూనుకోవడానికి గల కారణాలను గుర్తించడంతో పాటు బాల్య వివాహాల సమర్థ కట్టడికి వ్యూహాలను రచించుకుని అమలు చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం తెలిపింది. దేశంలో బాల్య వివాహాలపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ జరిపి ఈ తీర్పు వెలువరించింది. వివిధ దేశాల్లోని వివాహ చట్టాలు, వివాహ వయసులను ధర్మాసనం ప్రస్తావించింది.

**ఇవీ ధర్మాసనం మార్గదర్శకాలు...**
1.దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలోనూ బాల్య వివాహాల నిషేధ అధికారుల (సీఎంపీవో)ను ప్రత్యేకంగా నియమించాలి. వారికి ఈ ఒక్క బాధ్యతనే అప్పగించాలి. ఇతర విధులకు వినియోగించరాదు. ఇందుకోసం ప్రత్యేక పోలీస్ విభాగం కూడా ఉండాలి.
2.బాల్య వివాహాల నిషేధం కచ్చితంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత సీఎంపీవోలదే. ప్రతి మూడు నెలలకోసారి వీరి పనితీరును సమీక్షించాలని స్త్రీ,శిశు అభివృద్ధి, హోంశాఖలను ధర్మాసనం ఆదేశించింది.
3.బాల్య వివాహాల నిషేధం అమలు క్రతువులో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలనూ భాగస్వాములను చేయాలి. ఈ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి.
4.సామాజిక, ఆర్థిక, భౌగోళిక పరిస్థితులు సమాజంలోని అట్టడుగు వర్గాలను బాల్య వివాహాలకు పురిగొల్పుతుంటాయి. ఆయా సామాజిక వర్గాల ప్రత్యేక పరిస్థితులు, ఆచారాలను దృష్టిలో ఉంచుకుని బాల్య వివాహాల నిరోధక చర్యలు చేపట్టాలి. ఆ దిశగా వారిని చైతన్యపరచాలి.
5.చట్ట ఉల్లంఘనకు పాల్పడితే ఎదురయ్యే సమస్యలు, శిక్షల గురించి విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలి. దోషులను శిక్షించేలా చర్యలు తీసుకోవాలి.
6.బాల్య వివాహ సమాచారం తెలిసిన వెంటనే న్యాయస్థానాలు సుమోటోగా కేసు నమోదు చేయాలి. మంచి ముహూర్తాలు ఉండే రోజుల్లో ఈ తరహా పెళ్లిళ్లు జరుగుతుంటాయి కనుక మేజిస్ట్రేట్లు ప్రత్యేక దృష్టి సారించాలి.
7.కేసుల విచారణ సత్వరమే జరిగేలా కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేయాలి.
ఈ నేరాల నమోదుకు ఆన్‌లైన్‌లో ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.
8.బాల్య వివాహ బాధితులను ఆదుకునేందుకు ప్రామాణిక నిబంధనలు రూపొందించాలని జాతీయ న్యాయ సేవా సంస్థను ధర్మాసనం ఆదేశించింది.
వైయక్తిక చట్టాల (పర్సనల్ లా) నిబంధనలు... బాల్య వివాహాల నిషేధ చట్టం-2006లోని నిబంధనల మధ్య వైరుధ్యం తలెత్తినప్పుడు బాల్య వివాహాల నిషేధ చట్టమే చెల్లుబాటయ్యేలా కేంద్రం తీసుకురాదలచిన సవరణ బిల్లు-2021 పార్లమెంటు స్థాయీ సంఘం పరిశీలనలో ఉన్న విషయాన్ని గుర్తు చేసింది.

## గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు

# పటిష్ఠ బందోబస్తు



**విశ్వంభర, హైదరాబాద్:** గ్రూప్ -1 మెయిన్స్ కోసం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలంగాణ డీజీపీ జితేందర్ వెల్లడించారు. పరీక్షకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టు ఆదేశాల ప్రకారమే పరీక్షలకు జరుగుతాయని, నిరసన పేరుతో రోడ్లపైకి వచ్చి ప్రజలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాలపై అభ్యంతరాలుంటే సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చని చెప్పారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ దేవాలయం ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సంయమనం పాటించాలని కోరారు. సికింద్రాబాద్ ఘటనపైనా ఆందోళనలు చేయడం సరికాదన్నారు. తెలంగాణలో అక్టోబరు 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు నిర్వహించనున్నట్లు డీజీపీ వెల్లడించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బందికి నివాళులర్పిస్తామన్నారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది 214 మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారని, తెలంగాణకు చెందిన ఓ పోలీసు అధికారి కూడా అమరులయ్యారని తెలిపారు.

# గాజాపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

**గాజా:** గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఉత్తర గాజాలో జరిపిన వైమానిక దాడుల్లో 33 మంది పాలస్తీనా వాసులు మృతి చెందారు. ఈ మేరకు అక్కడి అధికారిక వార్తా సంస్థ వెల్లడించింది. ఉత్తర గాజాలోని జబాలియా శిబిరంపై శుక్రవారం రాత్రి ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. మృతుల్లో 21 మంది మహిళలే కావడం గమనార్హం. ఈ దాడుల్లో కనీసం 85 మందికి తీవ్ర గాయాలయ్యాయి. అనేక మంది శిథిలాల కింద చిక్కుకుని పోయారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా.. ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇప్పటివరకు 42,500 మందికి పైగా మృతి చెందినట్లు గాజా ఆరోగ్య శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. మరోవైపు, ఇజ్రాయెల్‌పై సిరియా వైమానిక దాడులకు యత్నించింది. తమ భూభాగాన్ని లక్ష్యంగా చేసుకుని జరిపిన వైమానిక దాడులను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. అది తమ భూభాగంలోకి ప్రవేశించకముందే దాన్ని కూల్చివేసినట్లు పేర్కొంది. ఇరాన్ మద్దతుతోనే సిరియా ఈ డ్రోన్లను ప్రయోగించిందని తెలిపింది.

# జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించండి

**శ్రీనగర్:** జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరుతూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మంత్రివర్గం చేసిన తీర్మానాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదించారు. ఈ అంశాన్ని ప్రధానితో పాటు కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు క్యాబినెట్ సమావేశంలో ఓ అంగీకారానికి వచ్చారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణకు సంబంధించిన విషయాలపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులతో సమావేశమయ్యేందుకు ముఖ్యమంత్రి త్వరలో ఢిల్లీ వెళ్లనున్నట్లుగా అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా..మొదటి శాసనసభా సమావేశం నవంబర్ 4న జరగనున్నట్లుగా క్యాబినెట్ పేర్కొంది. కొత్తగా ఎన్నికైన అసెంబ్లీ సభ్యులతో ప్రమాణం చేయించేందుకు ముబారిక్ గుల్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించాలని సిఫార్సు చేసింది. శాశ్వత స్పీకర్ ఎన్నికయ్యే వరకూ గుల్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూకశ్మీర్ తొలి ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) నాయకుడు ఒమర్ అబ్దుల్లా(54) ప్రమాణం చేశారు. అయితే జమ్మూకశ్మీర్ పూర్తిస్థాయి రాష్ట్రంగా ఉన్నప్పుడు 2009 నుంచి 2014 వరకు ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2019లో అధికరణం 370తో పాటు.. జమ్మూకశ్మీర్ రాష్ట్రహోదాను కేంద్రం రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) విజయం సాధించిన అనంతరం ఒమర్ అమర్ అబ్దుల్లా మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలనే డిమాండే తొలి క్యాబినెట్ తీర్మానమని పేర్కొన్నారు.

# నివేదిక తర్వాతే.. రైతు భరోసా పథకం అమలు

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ మంత్రివర్గ ఉపసంఘం నివేదిక వచ్చిన తర్వాత రాబోయే సీజన్ నుంచి రైతుభరోసా పథకం అమలు చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ బీఆర్కేఆర్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో రైతు బీమా, రుణ మాఫీ, రైతు భరోసా, ధాన్యం, పత్తి, ఇతర పంటల కొనుగోళ్లు కనీస మద్దతు ధర, ఇతర వ్యవసాయ అంశాల గురించి మంత్రి మాట్లాడారు. మంత్రివర్గ ఉపసంఘం నివేదిక రాగానే రాబోయే పంట కాలం నుంచి రైతులకు ఎకరాకు రూ.7500 సాయం అందిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతు కుటుంబాలను గుర్తించి డిసెంబరులోగా వారి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తామన్నారు. అదేవిధంగా రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్న, నిర్ధరణ కాని రైతు కుటుంబాల కోసం త్వరలో షెడ్యూల్ ప్రకటించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ప్రకృతి విపత్తుల కారణంగా దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇస్తున్నామన్నారు. పంట బీమా పథకం వచ్చే సీజన్ నుంచి అమలు చేస్తామని వెల్లడించారు. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కే అన్ని పంటలను కొనుగోలు చేస్తున్నప్పటికీ... ప్రస్తుతం 25 శాతం మాత్రమే తీసుకుంటుందని కేంద్రం చెప్పారు. పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కేంద్రానికి లేఖ రాశామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, టీజీ సీడ్స్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, రైతు సంఘాల నేతలు సారంపల్లి మల్లారెడ్డి, పశ్య పద్మ, నల్లమల వెంకటేశ్వరరావు, లోకసాని పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నార్కెట్పల్లి పట్టణానికి చెందిన పసునూరి గీత శ్రీనివాస్ మాజీ వార్డ్ మెంబర్ మనవరాలు మొదటి పుట్టినరోజు వేడుకకు హాజరై చిన్నారికి శుభాకాంక్షలు తెలియజేసి, ఆశీర్వదించిన వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక ఛైర్మన్ కాంచన సత్యనారాయణ. - విశ్వంభర, నార్కెట్‌పల్లి



## సూర్యాపేట జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ గా వంగేటి రామరావుకి

**విశ్వంభర, సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ గా నియమితులైన వంగేటి రామరావుకి శుభా కాంక్షలు, ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్, పద్మావతిలకు వాసవి క్లబ్ కొమరబండ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# నిరుద్యోగుల జీవితాలతో సర్కార్ చెలగాటం

- జీవో 29పై అసెంబ్లీలో మాట్లాడినవి గుర్తొస్తున్నాయి
- ప్రభుత్వం మొండిపట్టు వీడి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు



**విశ్వంభర, హైదరాబాద్ :** గ్రూప్-1 నియామకాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తప్పుబట్టారు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 55ని కాదని కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 29 తీసుకొచ్చి.. నిరుద్యోగుల జీవితాలతో రేవంత్ రెడ్డి చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. జీవో 29ను రద్దు చేయాలని అసెంబ్లీ సాక్షిగా జులై 29 అర్ధరాత్రి వేళ మాట్లాడిన వ్యాఖ్యలను ఆయన మరోసారి గుర్తు చేశారు. "అప్పుడే ఈ ప్రభుత్వం మొండి పట్టు వీడి ఉంటే, భవిష్యత్ ప్రభుత్వ అధికారులయ్యే విద్యార్థులు, అభ్యర్థుల మీద లాఠీలు విరిగేవి కావు. వారిని అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లలో పెట్టే దుస్థితి వచ్చేది కాదు. వారి బతుకు, భవిష్యత్తు నడిరోడ్డు మీద పడేది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యార్థుల జీవితాలకు పెను శాపంగా మారింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాంగం ద్వారా లభించే హక్కులను, అవకాశాలను జీవోల పేరుతో కాలరాయడం దుర్మార్గం. న్యాయం కోసం పోరాటం చేస్తున్న విద్యార్థుల పట్ల ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్న కఠిన వైఖరిని చూస్తే ఆవేదన కలుగుతున్నది. ఇప్పటికైనా కళ్లు తెరిచి గ్రూప్స్ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. భేషజాలు పక్కనబెట్టి జీవో నెంబర్ 29ను తక్షణం రద్దు చేసి, గ్రూప్స్ పరీక్షను రీ షెడ్యూల్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**కాంగ్రెస్ – బీజేపీ మధ్య ఉన్న చీకటి ఒప్పందం మరోసారి బట్టబయలైంది**

గ్రూప్స్ అభ్యర్థులు చేస్తున్న నిరసనకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ముఠా గోపాల్, దాసోజు శ్రవణ్ సహా ఇతర నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ – బీజేపీకి మధ్య ఉన్న చీకటి ఒప్పందం మరోసారి బట్టబయలైంది. బీజేపీకి ఒక న్యాయం.? బీఆర్ఎస్‌కు ఒక న్యాయమా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. గంటల పాటు కేంద్ర మంత్రి బండి సంజయ్ వచ్చి నిరసన తెలియజేస్తుంటే అడ్డుకోని కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ నాయకులను మాత్రం అరెస్టు చేయడం దుర్మార్గం. వారి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం. రాజకీయాలు పక్కనబెట్టి ముందు విద్యార్థుల సమస్య పరిష్కరించడంపై దృష్టి పెట్టండి. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆపండని కాంగ్రెస్ ప్రభుత్వానికి హరీశ్‌రావు సూచించారు.



# అలరించిన కూచిపూడి నృత్య రూపకం

**విశ్వంభర, హైదరాబాద్ :** త్యాగరాయ గాన సభలో ప్రముఖ నాట్యాచార్యులు వేదాంతం జగన్నాథ శర్మ వర్ధంతి సందర్భంగా నాట్య గురు మద్దాలి ఉషా గాయత్రి శిష్యురాలు వాసవి చేసిన శృంగార లహరి నృత్య రూపకం చూపరులను ఆకర్షించింది. వేదాంతం జగన్నాథ శర్మ చేత కూర్చబడిన నృత్య ప్రదర్శన తో వారికి ఘన నివాళులు అర్పించారు.












# రాడార్ చుట్టూ రాజకీయం!

## రాడార్ సెంటర్ తో పర్యావరణానికి ముప్పు ఎంత!

### ప్రజలకు నమ్మకం కలిగించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

దేశం రక్షణ కొరకు దామగుండంలో ఏర్పాటు చేస్తున్న రాడార్ సెంటర్ తో ఎలాంటి ముప్పు ఉండదని, పర్యావరణానికి ప్రజలకు ఎలాంటి హాని జరగదని అక్టోబర్ 15న వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలోని పూడూరు దగ్గర " వెరీ లో ఫ్రీక్వెన్సీ"(వీ ఎల్ఎఫ్ ) రాడార్ సెంటర్ కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్ నాథ్ సింగ్ శంకుస్థాపన చేస్తూ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ" రాజకీయాలు వేరు.. దేశ భద్రత వేరు. దేశ భద్రత విషయంలో రాజకీయాలు చేయడం సరికాదు. రక్షణ రంగ పరికరాల తయారీలో హైదరాబాదుకు మంచి పేరు ఉంది. ఇప్పుడు ఏర్పాటు చేస్తున్న రాడార్ సెంటర్ కూడా దేశభద్రతకు కీలకంగా మారనుంది. తద్వారా దేశ రక్షణలో తెలంగాణ భాగస్వామి అవుతుంది" అని రాజ్ నాథ్ సింగ్ అన్నారు. రాడార్ కేంద్రం ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ.. అన్ని పార్టీలు సహకరించాలని కోరారు . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ " రాడార్ సెంటర్ అంశాన్ని కొందరు వివాదం చేసే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల నష్టం జరుగుతుంది. ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారు. దేశ రక్షణ కోసం ఏర్పాటు చేసే ప్రాజెక్టులను కూడా రాజకీయం చేయడం సరికాదు.వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని ' దామగుండం ' అటవీ ప్రాంతంలో భారత నావికాదళం ( ఇండియన్ నేవీ) నిర్మించ తలపెట్టిన వీఎల్ఎఫ్ స్టేషన్ నిర్మాణానికి రూ.3,500 కోట్లు కేంద్ర రక్షణ శాఖ మంజూరు చేసింది. ఇందుకోసం 2900 ఎకరాల అటవీ భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో నెంబర్ 44 ద్వారా 2017 లోనే కేటాయించింది. అందుకు రూ. 133 కోట్లు కేంద్రం విడుదల చేసిందని వివరించారు.

**వీ ఎల్ ఎఫ్ రాడార్ స్టేషన్ అంటే?**

వీఎల్ఎఫ్ రాడార్ అంటే వెరీ లో ఫ్రీక్వెన్సీ రాడార్ అని అర్థం. దీని ద్వారా సముద్రంలో దూర ప్రాంతంలో ఉన్న ఓడలు, జలాంతర్గాముల్లోని సిబ్బందితో నావికా సిబ్బంది సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవచ్చును. ఈ వ్యవస్థ 3 కేజీహెచ్ జెడ్ రేంజ్ లో తరంగాలను ప్రసారం చేస్తుంది. నీటి లోపల 40 మీటర్ల లోతు వరకు ఈ తరంగాలు చొచ్చుకుపోతాయి.1000 కిలో మీటర్ల దూరంలో ఉన్న వారికి సిగ్నల్స్ నిరాఘాటంగా అందించటానికి వీలవుతుంది. రక్షణరంగం అవసరాలతో పాటు, రేడియో కమ్యూనికేషన్ అవసరాలకు కూడా ఉపయోగపడుతుంది. ఇలాంటిది ఇప్పటివరకు మన దేశంలో తమిళనాడులో' తిరునల్వేలిలో ఉంది.

**దామగుండంనే ఎందుకు ఎన్నిక చేసుకున్నారు!**

తెలంగాణలో సముద్రం లేదు. అయినా ఈ నిర్మాణం ఇక్కడే ఎందుకు? అనేది పెద్ద ప్రశ్న. నేవీ అధికారులు చెప్పేదేమిటంటే.. తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన అరేబియా సముద్రంలో ఉన్న ఓడలు, జలాంతర్గాములలోని సిబ్బందితో మాట్లాడటానికి వీలుగా ఈ రెండు ప్రాంతాలకు మధ్యలో తెలంగాణలోని దామగుండం ప్రాంతం సాంకేతికంగా అనువుగా ఉంది. దామగుండం సముద్రమట్టానికి 360 అడుగుల ఎత్తులో ఉంది. రాష్ట్ర రాజధాని హైదరాబాదుకు 70 కి మీ దూరంలో ఉండటమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా అధికారులు చెబుతున్నారు. ఈ స్థలం ఎన్నిక 2013 లోనే నిర్ణయించి నప్పటికీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చర్చోప చర్చలు జరిగిన తర్వాతనే 2017 లో నిర్ణయానికి వచ్చారు. " సేవ్ దామగుండం " రాడార్ స్టేషన్ ఏర్పాటు రద్దు కోరుతూ దామగుండం అటవీ సంరక్షణ కమిటీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ రాడార్ స్టేషన్ వల్ల ప్రాణాంతకమైన రేడియేషన్ వెలువడుతుంది. గాలి,నీరు, పర్యావరణం తీవ్రంగా కలుషితం అవుతుందని వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పర్యావరణ అనుమతులు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన భూమి అనుమతులు అన్నిటినీ పరిశీలించింది. ప్రభుత్వం షరతులన్నీ పాటించాలని హైకోర్టు నేవీకి ఆదేశించింది. పురాతన చారిత్రాత్మక శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులను అనుమతిస్తామని.. టెంపుల్ ను అభివృద్ధి చేస్తూ. మంచి రోడ్డు సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామని నేవీ కోర్టుకు స్పష్టం చేసింది. నేవికి ఇచ్చిన భూముల్లో ఉన్న 1.93 లక్షల చెట్లకు నష్టం జరగదని.. చెట్లు లేని చోటే తాము నిర్మాణాలు చేపడతామని. ఈ ప్రాంతంలో. జీవవైవిధ్యాన్ని, అరుదైన పశు పక్షుల ఆవాసాన్ని పరిరక్షించే విధంగా చూస్తామని సేవ్ రామగుండం పరిరక్షణ కమిటీకి ప్రభుత్వం హామీ ఇస్తోంది.

జాతీయ అటవీ విధానం 1988 మార్గదర్శకంగా తెలంగాణలో 33 శాతం అడవులు పెంపుదలకు కృషి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.కానీ ప్రతి సంవత్సరం అడవుల విస్తీర్ణం తగ్గుతూ పోతోంది. మూడు వేల ఎకరాలు విస్తీర్ణంలో ఉన్న దామగుండం అటవీ ప్రాంతాన్ని నౌకాదళ రాడార్ స్టేషన్ నిర్మాణానికి ఇవ్వడం వల్ల సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమౌతున్న నేపథ్యంలో కేంద్ర నౌకాదళం , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో వ్యవహరించి పర్యావరణానికి విఘాతం కలగకుండా.. అడవిని పెంచడంతోపాటు ఆ ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలని ప్రజలు కోరుతున్నారు.



-ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

### రాడార్ వలన పర్యావరణానికి నష్టం ఉందా?

నేవి తీసుకొనే మొత్తం వైశాల్యం 2,900 ఎకరాలు.. ఇందులో 1500 ఎకరాల్లో ఎలాంటి కార్య కలాపాలు నేవీ చేపట్టడంలేదు. పర్యావరణానికి నష్టం లేకుండా మొక్కలు,చెట్లు లేని ప్రాంతంలో 350 ఎకరాల్లోనే సుమారు 3000 మంది నివాసం ఉండే విధంగా ఓ టౌన్ షిప్ ను నిర్మిస్తారు. ఇక్కడ 600 మంది సిబ్బంది తమ విధులు నిర్వహిస్తారు. అయితే 350 ఎకురాలలో ఉన్న చెట్లను తీసి ఖాళీ స్థలంలో రీ ప్లాంటేషన్ చేస్తామని, అదేవిధంగా పర్యావరణ పరిరక్షణ కోసం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిసర ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటుతారని తెలుపుతున్నారు.. లో ఫ్రీక్వెన్సీ వలన పర్యావరణానికి నష్టం ఉండదని తెలుపుతున్నారు. అయితే ఈ రాడార్ ప్రాజెక్టు నిర్మాణంలో 12 లక్షల చెట్లు నరికివేతకు గురవుతాయని పర్యావరణ ప్రేమికులు చేసే ప్రచారం వాస్తవం కాదని, రాడార్ కేంద్రాలకు అవసరాల కోసం ఆఫీసులు, టౌన్ షిప్ కొరకు ఉపయోగించే ఏరియాలో సుమారు 1,90,000 వేల చెట్లు నరికి వేయాల్సి ఉంటుందిని.. అందుకు ఒక చెట్టుకు 5 చెట్లు అదనంగా పదివేల చెట్లను నాటుతామని.. అందుకుగాను కేంద్ర రక్షణ శాఖ ఇప్పటికే రూ.133 కోట్ల గత ప్రభుత్వానికి చెల్లించిందని తెలుపుతున్నారు. నావికా రాడార్ కేంద్రానికి తీసుకున్న ఫారెస్ట్ చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేస్తామని.. దాని వలన ఫారెస్టుకు రక్షణతో పాటు, అక్రమ కలప రవాణాను నిరోధించవచ్చని చెపుతున్నారు. మూసీ నది పరీవాహక ప్రాంతం దెబ్బతింటుందని చెప్పేది కూడా నిజం కాదని, దామగుండం ఎత్తైన ప్రదేశమైన ఫారెస్ట్ నుండి వచ్చే వరద నీరు పశ్చిమం వైపు ప్రయాణిస్తూ కాగ్నా నదిలో కలుస్తూ కర్ణాటక వైపు ప్రయాణిస్తుందని.. అనంతగిరి కొండల్లో నుండి వచ్చే నీరు మూసి నదిగా హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ల గుండా ప్రవహిస్తూ ఉంటుందని , ఎలాంటి జల కాలుష్యం ఉండదని చెబుతున్నారు.

# విద్యారంగం భవిష్యత్తు కోసం పరితపించిన ముద్దు రామకృష్ణయ్య



ఉన్నత ప్రమాణాలు గల విద్యావేత్తగా, సమున్నత ఆశయాలు గల వ్యక్తిగా, విద్యా రంగానికి సక్రమ దిశా నిర్దేశం చేసేందుకు, నిరంతరం శ్రమించి, జీవితాన్ని విద్యారంగ అభివృద్ధికి అంకితం చేసి, లక్ష్య సాధనలో సిద్ధి పొంది, వినూత్న కార్యక్రమాల సృష్టికర్తగా, పేరెన్నిక గన్న బహుముఖ ప్రజ్ఞాశాలి ముద్దు రామ కృష్ణయ్య. అవిభక్త కరీంనగర్ జిల్లాలో సనాతన సంప్రదాయాలకు నిలయమైన, మంథనిలో , 1907 అక్టోబర్ 18న సంప్రదాయ పేద కుటుంబంలో ఆయన జన్మించారు. సనాతన ఆచారాలను కాదని, మహా సముద్రాలు దాటి, ఖండాంతరాలలో తిరిగి, వేలాది మందికి క్రమశిక్షణాయుత, బాధ్యతయుతమైన విద్య గురించి, పూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని కలిగించి, పూజ్య "పితాజీ" గా శిష్యకోటికి హృదయాలలో చెరగని ముద్ర వేసిన మహామనిషి రామ కృష్ణయ్య. ఆంగ్ల విద్యను నేర్చుకోవడమే గొప్పగా భావించే ఆ రోజుల్లో, జ్ఞాన సముపార్జన ధ్యేయంగా, కటిక దారిద్య్రాన్ని మరిచి, ఉజ్వల విద్యారంగ భవిష్యత్తు కోసం పరితపించి, ఎన్నో బాలా రిష్టాలను ఎదుర్కొని, ఇంగ్లాండ్ వెళ్లడు. విద్యాభ్యాసం కోసం ఒక హోటల్ నౌకరుగా, చౌకీదారుగా పనిచేశారు. అనంతర కాలంలో తన ప్రతిభకు మెరుగులు దిద్దుకుని, పర భాషపై పట్టు సాధించి, ప్రతిష్ఠాత్మక బ్రిటిష్ బ్రాడ్కాస్టింగ్ కార్పొరేషన్" (బి. బి. సి) లో, న్యూస్ రీడర్ గా పని చేసిన ప్రతిభాశాలి. సిలోన్, బర్మా, ఇండోనేషియా, ఫిలి ప్పైన్స్, అమెరికాలోని పలు రాష్ట్రాలు, ఫ్రాన్స్, ఇటలీ, ఈజిప్ట్, అరేబియా, రష్యా లాంటి దేశాలు పర్యటించి అక్కడి విద్యను, సంస్కృతీ సాంప్రదాయా లను, క్షుణ్ణంగా పరిశీలించి, అనుభవాలను జ్ఞాపకాలను మదిలో నింపుకున్నారు. అనంతర కాలంలో భారతదేశానికి తిరిగి వచ్చి విజయవాడ "ఆల్ ఇండియా రేడియో"లో అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసి తన లక్ష్యం గమ్యం అది కాదని భావించి విద్యారంగాన్ని సమూలంగా మార్చాలని ఎంచి, ఆ రంగానికి సేవ చేయడానికి కృత నిశ్చయుడు అయ్యారు. స్వీయ అభ్యర్థనపై రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశానుసారం, నిజామాబాద్ జిల్లా విద్యాధికారిగా, తర్వాత వరంగల్ బీఈడీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గా, పనిచేసి, రాష్ట్రంలో బహుళార్థ సాధక పాఠశాలలు ప్రారంభించిన నేపథ్యంలో, నేటి జగిత్యాల జిల్లా కేంద్రంలో "మల్టీపర్పస్" (బహుళార్థసాధక ఉన్నత పాఠశాలల) ప్రిన్సిపల్ గా తానే స్వయంగా, కోరుకుని, 1958 - 59 విద్యా సంవత్స రంలో నియుక్తులు అయ్యారు. "ఓల్డ్ హై స్కూల్" గా నేడు చిరపరిచితమైన జగిత్యాల బహుళార్థ సాధక ఉన్నత పాఠశాలలో ఆ రోజులలో "వందమంది ప్రజ్ఞావంతులైన ఉపాధ్యాయ బృందానికి" మార్గ నిర్దేశం చేశారు. రెండు వేల మంది విద్యార్థులకు విద్యా బోధన చేయడానికి అంకితభావంతో, చిత్తశుద్ధితో, సమయ పాలనతో, సాధికారత యుక్త, క్రణ శిక్షణతో పని చేశారంటే, అది సామాన్యమైన విషయమేమీ కాదు. అరుదైన వ్యక్తిత్వం, హాస్య భరిత ప్రసంగం, నిస్వార్థం, మానవత్వం, సౌమ్య సామాన్య జీవితం, నిరాడంబరం, మూర్తీభావించిన ఆయన ఆదర్శ జీవితం, ఎన్నో జీవితాలను ప్రభావితం చేసి, బంగారు బాటలో పయనింప చేసింది. 26 - 6 - 1965 లో పదవీ విరమణ చేసే సమయం వరకు, వందలాది మంది విద్యార్థులను తీర్చిదిద్ది, వారి అభిమానానికి పాత్రుడై, ప్రేమాభిమానాలతో "పితాజీ" అని పిలిపించుకున్న ముద్దు రామకృష్ణయ్య, విద్యా బోధనతో పాటు పాఠశాల రూపురేఖలను మార్చారు. ఈత కొలను నిర్మించి, అన్ని తరగతి గదులలో, ఆనాడే స్పీకర్ లను అమర్చి, పెద్ద కంట్రోల్ పెట్టెలను తన గదిలో అమర్చి, అక్కడి నుండే అంటే తన చాంబర్ నుండి, నేరుగా ప్రత్యేక విద్యార్థులతో మాట్లాడే , ఆధునిక సాంకేతిక పోకడలు ఆనాడే ప్రవేశ పెట్టి ఆచరించారు. పితాజీ అమూల్య సేవలకు గుర్తింపుగా రామకృష్ణయ్య శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదే స్ఫూర్తితో రామ కృష్ణయ్య శిష్యుడైన, గత జగిత్యాల మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం విగ్రహ దాతగా, జగిత్యాల ఓల్డ్ హై స్కూల్ లో 2010 సెప్టెంబర్ 7వ తేదీన పితాజీ విగ్రహా విష్కరణ చేశారు. రామకృష్ణయ్య ప్రియ శిష్యుడైన సూరజ్ శివ శంకర్ నిర్వహణలో, నాటి మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం అధ్యక్షతన, జిల్లాకు చెందిన అప్పటి ఉన్నత విద్యాశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విగ్రహం ఆవిష్కరించారు. ముద్దు జీవిత చరిత్రను ప్రభుత్వం గుర్తించి, 8వ తరగతి పాఠ్య పుస్తకంలో చోటు కల్పించి గౌరవించింది.

# ప్రతిధ్వనించిన ప్రజల పాటల గొంతుక

**సుద్దాల హనుమంతు**
**సాహితీ జీవితం స్ఫూర్తి దాయకం**

దేశద్రోహులు పెట్టుబడిదారీ పాలకులు దేశమునే అమ్మచూపేరయ్యా ...
పండించిన రైతు ఎండిపోతున్నాడు... బేరగాళ్లంతా కుబేరులు అవుతున్నారు..
కులమత ప్రాంతీయ భాషా విభేదాలు హత్యలు నిత్యకృత్యాలయ్యాయి...అని



ఏడు దశాబ్దాల నాడే ప్రజాకవి సుద్దాల హనుమంతు తన పాటలు, మాటలు, సాంస్కృతిక కళాప్రదర్శనల ద్వారా, పాలకుల తీరు ను ఎండగట్టారు. ఆయన దృష్టి ఈనాటికీ స్ఫూర్తివంతంగా ప్రకాశిస్తోంది. సుద్దాల హనుమంతు నల్లగొండ జిల్లా పాలడుగు గ్రామంలో 1910 జూన్ 6వ తేదీన పేద కుటుంబంలో జన్మించాడు. చిన్నప్పుడు ఆయన తల్లిదండ్రులు ఉగ్గుపాలకు బదులు ఉద్యమ పాటలు పోసి పెంచినట్లు ఉంది. అందుకే ఆయన తన జీవన ప్రయాణంలో ఉద్యమాన్ని, పాటలను, రచనలను, సాంస్కృతిక కార్యక్రమాలను ఆకళింపు చేసుకున్నాడు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అస్త్రాలుగా సంధించాడు. ప్రజలకు అందించాడు. నిజాం నవాబును గద్దె దించటానికి విప్లవాన్ని రగిలించాడు. జీవితం అంతా ఎర్రపూలవనం. ఆయన పాటల పూదోట, ప్రజా వ్యతిరేక ప్రభుత్వాల అంతు చూడటానికి తాండవమాడిన తంబుర రూపం. ఎరుపెక్కిన హృదయజ్వాల, ప్రతిధ్వనించిన ప్రజల పాటల గొంతుక, ఆయన నింగిని తాకిన అరుణప తాక. ఆయన స్నేహపు చిరునవ్వులు వెన్నెలకాంతులకు ప్రతీక, ఆయన సాహిత్యం ప్రకాశించే సూర్య తేజం. ఆయన సాహిత్యం ఎప్పటికీ స్ఫూర్తివంతం.

ప్రజాకవి సుద్దాల హనుమంతు సాహిత్య, సంస్కృతిక, సేనానిగా చేసిన పోరాట జీవన ప్రయాణంలో సతీమణి జానకమ్మ' కూడా ఆయన అడుగులో అడుగు వేసి నడిచింది. ఆయన గొంతుకు గొంతుకలిపింది. ఆయన పాటకు ఆమె పల్లవిగా పరిమళించింది. ఆయన తంబురనాదానికి ఆమె వంతపాటై బుర్రకథకు వన్నె తెచ్చింది. జీవితాన్ని అర్థం చేసుకున్నది. దాంపత్య జీవితానికి అర్థం చెప్పింది. సాహిత్య, సాంస్కృతిక పోరాట జీవితంలోనూ, నిజజీవితంలోను సుద్దాల హనుమంతుజానకమ్మ ఆదర్శ జంటగా నిలిచారు. బతికారు. సమాజాన్ని, ప్రజాహృదయాలను గెలిచారు.

ఇప్పుడు ఆ కలం లేదు. ఫలాలు లేవు. కానీ, సుద్దాల కలం నుండి పుట్టు కొచ్చిన ప్రజాసాహిత్య వనం సమాజమంతా విస్తరిస్తుంది. ఆ గళాలు లేవు కానీ ఆ గళ గర్జనలు ఈ భూమిమీద పేదవాడి గొంతునుండి, కళాకారుల గొంతు నుండి, ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. శ్రమజీవుల కష్టాలను, ఉద్యమ వీరుల త్యాగాలను, అమరత్వాన్ని, నిత్యం ప్రజా బాహుళ్యం హృదయాల్లోకి ప్రవహిస్తూనే ఉన్నాయి.

రాజ్యాంగబద్ధ పరిపాలనతో సంక్షేమం, దేశాభివృద్ధిని కాంక్షించిన ప్రజ లకలలు కలలుగానే మిగులుతున్న సందర్భాల్లో సుద్దాల హనుమంతు తన పాటలతో ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక చర్యలను ధైర్యంగా ఎండగట్టారు. ప్రస్తుతం పంచమంతా గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న ఏకపక్ష యుద్ధాన్ని ఖండి స్తున్నది. యుద్ధోన్మాదాన్ని, ఆక్రమితవాదాన్ని, అన్యాయాన్ని ఎత్తిచూపుతోంది. ఒకవేళ సుద్దాల హనుమంతు జీవించి ఉన్నట్లయితే ప్రపంచంలో

ఇప్పుడు జరుగుతున్న యుద్ధాలకు వ్యతిరేకంగా, బాంబుల వర్షానికి, యుద్ధ ట్యాంకుల మోతలకు, ఆకలిదప్పికలకు అలమటిస్తూ జీవచ్ఛవాలుగా బతుకుతున్న ప్రజల దీన పరిస్థితులకు కారణమైన, సామ్రాజ్యవాదానికి వ్యతిరే కంగా, ఎన్నో పాటలు కవిత్వాలు రచించేవాడు. మరెన్నో సాంస్కృతిక కార్య క్రమాలను నిర్వహించేవాడు. ఈ నేపథ్యంలోనే ప్రజాకవి సుద్దాలహను మంతు జానకమ్మ జాతీయ పురస్కార ప్రదా నోత్సవం విశిష్టతను సంతరించు కుంది. సుద్దాల ఫౌండేషన్ ఏర్పడిన 2010 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం సుద్దాల హనుమంతు జానకమ్మ పురస్కార ప్రదానోత్సవం నిర్వహించబడుతోంది. మొదటి జాతీయ పురస్కారం సినీదర్శక నిర్మాత నర్సింగరావుకు 2010 సంవత్సరంలో అందజేయడం జరిగింది. అనాటి నుండి ఈ పురస్కా రా న్ని వామపక్షభావాల, అభ్యుదయభావాల బాటలో ప్రజల పక్షాన నిలబడి తమ కలాన్ని, గళాన్ని, సాంస్కృతిక జీవితాన్ని, నిర్బంధాలలో సైతం, ఎలాంటి భయాలకు లోనుకాకుండా, ప్రజలకే సమర్పణం చేసిన ప్రముఖ కవులు, రచయితలు, వాగ్దేవికారులు, ప్రజాగాయని, గాయకులకు, సగౌర నంగా అందజేయడం జరిగింది.సామాన్యమానవునిగా వైద్యునిగా, కళాకారునిగా, రచయితగా, కవిగా, కమ్యూనిస్టుగా సమాజంలోని ప్రజల సమస్యలను పిడిని పాలకుల విధానా లను, దారిద్రాన్ని తనస్వామ్యాన్ని వివిధ దృష్టి కోణాల నుండి విశ్లేషించుకుని అర్థం చేసుకొని వర్గదృష్టితో పక్షాన నిలబడి జీవితం ప్రతిబింబించే సాహి త్యాన్ని పండించిన హనుమంతు సుద్దాల హనుమంతు, జానకమ జాతీయ పురస్కారం సమాజంలో సామాజిక సాహిత్య సాంస్కృతిక జీవిత విలువలను ప్రజ్వలింప చేస్తుందనటంలో ఎలాంటి సందేహంలేదు. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం సుద్దాల హనుమంతు జానకమ్మ. జాతీయ పురస్కారాన్ని అరుణోదయ నాగన్నకు ప్రకటించారు. ఆయన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో రాబీరం గ్రామంలో పేద కుటుం బంలో పుట్టి, పాటల చెట్టుగాపెరిగాడు. వామపక్ష భావజాలంతో పాటల సెల యేరై ప్రవహిస్తూ, అనేకమైన ఆటుపోట్లకు, కష్టాలకు ఇబ్బందులకు తట్టు కుంటూ, భయంతో పాట నుండి వెనుకడుగు వేయకుండా, పేద ప్రజలను ఆదివాసీల ను బడుగు బలహీన ప్రజలను, 'మేల్కొల్పే గొంతుకగా 'అరుణోదయ నాగన్న' గా ప్రజాహృదయాల్లో స్థానం దక్కించుకున్నాడు. వీరికి ఈ పురస్కార గౌరవం దక్కడం చాలాసముచితం, సందర్భోచితం కూడా. నేటి సామాజిక రాజకీయ, పరిస్థితుల్లో ప్రతిష్టాత్మకమైన ఈ ఫౌండేషన్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టరు సుద్దాల అశోక్ తేజ, సుద్దాల సుధాకర్ తేజ, సుద్దాల ప్రభా కర్, కమిటీ సభ్యులకు, పురస్కార స్వీకర్త నాగన్నకు అభినందనలు.



### అరుణోదయ నాగన్నకు పురస్కార ప్రదానం

సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కార ప్రదాన కార్యక్రమం శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. జస్టిస్ నగేశ్, బీమపాక భారతి, సుద్దాల అశోక్ తేజలు అరుణోదయ నాగన్న-లక్ష్మి దంపతులకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి.



- కే.వి.ఎల్.
రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి
అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం
తెలంగాణ రాష్ట్ర కమిటీ: 9490952649

# ముత్యాలమ్మ గుడి వద్ద తీవ్ర ఉద్రిక్తత

■ హిందూ సంఘాల ఆందోళన

■ లాఠీ ఛార్జి చేసిన పోలీసులు



**విశ్వంభర, సికింద్రాబాద్:** సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయం వద్ద హిందూ సంఘాల ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. అమ్మవారి విగ్రహ ధ్వంసానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. మహంకాళి ఆలయం వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ క్రమంలో పోలీసులకు ఆందోళనకారులకు మధ్య తీవ్రతోపులాట జరిగింది. తమను అడ్డుకున్న పోలీసులపై నిరసనకారులు చెప్పులు విసిరారు. ఆందోళన చేస్తున్న హిందూ సంఘాల శ్రేణులకు డీసీపీ రష్మీ పెరుమాల్ నచ్చజెప్పినా ఫలితం లేకుండా పోయింది. చివరకు పోలీసులు నిరసనకారులపై లాఠీఛార్జి చేశారు. ఆందోళనకారుల్లో కొందరి తలలకు, ఇతర శరీరభాగాలకు గాయాలయ్యాయి. లాఠీఛార్జ్‌లో తన ఎడమచెయ్యి విరిగిందంటూ దుర్గాఅనే యువకుడు నేలపై కూలబడ్డాడు.

**అసలేం జరిగింది:** ఈనెల 24 అర్ధరాత్రి సమయంలో సికింద్రాబాద్ మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్యాలమ్మ ఆలయంలోకి కొందరు చొరబడి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దీంతో స్థానికులు, ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంతా ఆలయం వద్దకు చేరుకొని నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసి తమ మనోభావాలను దెబ్బతీశారంటూ ఆగ్రహానికి లోనయ్యారు. స్థానికులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. దీంతో ముత్యాలమ్మ గుడి వద్ద స్వల్ప ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ అంశంపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకున్నారు.

**బీజేపీ నాయకుల తీవ్ర ఆగ్రహం:** అమ్మవారి విగ్రహం ధ్వంసంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. అలాగే బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించారు. అయితే శనివారం మళ్లీ స్థానికులు అమ్మవారి గుడి వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులకు, స్థానికులకు మధ్య తోపులాట జరిగి లాఠీఛార్జీకి దారితీసింది..

# రాజకీయాలు పక్కన పెట్టి హిందువుల పక్షాన పోరాడండి

**హిందువుల ఐక్యత చాటి చెప్పడానికే నియోజకవర్గ వ్యాప్తంగా మహా శాంతి హారతి చేపట్టాం: అందెల శ్రీరాములు**



**విశ్వంభర.మహేశ్వరం:** జల్ పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలోని పోచమ్మ తల్లి ఆలయంలో మహా శాంతి హారతి కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొని అమ్మవారికి మహా శాంతి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. గత కొన్ని నెలలుగా హిందువుల అమ్మవారి ఆలయాలపై కక్షగట్టి వరుస దాడులు చేస్తున్నారని, మొదటగా రక్షాపురంలో, మైలార్‌దేవ్‌పల్లిలో, ఎగ్జిబిషన్ గ్రౌండ్లో, మొన్న సకింద్రాబాద్ లోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలోకి చొరబడి విగ్రహాలను ధ్వంసం చేయడంతో యావత్ హిందూ సమాజాన్ని కల్చివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల ఐక్యత చాటి చెప్పడానికి అమ్మవారి శాంతి కొరకు మహేశ్వరం నియోజకవర్గం వ్యాప్తంగా అమ్మవారి ఆలయాల్లో మహా శాంతి హారతి నిర్వహించాలని పిలుపునివ్వడం జరిగిందని అన్నారు. అందులో భాగంగానే శ్రీరామ్ కాలనీలో అమ్మవారికి మహా హారతిని ఇవ్వడం జరిగిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని అమ్మవారి ఆలయాల్లో మహా శాంతి హారతి నిర్వహించినందుకు హిందువుల ఐక్యతను చాటి చెప్పినందుకు శ్రీరాములు హిందూ బంధువులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా హిందువులకు ఏమైనా జరిగినప్పుడు అన్ని రాజకీయాలు పక్కన పెట్టి హిందువుల పక్షాన నిలబడి పోరాడాలని, అలా పోరాడిన వాడే నిజమైన హిందువని పేర్కొన్నాడు. స్థానిక కౌన్సిలర్ శ్రీధర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు మల్లేష్, బీజేపీ ఉపాధ్యక్షులు సంతోష్, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు హరికృష్ణ, సుమిత్, గణేష్, చించోలి శ్రీనివాస్, నాగార్జున, ఆకాష్, మహేందర్, శివ, షేర్ సింగ్, హిందూ బంధువులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తా

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. శనివారం భూపాలపల్లి మున్సిపాలిటీ పాలిటీ పరిధిలో 9, 10 వార్డుల్లో TUFIDC నిధులతో ఫేజ్ – 5 కింద సుమారు రూ.260 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు జడ్పీసీఈఓ, జిల్లా ఇంచార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ముందుగా మహబూబ్ పల్లిలో రూ.80 లక్షలతో సీసీ రోడ్డు, బీటీ రోడ్డు వైండనింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గండ్రపల్లిలో రూ.40 లక్షలతో సైడ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పుల్లూరు రామయ్యపల్లిలో రూ.35 లక్షలతో ఇంటర్నల్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.80 లక్షలతో బీటీ రోడ్డు నుంచి తుమ్మలకుంట చెరువు కట్ట వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.25 లక్షలతో లారీ అసోసియేషన్ రోడ్డుకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి కొరకు అనునిత్యం శక్తివంచన లేకుండా పనిచేస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి మున్సిపాలిటీతో పాటు, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పలువురు అధికారులు, కాంగ్రెస్ నేతలు ఉన్నారు.



**రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలంలోని దత్తాయిపల్లి గ్రామ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు రామకృష్ణ, శివలను పాఠశాల పక్షాన సన్మానించారు. పాఠశాల కమిటీ మాజీ చైర్మన్ కానుగుల సత్యం ముదిరాజ్, అంగన్వాడీ టీచర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.**
**– విశ్వంభర, షాద్ నగర్7**

# గిరిజన సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

**రాష్ట్ర అధ్యక్షులు ధర్మా నాయక్**



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఖమ్మంలో నవంబర్ 5,6 జరిగే గిరిజన సంఘం రాష్ట్ర సమ్మే ళనం ను వేలాది మంది తరలి రావాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ ధర్మా నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు యం గోపినాయక్అన్నారు. శనివారం ఆర్ కే పురం డివిజన్ యన్ టి ఆర్ నగర్ బంజారా బస్తి లో కర పత్రం ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ గిరిజన హక్కుల కోసం పోరాడిన గిరిజన వ్యవస్థపక నాయకులు గుగులోత్ ధర్మా నాయక్ అని అన్నారు. గిరిజనులకు హక్కులు కల్పించడంకోసం అటవీ హక్కుల గుర్తింపుచట్టం చేయాలని నాయక్ వామపక్ష పార్టీలు గిరిజన సంఘాలు ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించారు అని అన్నారు. తెలంగాణలో పెరిగిన గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని జరిగిన ఉద్యమంలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడంలో తన వంతు పాత్ర పోషించరని అన్నారు. ఈ కార్యక్రమం లో కే సోమ్లా నాయక్, యన్ ఈశ్వర్ నాయక్, ఆర్ పవన్ నాయక్, కే సాయి నాయక్, సింధు, ప్రియ, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

# దూది బసవరాజుకు ఘన సన్మానం




**విశ్వంభర, హయత్ నగర్:** ఫ్రెండ్లీ ఎన్విరాన్మెంటల్ ఫర్ డిజేబుల్ అనే సంస్థ రాజ్ భవన్ లోని సంస్కృతి హాల్లో అంతర్జాతీయ శ్వేత బెత్త దినోత్సవం (ఇంటర్నేషనల్‌వైట్ కేన్‌డే) ఉత్సవాలను నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా తెలంగాణ గవర్నర్ జిష్ణ దేవ్ వర్మ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంలు పాల్గొని అందులను ఉద్దేశించి వైట్‌కేన్‌డే యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ వైట్ కేన్ అందులకు ఎంతో ఉపకరిస్తుందని తెలియజేశారు.హయత్ నగర్ లో స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్‌గా విధులు నిర్వహిస్తున్నటువంటి దూది బసవరాజుని సన్మానించారు.

## పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌ని కలిసిన నూతన గౌడ సంఘం నాయకులు



**విశ్వంభర, ఎల్బీనగర్:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడుగా నియమితులైన బొమ్మ మహేష్ గౌడ్‌ని శ్రీ నూతన గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి రామకృష్ణ గౌడ్, ఉపాధ్యక్షుడు మోరిగాడి ఉపేందర్ గౌడ్‌ల ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందచేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మహేష్ గౌడ్ మాట్లాడుతూ శ్రీ నూతన గౌడ సంఘం చేస్తున్న సేవను కొనియాడుతూ రాబోయే రోజుల్లో పేదింటి గౌడ బిడ్డలను ఆదుకోవాలని మరింత సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.వారి వెంట ప్రధాన కార్యదర్శి భత్తుల రవీందర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మిట్టపల్లి విజయ్ గౌడ్ ,అధికార ప్రతినిధి బండమీది కనకరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కోట మైసమ్మ ఆలయంలో మహా హారతి



**విశ్వంభర, మహేశ్వరం :** హిందూ దేవాలయాలపై దాడి చేస్తున్న మతోన్మాదులను ఉరితీయాలని మహేశ్వరం మండల్ బీజేపీ నేత మాజీ ఎంపీటీసీ సుదర్శన్ యాదవ్, బీజేవైఎం నాయకుడు వనంపల్లి శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కేంద్రంలోని గడికోటలో ఉన్న కోట మైసమ్మ ఆలయం వద్ద మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ పిలుపుమేరకు హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయాల్లోకి దుండగులు మరోసారి చొరబడకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హిందూ దేవాలయాలపై దాడులు జరగడం ఓ పథకం ప్రకారం జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




**మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు ఇటీవలే స్వీకరించిన గంట సంజీవరెడ్డిని శనివారం హైదరాబాద్‌లో ఘనంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవి చంద్ర.**
**– విశ్వంభర, మహబూబాబాద్**



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) సీఐ సోలోమాన్ రాజ్ ను శివాజీ యువజన మండలి అధ్యక్షులు కోరే మల్లేశం కురుమ సన్మానించారు. ఈ కార్యక్రమంలో శివాజీ యువజన మండలి ప్రధాన కార్యదర్శి మజ్జిగ నరేష్, సభ్యులు దీగోజు శ్రీనివాస్ చారి, రాగటి సత్యనారాయణ, బండ శివాజీ, మురరిశెట్టి సందీప్, మల్గ క్రాంతి, పంజాల రాజు, తొండల అనిల్, లోడి మహేష్, లోడీ ప్రదీప్, లోడి మణికంఠ, ఉగ్గే ప్రమోద్, పలువురు యువజన మండలి సభ్యులు పాల్గొన్నారు. – విశ్వంభర, ఆత్మకూరు(ఎం)**

## జర్నలిస్ట్ సుదర్శన్ పై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

**టీజేయూ మండలాధ్యక్షులు గడ్డం నాగరాజు**



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండల కేంద్రంలోని తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ కార్యాలయంలో టీజేయూ మండలాధ్యక్షులు గడ్డం నాగరాజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో జర్నలిస్ట్ నిట్ట సుదర్శన్ పై జరిగిన దాడిని టీజేయూ మండల కమిటీ ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండించారు. జర్నలిస్ట్ సుదర్శన్ పై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవాలని కోరారు. టీజేయూ మండల గౌరవ అధ్యక్షుడు నోముల రవీందర్ రెడ్డి, టీజేయూ మండల ఉపాధ్యక్షుడు షేక్ అజీజ్, మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మల్లేష్, టీజేయూ మండల కార్యదర్శి పొన్నగాని సతీష్ గౌడ్, మండల మహిళా కన్వీనర్ దంతూరి సుమలత గౌడ్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఈ నెల 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు

**ఎస్పీ కిరణ్ ఖరే**




**విశ్వంభర, భూపాలపల్లి:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను ఈ నెల 21వ తేదీ నుంచి 31 వరకు నిర్వహిస్తున్నట్లు జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసులను స్మరించుకునేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఇందులో భాగంగా పోలీసుల విధులు, టెక్నాలజీ వినియోగం, రక్తదాన శిభిరాలు, ఓపెన్ హౌస్, అమరవీరుల కుటుంబాల సందర్శన, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, కొవ్వొత్తుల ర్యాలీ, సైకిల్ ర్యాలీ, మరికొన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో ఇంటర్ విద్యార్థుల వరకు 'విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్ వాడకం' అంశంపై, డిగ్రీ ఆపై విద్యార్థులకు 'తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంతో నా పాత్ర' అనే అంశాలపై, అలాగే పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యాస రచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన ముగ్గురికి బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో వివిధ కేటగిరిలో మూడు ఉత్తమ వ్యాసాలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు.

# అనంతగిరి దేవాలయంలో 24న వేలం పాట




**విశ్వంభర, వికారాబాద్ :** అనంత పద్మనాభ స్వామి దేవాలయం, అనంతగిరి ఆలయం నందు కార్తీకమాసం ఒక్క నెల రోజులకు నవంబర్ 1 నుంచి 30వరకు కొబ్బరి కాయలు అమ్ముకొనే హక్కు పొందుట, దీపారాధన సామాగ్రి అమ్ముకొనే హక్కు పొందుట గురించి ఈ నెల 24 గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు అనంతగిరి దేవాలయం వద్ద బహిరంగ హక్కు వేలం పాట నిర్వహించబడునని ఆలయ ధర్మకర్త పద్మనాభం తెలిపారు. కొబ్బరి కాయలు అమ్ముకొనే హక్కు గురించి డిపాజిట్ లక్ష రూపాయలు, దీపారాధన సామాగ్రి అమ్ముకొనే హక్కు పొందుటకు రూ. పది వేలు డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు.

# విచ్చలవిడిగా బెల్టు దందా

■ ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు విక్రయాలు

■ పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతి కలిగిన రెండు వైన్ షాపులున్నాయి. అయితే మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బెల్ట్ షాప్ నిర్వాహకుల దూకుడు మామూలుగా లేదు. ఉదయం 5 గంటలకే మొదలై.. రాత్రి ఒంటిగంట వరకు బెల్ట్ షాపుల్లో మద్యం లభించడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ప్రభుత్వ అనుమతితో నడిచే వైన్ షాపులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతాయి. కానీ బెల్ట్ షాపుల్లో మాత్రం నిరంతరం మద్యం లభించడం గమనార్హం. గ్రామాల్లోని బెల్ట్ షాపుల్లో ఏ మధ్య రాత్రి అయినా తలుపు తట్టితే ఏటీఎం లాగా కావాల్సిన మద్యం లభిస్తుంది.పేరుకే కిరాణాలు. అమ్మేది మద్యం మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోనూ కొంతమంది పేరుకు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ.. లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. దీనికి తోడు వైన్ షాప్ యజమానులు సిండికేట్ గా ఏర్పడి బెల్ట్ షాపులకు ఒక మద్యం దుకాణం, కస్టమర్లకు మరో మద్యం దుకాణం చొప్పున కేటాయించి బెల్ట్ షాపులకు కేటాయించిన మద్యం షాపులో బెల్ట్ షాపులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. బెల్ట్ షాపుల్లో ఇంకా అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకున్నప్పటికీ, రాత్రనక, పగలనక మద్యం దొరుకుతుండడంతో.. మద్యం ప్రియులు మద్యాన్ని విపరీతంగా తాగుతూ మద్యం మత్తులో ఇంట్లో గొడవలు పెట్టుకుంటూ అర్ధరాత్రి వరకు నానా రభస సృష్టిస్తున్నారని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఆరోపిస్తున్నారు. బెల్టు షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్న ఎవరు పట్టించుకోవడం లేదని గ్రామాల్లోని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్ షాప్ ల కారణంగా ప్రతి గ్రామంలో మద్యం ఏరులై పారుతుంది. అధికారుల కనుసన్నల్లోనే బెల్టు షాపుల దందా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

**సీపీఎం మండల మహాసభలో జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్**




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, తెలంగాణలో ఉన్న కోటి యాభైమూడు వేల ఎకరాల సాగుకు నేటికి రైతు బరోసా (రైతుబంధు) అందలేదని తక్షణమే రైతు బరోసా ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల సీపీఎం ఎనిమిదవ మహాసభ నిర్వహించారు. మహాసభకు ముందు మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎండీ జహంగిర్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో 11,475 వేల కోట్ల రూపాయలు రైతు బరోసా ఇవ్వాల్సి ఉన్నదని డిమాండ్ చేశారు. వర్ష కాలంలో రైతులు పండించిన పంటను తక్షణమే కొనుగోలు చేయాలని వెంటనే ధాన్యం కొనుగోలు సెంటర్లలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం మాట్లాడుతూ.. మండలంలోని బునదిగాని కాలువ, భీమలింగం కాలువల పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. బునాదిగాని కాలువ పనులకోసం 266 కోట్ల బడ్జెట్ కేటాయించడం అభినదనీయమని కానీ కాలాయపన చేయకుండా వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బోలగాని జయరాములు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పైళ్ళ యాదిరెడ్డి , మండల కార్యదర్శి వేముల భిక్షం, నాయకులు గుణమోని స్వామి, రాచమల్ల సత్తయ్య, తుమ్మల సత్యనారాయణ రెడ్డి, తుమ్మలగూడెం యాదయ్య, మల్లెల శ్రీశైలం, భాషబోయిన బుగ్గయ్య, నాయిని రామిరెడ్డి, చెరకు మల్లేశం, మరిపెల్లి మల్లయ్య, భిక్షపతి, భారతమ్మ, నర్సమ్మ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, భూ సమస్యల పరిష్కారానికి

# తక్షణ చర్యలు చేపట్టాలి




**విశ్వంభర, భూపాలపల్లి:** ఎస్సీ, ఎస్టీల సమస్యలు తక్షణ పరిష్కారానికి కార్యాచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. శనివారం భూపాలపల్లి జిల్లా ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాలులో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేలతో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, సర్వీస్ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీల సమస్యలపై చర్చించామని తెలిపారు. కలెక్టర్, ఎస్పీ అన్ని సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. వారం రోజుల్లో అన్ని సమస్యలు పరిష్కరించి నివేదిక అందజేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో అలసత్వం వహించే అధికారులపై తప్పకుండా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భారత రాజ్యాంగంలో ఇచ్చిన హక్కులను అనుభవించే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని అందరూ సమానమేనని వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు. అన్ని మండలాల్లో ప్రతి నెలా చివరి వారంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ అధికారులు పౌర హక్కుల దినోత్సవం నిర్వహణపై కార్యాచరణ తయారు చేయాలని, దినోత్సవ సమాచారం కమిషన్ కు పంపాలని తాను, కమిషన్ సభ్యులు తప్పక పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొంటామని తెలిపారు. పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తే సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. భూపాలపల్లి మున్సిపల్ పరిధిలో ఎస్సీల ఇండ్లు కూల్చారని బాధితులు తెలుపగా నివేదికలు అందచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయిలో సమస్యలు. పరిష్కారం. కాకపోతే కమిషన్ కార్యాలయంలో దరఖాస్తు చేయాలని ఆయన తెలిపారు. సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోని అధికారులపై కమిషన్ కఠిన చర్యలు తీసుకుంతుందని హెచ్చరించారు. భూమి సమస్యలున్న మండలాల్లో గ్రామసభలు నిర్వహించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అట్రాసిటీ కేసుల్లో ఎలాంటి విచారణ అవసరం లేకుండా తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీస్ శాఖకు సూచించారు. అంతకుముందు అన్ని శాఖల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు, తాగునీటి సరఫరా, ఉపాధికల్పన, పరిశ్రమల యూనిట్ల ఏర్పాటు, వ్యవసాయం, భూ కొనుగోలు పథకం తదితర అంశాలపై అన్ని శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ, ఉప సంచాలకుల కార్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు అందచేయాలని పేర్కొన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. పక్కాగా ప్రతి నెలా పౌర హక్కుల దినోత్సవం నిర్వహించేందుకు కార్యచరణ ప్రణాళిక తయారు చేస్తామన్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు పౌర హక్కుల దినోత్సవం నిర్వహించి ఎస్సీ, ఎస్టీ ల హక్కులు, చట్టం గురించి వివరించే విధంగా, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనేందుకు వారం రోజులు ముందుగానే సమాచారం ఇస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించే డిస్ట్రిక్ట్ కమిటీ సమావేశపు సమాచారం కమిషన్ ఛైర్మన్‌కు వారం ముందుగానే అందిస్తామని తెలిపారు. జిలాల్లో భూములకు సంబంధించి 17 కేసులు పెండింగ్ ఉన్నాయని వారంలో పరిష్కరించి నివేదిక ఇస్తామని తెలిపారు. జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ పోస్టు ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కుసురం నీలాదేవి, రేణికుంట ప్రవీణ్, జిల్లా అటవీశాఖ అధికారి వసంత, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకాలు చదివే సంస్కృతి పెరగాలి : మంత్రి జూపల్లి

■ డిసెంబర్ 19 నుంచి 29 వరకు పుస్తక మహోత్సవం




**విశ్వంభర, హైదరాబాద్:** నేటి సమాజంలో పుస్తకాలు చదివే సంస్కృతి మరింత పెరగాలని తెలంగాణ సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన క్యాంప్ ఆఫీస్‌లో 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏటా హైదరాబాద్లో జరిగే బుక్ ఫెయిర్ సమాజంలో పుస్తకాలు చదివే సంస్కృతిని పెంచుతోందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 19 నుంచి 29 వరకూ ఎన్టీఆర్ స్టేడియంలో పదిరోజుల బుక్ ఫెయిర్ జరుగుతుందని, ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు అనుకూలంగా హైదరాబాద్ నగరంలో పుస్తక మహోత్సవం నిర్వహించే ఆనవాయితని కొనసాగించడం హర్షనీయం అని బుక్‌ఫెయిర్ నిర్వహకులను అభినందించారు. పదిరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో పుస్తక ప్రియులు, విద్యార్థులు, రచయితలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అధ్యక్షులు యాకూబ్ మాట్లాడుతూ.. బుక్ఫెయిర్ నిర్వహణకు సహకారం అందిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బుక్‌ఫెయిర్‌లో ప్రచురణ కర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం బుక్ ఫెయిర్ జనరల్ సెక్రటరీ ఆర్. వాసు మాట్లాడుతూ బుక్ ఫెయిర్లో విజిటర్లకు, రచయితలకు, స్టాల్ నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సుమారు 250కి కు పైగా జాతీయ, అంతర్జాతీయ పబ్లిషర్లు పాల్గొంటారని, పదిలక్షలకుపై పైగా జనం విజిట్ చేస్తారని తెలిపారు. విద్యార్థులకు తమ ఐడీ కార్డులతో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని ఆయన వివరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో కోశాధికారి నారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు కె. బాల్ రెడ్డి, శోభన్ బాబు, జాయింట్ సెక్రటరీలు కె. సురేశ్, ఎం. సూరిబాబు, ఈసీ సభ్యులు జనార్దన్ గుప్తా విజయారావు, మధుకర్, కోటేశ్వర రావు, శ్రీకాంత్, శ్రీనివాసరావు, సాంబశివరావు, స్వరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మామిడి సాగులో రైతులకు సూచనలు



**విశ్వంభర, మహబూబాబాద్ :** జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న మరిపెడ, మహబూబాబాద్, నర్సింహులపేట తదితర మండలాల్లో సాగులో ఉన్న మామిడి తోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో మామిడి 13,006 ఎకరాలలో సాగు చేస్తున్నారని, మామిడి తోటలు ప్రస్తుతం ఇగురు, కొమ్మ దశలో వున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు సస్య రక్షణ చర్యలు, మేలైన యాజమాన్య పద్ధతులపై సూచించారు. క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం కొమ్మ కత్తిరింపులు, పునరుద్ధరణ, మల్చింగ్, సేంద్రియ పద్ధతులు, బిందు సేద్యంతో నీటి సరఫరా, ఫర్టిగేషన్ ద్వారా ఎరువులు ఇవ్వడం, పచ్చి రొట్ట వాడకం, అధిక సాంద్రతలో మొక్కలు వేయటం, ఎత్తు మడుల పద్ధతి పాటించడం, మార్కెట్ డిమాండ్ ఉన్న రకాలైన హిమాయత్, కేసరి, అల్ఫాన్సో వంటి పండు రకాలు, పచ్చడి రకాలు, నూతన రకాలు సాగు చేయాలని రైతులకు తెలిపారు.

## కేటీఆర్ ఏకపాత్రాభినయం అట్టర్ ఫ్లాప్

### టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ ఎద్దేవా



**విశ్వంభర, హైదరాబాద్:** మూసీ నది పునరుజ్జీవం అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ అంతా ఆత్మస్తుతి, పరనిందలాగా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు. గాంధీభవన్‌లో శని వారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ వాస్తవాలను వక్రీకరించి, అవాస్తవాలను వల్లెవేస్తూ, తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టించాలని కేటీఆర్ ఏకపాత్రాభినయం అట్టర్ ఫ్లాప్ అయిందని ఎద్దేవా చేశారు. ఏ ప్రభుత్వమైనా ఏదేని ప్రాజెక్టును ప్రారంభించే ముందే ప్రాధాన్యతలను తెలియజేస్తే, నిపుణులు విధివిధానాలను, పునరావాస ప్యాకేజీలను, బడ్జెట్ అంచనాలను రూపొందించి నివేదిక సమర్పిస్తారు. అపుడు ప్రభుత్వం ఆ నివేది కపై పూర్తిస్థాయి సమీక్ష జరిపి పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తుంది. మాజీ మంత్రి కేటీఆర్ కు ఈమాత్రం తెలియదా అని బండి సుధాకర్ గౌడ్ ప్రశ్నించారు. మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనప్రాయంగా చెబితే, 1 లక్షా 50 వేల కోట్ల రూపాయలు లూటీ జరుగుతుందని కేటీఆర్ గోబెల్స్ ప్రచారం చేయ డం ఆయన అవివేకానికి నిదర్శనమని బండి దుయ్యబట్టారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్న పుడు మూసీ నదిపై సమీక చేసి, ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్లు ఫిక్స్ చేసి, నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని నిర్ణయించింది నిజమే కదా అని బండి గుర్తు చేశారు. వికారాబాద్ అనంతగిరి కొండల నుంచి నల్లగొండ జిల్లాలో కృష్ణా నదిలో కలిసేదాకా దాదాపు 3 లక్షల 25 వేల ఎకరాలకు సాగునీటికి, భూగర్భ జలాలు పెరిగి సాగునీటికి ఉపయోగపడుతున్న మూసీని అవహేళన చేయడం కేటీఆర్ దురహంకారానికి నిదర్శనమేనని బండి విమర్శించారు. అధికారం పోయిన బాధను జీర్ణించుకోలేని కేటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నాడని, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు ప్రజలు నమ్మబోరని, సరైన సమయంలో బుద్ధి చెబుతారని బండి హెచ్చరించారు.

## టోల్ గేట్ రుసుము వసూలు నిలిపివేయాలి

■ కలెక్టర్ కు బీఆర్ఎస్ నేతల వినతి



**విశ్వంభర, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల సరిహద్దు ప్రాంతమైన మేడిపల్లి వద్ద జాతీయ హైవే అథారిటీ ఏర్పాటు చేసిన టోల్ గేట్ వద్ద రుసుము వసూల్లను నిలిపివేయాలని భారత రాష్ట్ర సమితి కాటారం సబ్ డివిజన్ నాయకులు జోడు శ్రీనివాస్, రామిల్ల కిరణ్, జక్కు శ్రావన్ లు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. శనివారం గుట్టు చప్పుడు కాకుండా దొంగ చాటున నేషనల్ హైవే అథారిటీ అధికారులు, కాంట్రాక్టర్లు టోల్ గేట్‌ను ఎవరికి తెలియకుండానే ప్రారంభించారని వారు దుయ్యబట్టారు. ఈ విషయమై అధికారులను, సంబంధిత కాంట్రాక్టు సిబ్బందిని ప్రశ్నించగా వారి నుండి సరైన సమాధానం రాలేదన్నారు. భూపాలపల్లి జిల్లా కాటారం, మహాదేవపూర్ మండలాల నుంచి నిత్యం వందలాది ఇసుక లారీలు హైదరాబాద్ కు తరలి వెళ్తున్న నేపథ్యంలో రోడ్డు గుంతలు గుంతలుగా ఏర్పడి గాడీలు పడ్డాయని వారు వెల్లడించారు. దాంతో అనేక సందర్భాల్లో ప్రమాదాలు జరిగి ఎందరో మృత్యువాత పడ్డ సంఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో టోల్ గేట్ రుసుము వసూలు చేయడం సమంజసం కాదని వారు అన్నారు. జాతీయ హైవే అథారిటీ అధికారులు, కాంట్రాక్టర్లు తక్షణమే రోడ్డును బాగు చేయించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రోడ్డును బాగు చేసిన తర్వాతనే టోల్గేట్ రుసుము వసూలు చేయాలని వినతి పత్రంలో వారు కోరారు. ఇదిలా ఉండగా టోల్ గేట్ ప్రారంభించిన విషయం తెలుసుకున్న సమీప గ్రామ ప్రజలు, భూ నిర్వాసితులు పెద్ద ఎత్తున టోల్ గేట్ వద్ద నిరసన తెలియజేశారు. నిర్వాసితులకు సరైన న్యాయం చేకూర్చలేదని వారు ఆందోళన చేశారు. వరంగల్ ఏరియా డీఈ కుమారస్వామిని టోల్ గేట్ ప్రారంభం సమాచారం విషయమై స్థానిక విలేకరులు అడగగా తమకు ఏమి సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.

## రేపు జాబ్ మేళా

### ఐటీఐ ప్రిన్సిపాల్ ఆర్ సురేంద్రబాబు



**విశ్వంభర, వికారాబాద్:** వికారాబాద్ ప్రభుత్వ పారిశ్రామిక సంస్థ ఐటీఐలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళ, జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.నరేంద్రబాబు తెలిపారు. ఈ అప్రెంటిషిప్ మేళ నందు లోకేష్ ఇండస్ట్రీస్, తోషిబా, లక్ష్మీ హుండాయ్, వెల్సున్ ఇండస్ట్రీస్, కార్తికేయ ఇండస్ట్రీస్, పెన్నార్ ఇండస్ట్రీస్, జాన్సన్ లిఫ్ట్, తదితర కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఐటీఐ, డిప్లమా ఉత్తీర్ణులైన ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అప్రెంటిషిప్ మేళకు వచ్చే వారు పదవ తరగతి, ఐటీఐ మార్క్స్ మెమో, కుల ధృవీకరణ సర్టిఫికేట్ తోపాటు పూర్తి వివరాలతో కూడిన బయోడేటా ఫారాన్ని తీసుకొని రావాల్సిందిగా అదే విధంగా ఏదైనా సమాచారం కోసం 9177472488ను సంప్రదించాలని తెలిపారు.

## సబ్ కోర్టును ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తులు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో సబ్ కోర్టును హైకోర్టు న్యాయమూర్తులు జువ్వాడి శ్రీదేవి, కూనూరు లక్ష్మణ్, కలెక్టర్ హనుమంత్ కె.జెండగేలు శనివారం ప్రారంభించారు. అనంతరం కోర్టు గదులను పరిశీలించారు. భువనగిరి, చౌటుప్పల్, రామన్నపేట బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తులను ఘనంగా శాలువాలు, బొకేలతో సత్కరించారు. ప్రస్తుతం రామన్నపేటలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులు ఉన్నాయి. ఈ సబ్ కోర్టు పరిధిలోకి రామన్నపేట, చౌటుప్పల్, పోచంపల్లి, మోత్కూరు, అడ్డగూడూరు, వలిగొండతో పాటు నారాయణపురం రెవెన్యూ మండలాలు రానున్నాయి. జిల్లా జస్టిస్ సంపూర్ణ ఆనంద్, డీసీపీ రాజేశ్ చంద్ర ఐపీఎస్, రామన్నపేట కోర్టుల జడ్జ్ లు ప్రదీప్, చందన, చౌటుప్పల్ కోర్టు జడ్జి పటోల్ల మధుసూదన్ రెడ్డి, తహశీల్దార్ సీ లాల్ బహదూర్, ఎంపీడీఓ యాకూబ్ నాయక్, రామన్నపేట సీఐ నిగిడాల వెంకటేశ్వర్లు, ఎస్ఐ పీ మల్లయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ మజీద్, సీనియర్ న్యాయవాదులు యాపాల కృష్ణారెడ్డి, జినుకల ప్రభాకర్, కంపాటి యాదగిరి, బాసరాజు అశోక్ కుమార్, నరేందర్ రావు, గాలి లింగయ్య, సత్తయ్య, మామిడి వెంకట్ రెడ్డి, సుక్క శ్రవణ్ కుమార్, శోభన్ బాబు, అశోక్ కుమార్, జగతయ్య, బర్ల డేవిడ్, నకిరేకంటి మొగులయ్య, కొండూరు బాలరాజు, ఎస్.బాలరాజు, ఏళ్ల శ్రీశైలం, దినేష్, స్వామి, రమేష్, అజీజ్,రెండు కోర్టుల సూపరిండెంట్లు నారగోని గంగాభవాని, బాలగోని శివరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాలుష్య పరిశ్రమను వ్యతిరేకిస్తూ.. రోడ్డెక్కిన విద్యార్థులు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల పరిధిలో పెట్టబోయే అంబుజా కాలుష్య సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ రామన్నపేటలో విద్యార్థి సంఘాలు, పాఠశాలల యాజమాన్యాలు, పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్థానిక సుభాష్ సెంటర్లో మానవహారం నిర్వహించి తమ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా చేసే అంబుజా సిమెంట్ పరిశ్రమ మాకొద్దు, మా భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయొద్దు అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. పర్యావరణాన్ని ప్రజా ఆరోగ్యాన్ని విధ్వంసం చేసి, ప్రమాదకర రసాయనాలతో వాయు కాలుష్యం చేసి ప్రాణాంతక వ్యాధులకు కారణమయ్యే కాలుష్య పరిశ్రమ నిర్మిస్తే విద్యార్థులుగా ఊరుకునేది లేదని తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ జల్లెల పెంటయ్య, కో-కన్వీనర్ మహమ్మద్ రెహాన్, సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ, సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మాజీ ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి బలరాం, టీడీపీ నాయకులు ఫజల్ బేగ్, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు గూని రాజు, డిఎస్పి నాయకులు నకిరేకంటి నరేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, టీఎంఎస్ఎఫ్ నాయకులు నకిరేకంటి గణేష్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటేపాక శివకుమార్, పాఠశాలల కరస్పాండెంట్లు, తిరుగుడు మల్లికార్జున్, మార్టిన్, గంగుల నరేందర్ రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు ఎస్.కే చాంద్, నీలా ఐలయ్య, పోచబోయిన మల్లేశం, శానకొండ వెంకటేశ్వర్లు, మేకల జలంధర్, పుట్టల ఉదయ్ కుమార్, తుర్కపల్లి నరేష్ పాల్గొన్నారు.

## కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం



**విశ్వంభర, మహేశ్వరం:** కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ ఉచిత శిక్షణ శిబిరాన్ని దుబ్బచర్ల గ్రామంలో నాబార్డ్ సంస్థ సహకారంతో సొసైటీ ఫర్ ఎకనామికల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్లేస్మెంట్ ఆఫీసర్ శరత్ చంద్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ ఎకనామికల్ డెవలప్మెంట్ ట్రెజరర్ ఆఫీసర్ రమేష్, రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ షేక్ హాజీ బాబా, కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ ట్రైనింగ్ మాస్టర్ ప్రేమలత, దుబ్బచర్ల గ్రామ సంఘం అధ్యక్షురాలు రమాదేవి, సుభాన్ పూర్ గ్రామం అధ్యక్షురాలు ఖుషి, గ్రామస్వయం సహాక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని కుంకుడుపాముల, ఎన్నారం, పలివాడ, మునిపంపుల, దుబ్బాక, రామన్నపేట, నిదాన్ పల్లి, ఇంద్రపాలనగరం గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి మల్లారెడ్డి, సీనియర్ నాయకులు వెంకట రాజిరెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు, మండల అధికారులు, గ్రామ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చాలి

### కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



**విశ్వంభర, ఆమనగల్లు :** కల్వకుర్తి ప్రస్తుత ఎమ్మెల్యే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. ఆయన ఆమనగల్లు మండల కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తన హయాంలో చాలా అభివృద్ధి పనులు చేశానని ప్రస్తుత ఎమ్మెల్యేకు అవి కనబడడం లేవని, ప్రస్తుతం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారంలో ఉన్నారు కాబట్టి నియోజక అభివృద్ధి చేయాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి జరగలేదని విమర్శించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి అనురాధ పత్యానాయక్, మాజీ సర్పంచ్ శ్రీను నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంతన్ గౌడ్, మైనారిటీ నాయకులు ఖాదర్, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ రమేష్, యూత్ నాయకులు వెంకటేష్, కోట శీను, యంగలి రఘు, తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు

## బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ కంప్యూటర్ల విరాళం



**విశ్వంభర, పెద్ద శంకరంపేట్:** నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం కృష్ణ పాడిశెట్టి స్థాపించిన బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5 కొత్త కంప్యూటర్ లను ఎమ్మెల్యే అందజేశారు ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి మాట్లాడుతూ నారాయణఖేడ్ పట్టణంలో అడగగానే మూడు (3) పాఠశాలలకు అవసరమైన కంప్యూటర్ ల్యాబ్ లను అందించినందుకు బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సంస్థకు, కృష్ణ పాడి శెట్టికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వారితోపాటు శ్రీమతి మాధవి, ఫణి కుమార్, అడ్వర్టైజర్ మెరియన్ పాలి వ్యాపారవేత్త శ్రీమతి అమూల్య రెడ్డి, బ్రైట్ సైడ్ ఫౌండేషన్ సభ్యులు కార్తీక్ కోరుకొండ, సూర్య జిడ్డు, అభిలాష్ పెరుమాండ్లు, వంశీ కంచం, ఈశ్వర్ పినిగళ్ళ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, వివేకానంద, హనుమాండ్లు కౌన్సిలర్లు, జూనియర్ కళాశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల ఉపాధ్యాయులు బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని భోగారం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు గంట్యాల అర్జున్(35) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోశిక వెంకటేశ్వర్లు అర్జున్ భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి పదివేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోడి పాండు, జెళ్ళ దత్తాద్రి, రాపోలు బలరాం, రచ్చ ఆనంద్, దోర్నాల రాములు, గుర్రం భిక్షపతి, గోగు సత్తయ్య తదితరులు ఉన్నారు. **– విశ్వంభర, రామన్నపేట**

# గౌడ కులస్తుల అభ్యున్నతికి కృషి

- బొమ్మగాని ప్రభాకర్ గౌడ్
- ఘనంగా తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం
- 67వ వార్షికోత్సవ వేడుకలు



**విశ్వంభర, ఎల్బీనగర్:** రాజకీయాలకతీతంగా నాడు బొమ్మగాని ధర్మభిక్షం అన్ని కులాల అభివృద్ధికి పాటుపడ్డారని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం 67వ వార్షికోత్సవ వేడుకలను ఎల్బీనగర్ నియోజకవర్గం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని సరూర్‌నగర్ గౌడ సంక్షేమ సంఘ భవనంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు మాజీ ఎంపీ దివంగత బొమ్మగాని ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గీత వృత్తిని నిర్వీర్యం చేసేందుకు గతంలో ఎన్నో కుట్రలు జరిగాయని, ఆ కుట్రలను బొమ్మగాని ధర్మభిక్షం తిప్పి కొట్టారని తెలిపారు. దున్నేవాడిదే భూమి, సాయుధ పోరాటం ఇలా అనేక పోరాటాల్లో బొమ్మగాని ధర్మభిక్షం తనదైన పాత్రను పోషించాలని కొనియాడారు. బొమ్మగాని ధర్మభిక్షం ఒక కులానికి చెందిన వాడు కాదని, అన్నివర్గాల వారికి సుపరిచితుడని, అందరివాడని అన్నారు. ఆయన జీవిత కాలం పేద ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేశారని తెలిపారు. గీత కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని చూసి చలించిన బొమ్మగాని ధర్మభిక్షం తెలంగాణ రాష్ట్ర పని వారల సంఘాన్ని స్థాపించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా గీత కార్మికులను ఐక్యం చేసి వారి పక్షాన పోరాటం చేశారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మద్యపాన నిషేధాన్ని విధించాలని పోరాటం చేసిన ఏకైక వ్యక్తి బొమ్మగాని బొమ్మగాని ధర్మభిక్షం అన్నారు. పార్టీలు వేరైనా గౌడ కులస్తులు తమ కుల అభ్యున్నతికి పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. గీత కార్మికుల పిల్లలను ఉన్నత విద్యాలవంతులుగా తయారుచేసి అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి ధ్యేయంగా నాడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్ని కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి ఎనలేని పోరాటం చేశారని కొనియాడారు. గౌడ మహనీయుల పోరాట స్ఫూర్తితో గౌడ కులస్తుల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కంకణబద్ధులై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గీత కార్మికుల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్ రెడ్డి తాటి చెట్లను పెంచే విధంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పడం హర్షనీయమని అన్నారు. అదేవిధంగా ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.10లక్షల నష్టపరిహారం చెల్లించడంతో పాటు గీత కార్మికులకు రూ.5వేల పింఛన్లను మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం ఉపాధ్యక్షులు పండ్ల రాములు గౌడ్, రాష్ట్ర సెంటర్ కో-ఆర్డినేటి సెక్రటరీ బి.నాగభూషణం గౌడ్, కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్, గౌడ సంఘాల జేఏసీ అధ్యక్షులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, సరూర్‌నగర్ గౌడ సంక్షేమ సంఘం దయానంద్ స్వామిగౌడ్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కందికంటి శ్రీధర్ గౌడ్, గౌడ సంఘాల ప్రతినిధులు కట్ట ఈశ్వరయ్య గౌడ్, రావుల రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందజేత



**విశ్వంభర, నల్గొండ:** త్రిపురారం మండల కేంద్రం రైతు వేదికగా నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జేవీర్ రెడ్డి కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మండల కేంద్రంలోని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలానికి చెందిన 11 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులను 11 లక్షల 176 రూపాయలు, అలాగే సీఎం సహాయనిధి ద్వారా 30 మంది లబ్ధిదారులకు మూడు లక్షల అరు వేల రూపాయల విలువగల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని అన్ని విధాల అన్ని వేళల అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముడిమల్ల బుచ్చిరెడ్డి, భాస్కర్ నాయక్, అనుముల వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సత్యం, అనంత రెడ్డి, బాలకృష్ణ, దన్సింగ్ నాయక్, చందు నాయక్, పాండు నాయక్, మహిళలు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న ప్రతీ కార్యకర్తలను కాపాడుకుంటా..

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**విశ్వంభర, సికింద్రాబాద్:** చిల్కానగర్ డివిజన్ మల్లికార్జున్ నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రామ చందర్ నాయక్ భార్య తులసి పక్షపాతంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొన ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి కంటెస్టెంట్ మేడ్చల్ మల్కాజ్గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి రామచంద్రనాయక్ తో మాట్లాడుతూ తన భార్యకు చికిత్సకు కావలసిన ఎటువంటి సహాయాన్నైనా చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది అదేవిధంగా పార్టీకి అంకితభావంతోపని చేసే ప్రతి కార్యకర్తకి ఎటువంటి ఆపద వచ్చిన తాను ముందుంటూ ఎల్లప్పుడూ వారి బాగోగులు చూసుకుంటానని, పార్టీకి అంకిత భావంతో పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానాన్ని కల్పించే విషయంలో తాను ఎప్పుడూ ముందు ఉంటానని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మల్లికార్జున్ నగర్ నాయకులు అశోక్ చారి, ఉపేందర్, సుందర్, సంతోష్, ఓర్సు పెంటయ్య, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, ఉద్యమ, యువత, మహిళ నాయకురాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సేవాలాల్ సేన నూతన కమిటీ



**విశ్వంభర, కేశంపేట్ :** రంగారెడ్డి జిల్లా కేశంపేట్ మండల శ్యామ్ రావు తండా, నాను తండాలో సేవాలాల్ సేన నూతన కమిటీలు శనివారం వేయడం జరిగింది శ్యామ్ రావు తండా అధ్యక్షులు మూడవత్ బిచ్చు నాయక్ కేశంపేట మండలం రైతు సేన అధ్యక్షులు పి. చందు నాయక్, మండల సోషల్ మీడియా రమేష్ నాయక్, గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రవి నాయక్, గ్రామ ప్రధాన కార్య దర్శి శివ కుమార్ నాయక్, మండల్ యూత్ అధ్యక్షులు మూడవత్ రమేష్ నాయక్, కేశంపేట్ మండలం గౌరవ అధ్యక్షులు జై. బద్రు లాల్ నాయక్, షాద్ నగర్ నియోజకవర్గం రైతు సేన అధ్యక్షులు మూడవత్ శ్రీను నాయక్ ని నియమించి సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర ఉప అధ్యక్షులు పాత్లావత్ రవి నాయక్ నియామక పత్రలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం జిల్లా ప్రధాన కార్యా దర్శి సేవ్యా నాయక్, కేశంపేట్ మండల్ ఉప అధ్యక్షులు నేనవత్ రవి నాయక్, ఫరూక్ నగర్ మండల్ సభవత్ మేగ్య నాయక్, వెలిజర్ల గ్రామ అధ్యక్షులు కేతావత్ శ్రీను నాయక్ పాల్గొన్నారు.



**పెద్ద శంకరంపేట్ మండలంలో ప్రసిద్ధి చెందిన కొప్పుల్ ఉమా సంగమేశ్వర స్వామి దేవాలయంలో శనివారం తోగుట పీఠాధిపతి మాధవానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన శత రుద్ర పూజ యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, సంగమేశ్వర్ సెట్, నారా గౌడ్, పెరిమల్ గౌడ్, మధుసూదన్, రాజు, సత్యనారాయణ,సంత్ సేట్, తదితర మండల నాయకులు పాల్గొన్నారు. - విశ్వంభర, పెద్ద శంకరంపేట్**

## ఇన్సూరెన్స్ చెక్కును అందజేసిన మాజీ ఎమ్మెల్యే



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** శంకరంపేట్(అ)మండలం ఇసుక బాయి తండాకు చెందిన నునావత్ నెహ్రు ప్రమాదవశాత్తు ఇటీవల మరణించాడు. నునావత్ నెహ్రు భార్య నునావత్ నాగమణికి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ప్రవేశ పెట్టిన పార్టీ సభ్యత్వం 2 లక్షల రూపాయల చెక్కును నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి అందజేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి పథకం ఏ రాజకీయ పార్టీలో లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీలోని ఏ కార్యకర్త అయిన ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ పథకం ద్వారా నారాయణఖేడ్ నియోజకవర్గంలో అనేకమంది కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రమేష్, తాజా మాజీ జెడ్పిటిసి రవీందర్ నాయక్, మండల కో ఆప్షన్ సభ్యులు యాదుల, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు సురేష్ గౌడ్, మాజీ ఎంపిటిసి ముజామిల్, మాజీ సర్పంచ్ గోపాల్, మాజీ ఉపసర్పంచ్ రమేష్, నాయకులు మాణిక్ రెడ్డి, గోపాల్, తదితరులు ఉన్నారు.

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మార్పీఎస్ నాయకులు




**విశ్వంభర, చింతపల్లి :** ఎమ్మార్పీఎస్ చింతపల్లి మండల నాయకులు సందే ఏసు మాతృమూర్తి కొన్ని రోజుల క్రితం మరణించడంతో మండల ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం వారి స్వగ్రామం తీదేడుకి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి 15వేల రూపాయలు ఆర్థిక సహాయం అందచేశారు. మాదిగలు అంతా ఐక్యంగా వుండి ఒకరికొకరు తోడుగా ముందుకు కొనసాగాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. మాసని పెద్దయ్య ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు, కురుమేటి కృష్ణయ్య వర్కలా, చెన్నయ్య బావండ్లపల్లి నల్లకాశయ్య, ఆరెకంటి యాదయ్య ఏర్పుల దావలయ్య, కోడిదుటి లక్ష్మణ్, కోడిదుటి జంగయ్య, వైపాక జంగయ్య, డొంకు శేఖర్, ఆరకంటి యాదగిరి, శెట్టిపల్లి రవీందర్, తిరుమలాపురం, నల్ల శ్రీకాంత్, కురుమేటి వెంకటరమణ, పోలే యాదయ్య, పోలె రాజు, ఊరే భాస్కర్, సిద్ద సాయి కుమార్, పోలె రాజు, ఏర్పుల శ్రీను పాల్గొన్నారు.

## బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ధర్నా



**విశ్వంభర, షాద్ నగర్ :** శనివారం షాద్ నగర్ చౌరస్తాలో రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హిందువులపై హిందూ దేవుళ్ళ పైన దాడులు రోజు రోజుకు పెరుగుతున్నాయని బజరంగ్ దళ్ కన్వీనర్ గూడెం రమేష్ అన్నారు. బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శనివారం షాద్‌నగర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. గూడెం రమేష్ మాట్లాడుతూ ఒక వర్గం ప్రజలకు మద్దతు ఇస్తూ ఈ రాష్ట్ర ప్రభుత్వం పాలన నడిపిస్తుందన్నారు. పోలీసులు దానికి వత్తాసు పలుకుతూ దాడులు చేసిన వారిని శిక్షించకుండా మతిస్థిమితం లేని వాళ్ళు మైనార్టీ అని ప్రకటనలు ఇవ్వడం సరి కాదని, హిందువులందరూ సహనంతో ఉన్నారని రాష్ట్రంలో ఉన్న హిందువులందరూ ఏకమై దాడులకు పాల్పడితే చట్టాన్ని చేతిలోకి తీసుకోవాల్సి వస్తుందని బజరంగ్ దళ్ హెచ్చరించారు. ఇప్పటికైనా విగ్రహాలు పగలగొట్టిన వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని లేనియెడల అన్ని గ్రామాల నుంచి హిందువులందరూ పెద్ద సంఖ్యలో వచ్చి ధర్నాలు రాస్తారోకాలు చేస్తారని హెచ్చరించారు. వీహెచ్ పీ మండల అధ్యక్షులు హనుమంతు రెడ్డి, బజరంగ్ దళ్ ప్రఖండ సంయోజక కేటా వంశీ, నగర సాహ సంయోజక్ లు రోళ్ల గిరి, వినయ్, కొత్తూరు మండల సంయోజక్ శివకుమార్ చారి, సాహసంయోజక్ సందీప్ సింగ్, వీహెచ్ పి అధ్యక్షులు సందీప్, దిలీప్, చెరుక శివ, భాను సురేష్, పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న లైన్ మెన్‌కు సన్మానం



**విశ్వంభర, చింతపల్లి:** తీదేడు (వెంకటం పేట) గ్రామ విద్యుత్ లైన్ మెన్ వడ్లకొండ యాదయ్య బదిలీపై వెళ్తున్న సందర్భంగా లైన్ తీదేడు గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తీదేడు మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ ధరణిపతి రమణా రావు, మాజీ సర్పంచ్ దాసరి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. లైన్ మెన్ యాదయ్య తీదేడు సబ్ స్టేషన్ పరిధిలో 20 సంవత్సరాలు పని చేసి ప్రజల మన్ననలను పొందారన్నారు. ప్రజాలందరితో కలిసిమెలిసి ఉండి పనులు చేస్తు చిన్న,పెద్ద తేడాలేకుండా అందరిని కలుపుకొని ఉండేవారు. ఆయన బదిలీపై వెళ్లడం విచారకరం అన్నారు. తోలుతా లైన్ మెన్ ను గ్రామ ప్రజలు విద్యుత్ సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో తీదేడు మాజీ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ధరణిపతి రమణా రావు, మాజీ సర్పంచ్ దాసరి శ్రీనివాస్ యాదవ్, రామవత్ శ్రీనివాస్ నాయక్, గంటల చంద్రమౌళి, మెండే రాములు, విద్యుత్ సిబ్బంది, శ్రీను, నరేష్, సర్వర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధి మీద శ్రద్ధ లేదు

### బీఆర్ఎస్ పార్టీ కడ్తాల్ అధ్యక్షుడు కంబాల పరమేష్



**విశ్వంభర, కడ్తాల్ :** కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధి మీద కొంచెం కూడా శ్రద్ధ లేదని కడ్తాల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కంబాల పరమేష్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దగ్గరపడిన మండలానికి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూపాయి కూడా మంజూరు కాలేదని కడ్తాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కంబాలపల్లి పరమేష్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నూతనంగా ఏర్పడిన కస్తూరిబా పాఠశాల మండల కార్యాలయం గత ప్రభుత్వంలో నిర్మించింది అని రేవంత్ రెడ్డి ప్రభుత్వం మండలాన్ని అభివృద్ధి చేయకుండా చోద్యం చూస్తుందని అన్నారు. తక్షణమే నిధులు కేటాయించి వైద్యశాలను బస్టాండును తదితర అభివృద్ధి పనులు ప్రారంభించాలని కంబాల పరమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి దశత్ నాయక్, ఆమనగల్ పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్, మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఎంపిటిసి లచ్చిరాం నాయక్, మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, ఉప సర్పంచ్ రామకృష్ణ, వినోద, రైతు కోఆర్డినేటర్ జోగు వీరయ్య, డైరెక్టర్ లాయక్ అలీ, శీను, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## సెల్ మార్ ల్యాబ్ పరిశ్రమ ట్యాంక్‌లో వ్యక్తి మృతి



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని సెల్ మార్ ల్యాబ్ పరిశ్రమలో బ్రయిన్ ట్యాంక్‌లో పడి పి.రాజేష్ కుమార్ (31) అనుమానస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బొల్లారం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బొల్లారం పోలీసుల వివరాల ప్రకారం భద్రాచలంకు చెందిన రాజేష్ కుమార్ సెల్ మార్ ల్యాబ్ పరిశ్రమలో విద్యుత్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్ చేరు ప్రభుత్వఏరియా ఆసుపత్రి కి తరలించారు.

## మహబూబాబాద్ జిల్లా పోలీసుకు గోల్డ్ మెడల్



**విశ్వంభర, మహబూబాబాద్:** ఈనెల 16 నుంచి 19 తారీఖున తెలంగాణస్టేట్ పోలీస్ అకాడమీలో జరిగిన తెలంగాణ స్టేట్ 1st పోలీస్ డ్యూటీ మీట్‌లో భద్రాద్రి జోన్ మహబూబాబాద్ జిల్లా బీడీ టీమ్‌లో పనిచేస్తున్నా K.అంజయ్యకు సీఐడీ ఛీఫ్ శిఖాగోయల్ పోలీసుఅకాడమీ డైరెక్టర్ అభిలాషబిస్త్ అండ్ ఆడిషనల్ డిజీ స్వాతి లక్రా రూమ్ సెర్చ్ గోల్డ్ మెడల్ అందజేశారు. ఎవరైనా వీఐపీలు వివి.ఐ.పి లు ఒక ప్రదేశానికి వచ్చినప్పుడు వాళ్లు వుండే గదిని ఎలాంటి అనుమానాస్పద వస్తువులు వుండకుండా చూసుకునే విధానంలో తెలంగాణ రాష్టం నుంచి 7 జోన్లు 5 కమిషనర్ రేట్స్ పాల్గొన్నాయి. మహబూబాబాద్ జిల్లాకు గోల్డ్ మెడల్ రావడం జరిగింది జిల్లా ఎస్పీ సుధీర్ రంనాథ్ కేకన్ IPS ఆర్ ఐ అడ్మిన్, డీఎస్పీలు అంజయ్యకు అభినందనలు తెలియజేసారు.

## రేణుక ఎల్లమ్మ కోలాట బృందం సమావేశం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం టీ రాపాక గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ కోలాట బృందం సమావేశం అధ్యక్షురాలు ఏనుతుల కవిత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రజానాట్యమండలి యాదాద్రి భువన జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ పాల్గొని మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో కళాకారులను ఈ ప్రభుత్వం ఆదుకోవాలని అదే విధంగా గుర్తింపు కార్డులు బస్సు ట్రైన్లలో ప్రయాణం ఫ్రీగా అవకాశం కల్పించాలని, యాదగిరిగుట్టపై బ్రహ్మోత్సవాలకు అవకాశం కల్పించాలని అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ఇంప్లిమెంట్ ప్రచారం చేయడానికి కళాకారులకు అవకాశం కల్పించాలని టీ రేపాకలో ప్రభుత్వ భూములు కళాకారులకు సాగు చేసుకోవడానికి ఇట్టి స్థలాలు కేటాయించాలని తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చెక్క వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎలేంద్ర మాధవి, అనురాధ, మంజుల, రాములమ్మ, యాదమ్మ, లక్ష్మి, ఉపేంద్ర లక్ష్మి, లక్ష్మి పద్మ, పుల్లమ్మ, మౌనిక, మాధవి, సప్న, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



**విశ్వంభర హైదరాబాద్ :** చంద్రాయన గుట్ట నియోజకవర్గంలో ఏఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫలక్ నుమా ప్రాంతంలోని బంజారా వెల్ఫేర్ కమ్యూనిటీ హాల్ లో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. భారత్ వికాస్ పరిషత్ సహకారంతో ఆస్టర్ హాస్పిటల్స్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు స్థానికులు హాజరయ్యారు.

## అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

**విశ్వంభర, మహబూబాబాద్:** 2024-25వ విద్యా సంవత్సరమునకు తెలంగాణ ప్రభుత్వం విదేశీ విద్యాలయల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా నిర్వహించబడు "అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకము" ద్వారా షెడ్యుల్డ్ కులములకు చెందిన విద్యార్థులకు 20 లక్షల రూపాయల స్కాలర్ షిప్ అందించుటకు నిర్ణయించడమైనదని, యూఎస్ఏయూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మని, జపాన్, సౌత్ కొరియా న్యూజిలాండ్ విశ్వ విద్యాలయల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదలగు ప్రొఫెషనల్ కోర్సుల్లో చదువాలనుకుంటున్న ఎస్సీ విద్యార్థుల నుంచి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యుల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి పీ నర్మద ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకము కొరకు చివరి తేది: 29-10-2024 కావున జిల్లాలోని అర్హులైన ఎస్సీ విద్యార్థులు ఈపాస్ వెబ్ సైట్లో www.telangana.epass.cgg.gov.in లో ధరఖాస్తు చేసుకోవాలని, నిర్దిష్టమైన ఫార్మాట్లో అవసరమైన డాక్యుమెంట్లతో విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలు ఈపాస్ వెబ్ సైట్లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

# విఫలమైన పవర్ గ్రిడ్

- అంధకారంలో క్యూబా
- స్కూళ్లు, పరిశ్రమల మూత
- ఇబ్బందులు పడుతున్న కోటిమంది



**హవానా:** ద్వీప దేశం క్యూబాలో ఒక్కసారిగా అంధకారం అలముకుంది. దేశంలోని ప్రధాన విద్యుత్ ప్లాంట్‌లలో ఒకటి విఫలం కావడంతో జాతీయ పవర్ గ్రిడ్ ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో దేశంలో తీవ్ర విద్యుత్ సంక్షోభం తలెత్తిందని దేశ విద్యుత్‌శాఖ మంత్రి పేర్కొన్నారు. విద్యుత్ లేకపోవడంతో దేశంలోని పాఠశాలలన్నింటినీ మూసివేశారు. అత్యవసరం కాని పరిశ్రమలను మూసివేసి కార్మికులను ఇళ్లకు పంపించారు. పవర్ ప్లాంట్ విఫలం కావడానికి కారణాలు తెలియలేదు. విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టేవరకు విశ్రాంతి లేదని క్యూబా అధ్యక్షుడు మిజిల్ డియాజ్ కేనల్ పేర్కొన్నారు. ఒక్కసారిగా ఆహారం, నీళ్లు, ఇంధనం, ఔషధాల సరఫరా దెబ్బతినడంతో దాదాపు కోటి మంది క్యూబా వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఉక్కపోతతో ద్వీప దేశవాసులు, పర్యటకులు అల్లాడుతున్నారు. పునరుద్ధరణ చర్యలు చేపట్టినప్పటికీ విద్యుత్ సరఫరా ఆలస్యంఅయ్యే అవకాశంఉందని అక్కడిఅధికారులు పేర్కొంటున్నారు.

# ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**విశ్వంభర, నాగర్ కర్నూల్ :** ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా కాంగ్రెస్ పాలన కొనసాగిస్తుందని తెలకపల్లి మండల కాంగ్రెస్ యువ నాయకుడు కొమ్ము ఎల్లస్వామి అన్నారు. నాగర్ కర్నూల్ నియోజక వర్గంలోని తెలకపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ యువ నాయకుడు కొమ్ము ఎల్లస్వామి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం రూ. 15 కోట్లు మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వం పాటించిన ఆర్థిక విధానాలతో రాష్ట్రం కష్టాలలో ఉన్న ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పంచాయతీ రాజ్ శాఖ నుంచి సీఆర్ఆర్ ప్లాన్ కింద 15 కోట్ల రూపాయలు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ నియోజకవర్గం అభివృద్ధి సంక్షేమంతో రాష్ట్రంలో జోడెద్దుల పాలన కొనసాగుతుందన్నారు. పేద ధనిక అనే తేడా లేకుండా అందరి అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికలలో ఇచ్చిన ఆరు గారంటీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల మంజూరుకు సహకరిస్తున్న ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## ప్రతి నియోజకవర్గానికి 3,500 నుంచి 4 వేల ఇందిరమ్మ ఇళ్లు

### మంత్రి పొంగులేటి



**విశ్వంభర, హైదరాబాద్:** ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ప్రకటన చేశారు. ఈ నెలా ఖరులోగా మొదటి విడతలో ఇంది రమ్మ ఇళ్లు మం జూరు చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 నుంచి 4,000 గృహాలు మంజూరు చేయ నున్నట్లు చెప్పారు. రానున్న నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా పేదలకు అందజేస్తామని తెలిపారు.

## ఆల్యా నాయక్ తండాలో దుర్గమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



**విశ్వంభర, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ 65వ పరిధిలోని కొమటిపల్లి రోడ్డులోని అల్యా నాయక్ తండాలో దుర్గమ్మతల్లి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం అట్టహాసంగా శనివారం ప్రారంభించారు. దుర్గమ్మ తల్లి విగ్రహం దాత వెన్నెల కన్స్ట్రక్షన్స్ అధినేత లావుడ్య రాజునాయక్ (లడ్డు రాజు)రమాదేవి దంపతులు, వారి కుమారుడు లావుడ్యాఅరుణ్ రాజ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ.. ఈ దుర్గమ్మ తల్లి విగ్రహం ప్రతిష్టా కార్యక్రమాలు శనివారంతో ప్రారంభమై సోమవారంతో ముగుస్తాయని తెలిపారు. స్థానిక కార్పొరేటర్ లావుడ్య దివ్యరాణి, రాజునాయక్, ఆలయ కమిటీ సభ్యులు లావుడ్య కిరణ్, సురేష్, తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

## చిందు యక్షగాన కళాకారులను విస్మసించిన ప్రభుత్వం



విశ్వంభర, ఆత్మకూరు(ఎం): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని జెఎస్ ఏ ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశంలో చిందు యక్షగాన కళాకారులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అంతరించిపోతున్న చిందు యక్షగాన కళను కాపాడాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో యక్షగాన కళలకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత బతుకులు మారుతాయని ఆశతో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు నిరాశే మిగిలిందన్నారు. తాతల కాలం నుంచి కళలేనమ్ముకొని జీవిస్తున్న యక్షగాన కాళలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. అనంతరం నూతనంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డం రామ నరసయ్య, ఉపాధ్యక్షుడిగా గడ్డం ధనంజయ్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం నాగరాజు, గౌరవ అధ్యక్షులుగా గడ్డం రాజలింగం, వెంకటయ్య, చంద్రమౌళి, నరేందర్, శ్యామసుందర్, రాంబాబు, నరేష్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సుదర్శనం, యాదగిరి, స్వామి, వెంకటాద్రి, ముత్తిలింగం, నాగభూషణం రాములు, సుధాకర్, వెంకట రాములు, శ్రీనివాస్,బిక్షపతి, చక్రపాణి, నరేష్, నాగేష్, గణేష్, మహేష్, ప్రవీణ్, రమేష్, అమరేందర్, మోహన్ బాబు, సాయికుమార్, శౌరి తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ చాలీసా పారాయణం



**విశ్వంభర, మెట్‌పల్లి :** మెట్ పల్లి పట్టణంలోని గోల్ హనుమాన్ ఆలయంలో ఆలయ పురోహితుడు మదన్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా, దండకం పారాయణం నిర్వహించారు. పూజ అనంతరం తీర్థప్రసాదాల వితరణ చేశారు. ప్రతి శనివారం సాయంకాల పూజ అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని ఆలయ పురోహితుడు మదన్ శర్మ తెలిపారు. హనుమాన్ చాలీసా పాఠనంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతాంగాన్ని మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

### ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.దాసరి అజయ్ కుమార్ యాదవ్



**విశ్వంభర, బషీర్ బాగ్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని మరో సారి మోసం చేసిందని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాటలు రైతాంగానికి కన్నీరు తెప్పించేలా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతు భరోసా పథకం కింద ఏడాదికి రూ.15 వేలు ఇస్తానన్న హామీని తుంగలో తొక్కిందన్నారు. మంత్రి తుమ్మల వానాకాలం పంటకు రైతు భరోసా లేదనడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి 10 నెలలు గడిచినా రైతాంగాన్నికి ఇచ్చిన హామీలను నేటికీ ఒక్కటీ సంపూర్ణంగా నెరవేర్చలేదన్నారు. మంత్రి తుమ్మల వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. వానకాలం పంటపెట్టుబడి సహాయం రైతు భరోసాను రైతుల ఖాతాలో డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు. మంత్రి తుమ్మల చేసిన ప్రకటనను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు రోడ్ల మీదకు వచ్చి ధర్నాలు చేయాలని ప్రజా పార్టీ పిలుపునిస్తుందన్నారు

## వారాస్ చెస్ విజేత కర్తవ్య

### ఘనంగా ముగిసిన 5 రోజుల టోర్నమెంట్స్




**విశ్వంభర, హైదరాబాద్:** వారాస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో అక్టోబరు 15 అయిదు రోజుల పాటు జరిగిన ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్స్ శనివారం ఘనంగా ముగిశాయి. హైదరాబాద్ లోని జీపీ బిర్లా సెంటర్‌లో జరిగిన ఈ పోటీలలో 256 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రూ. 6 లక్షల ప్రైజ్ మనీ ప్రకటించిన ఈ టోర్నీలో 98 మందిని విజేతలుగా ప్రకటించారు. అనద్కట్ కర్తవ్య ఛాంపియన్‌గా నిలిచి రూ.75,001 ప్రైజ్ మనీ పొందారు. కౌత్సవ్ కుందు (రూ.50,001), మార్తాండన్ కె.యు (రూ.40, 001) తదుపరి స్థానాలు పొందారు. గాదె శరణ్య, ఒయిషిక్ మొండల్ , శ్రీరామ అంజనీ కుమార్, శరణ్య దేవి నరహరి, సమక్ష్ అశోశ్, ప్రతీతి , దివిత్‌రెడ్డి, విశ్వజ దేశ్‌ముఖ్, తక్షాంత్ ఆనందర్, సాయి అన్షిత పువ్వలలు 7 నుంచి 15 ఏళ్ల లోపు విభాగాల్లో ఛాంపియన్లుగా నిలిచారు.

## విద్యార్థుల ఎదుగుదలలో ఉపాధ్యాయులతోపాటు

# తల్లిదండ్రుల ప్రభావం ఉండాలి

**విశ్వంభర, షాద్ నగర్ :** రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం జిల్లా పరిషత్ విట్యాల ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు ఉపాధ్యాయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విట్యాల ఉన్నత పాఠశాల ప్రధనోపాధ్యాయులు ఆవుల రవి మాట్లా డుతూ.. తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించేటప్పుడు శ్రద్ధగా విని ఇంటికి వెళ్ళాక పాఠశాలలో విన్న తరగతులను సబ్జెక్టు ప్రకారం చదువుకునేటప్పుడు వచ్చిన సందేహాలను ఒక పుస్తకంలో రాసుకొని మరుసటి రోజు పాఠశాలకు హాజరైన తర్వాత సబ్జెక్టు వారి సందేహాలను ఆ సబ్జెక్టుకు సంబంధించిన ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆవుల రవి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతిరోజు కొంత సమయాన్ని వారు వారి పిల్లలతో గడిపి పాఠశాలలో జరిగిన విషయాలను అడిగి తెలుసుకోవాలి తద్వారా విద్యార్థులకు తల్లిదండ్రులకు మధ్య చక్కని బంధం ఏర్పడుతుంది పిల్లలు ఎటువంటి సమస్యలు అయినా కూడా తల్లిదండ్రులతో చర్చించే అవకాశం ఉంటుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆవుల రవి పాఠశాల ఉపాధ్యాయులు ఎం కల్పన, ఎం మల్లికార్జున, శర్మ ఎస్. వెంకటరమణ, ఏ మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

## రైతు రుణ మాఫీ సగం మందికే ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకున్నది

### మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**విశ్వంభర, మహేశ్వరం :** బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు కోసం పెట్టిన డబ్బులు మాత్రమే రైతు భరోసా పేరుతో ఇచ్చి, వర్షాకాల రైతు భరోసాను ఎగ్గొట్టారు. ఎకరాకు 15 వేలు ఇస్తామని రైతులకు రూపాయి కూడా ఇవ్వలేని కాంగ్రెస్ సర్కార్. 40 లక్షల మంది రైతులకు చేయాల్సిన రుణమాఫీని 20 లక్షలు అంటే సగం మందికే చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకున్నదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రైతు బంధు భరోసా లేనట్లే అని వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొనడం లక్షలాది మంది రైతుల ఆందోళనకు కారణం అయిందని పేర్కొన్నారు. రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ తీరుని ఎక్కడికక్కడ ఎండగట్టాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలియజేశారు.

## త్రిఫ్ట్ ఫండ్‌కు చేనేత రుణాలకు ముడి పెట్టవద్దు

### రాష్ట్ర చేనేత యువజన నాయకులు గుర్రం నవీన్ నేత

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో రాష్ట్ర చేనేత యువజన నాయకులు గుర్రం నవీన్ నేత విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ.. రాష్ట్రంలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభు త్వం సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత కార్మికుల దుర్భర పరిస్థితులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం స్పంది ంచి వెంటనే 2017 నుంచి ఉన్నటువంటి చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాలు, చేనేత సహ కార సంఘాల క్యాష్ క్రెడిట్స్ మాఫీ చేయడం జరిగిందని వాటి మార్గ దర్శకాలు ఇంకా బ్యాం కులకు రావాల్సి ఉందన్నారు. గత మూడు సంవత్సరాలుగా చేనేత కార్మికులు త్రిఫ్ట్ ఫండ్ స్కీంలో తమ వంతు వాటా జమ చేసుకోవడం జరిగింది. వాటి కాలపరిమితి ఈ సెప్టెంబర్‌తో ముగియడంతో ఆ నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుండడంతో ఇదే అదనుగా భావించి బ్యాంక్ అధికారులు చేనేత కార్మికుల వ్యక్తి గత రుణాలను వారికి వచ్చే త్రిఫ్ట్ ఫండ్ నిధుల నుండి తీసుకుంటామని చెబుతున్నారని ఇది మంచి పద్ధతి కాదు అని దీనిని ప్రతి ఒక్క చేనేత కార్మికుడు ముక్త కంఠంతో ఖండించా లని కోరారు. రాష్ట్ర చేనేత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వెంటనే స్పందించి బ్యాంక్ అధికారులతో మాట్లాడి చేనేత కార్మికుల త్రిఫ్టడబ్బులు చేతికి అందేటట్టు చేయాలని కోరారు.

## ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ దక్షిణ భారత దేశం అధ్యక్షుడిగా సయ్యద్ కాజిమ్ అలీ హష్మీ

**విశ్వంభర, హైదరాబాద్ :** ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ (IHRO) దక్షిణ భారత దేశం అధ్యక్షుడిగా హైదరా బాద్‌కి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త SKAH గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత సయ్యద్ కాజిమ్ అలీ హష్మీని నియమించి నట్లు సంస్థ వైస్ చైర్‌పర్సన్ కెప్టెన్ రామ ఆర్య ఉత్తర్వులు జారీ చేశారు. దక్షిణ భారతదేశానికి (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు) అధ్యక్షుడిగా నియమించడం పట్ల సయ్యద్ కాజిమ్ అలీ హష్మీ సంతోషం వ్యక్తం చేశారు. కాజిమ్ అలీ మాట్లాడుతూ.. తన అనుభవం, నైపుణ్యంతో మానవాళి యొక్క ఉత్తమ ప్రయోజనాల కోసం నిజాయితీ, గౌరవంతో బాధ్యతలను నిర్వర్తిస్తానని తెలిపారు.



# మూసీకి అడ్డుపడితే.. మరో ఉద్యమం తప్పదు



(మొదటి పేజీ తరువాయి)

తీరని అన్యాయం చేశారని ఆయన మండిపడ్డారు. నల్గొండ ప్రజల్ని నాయకులు రెచ్చగొడుతున్నారని చెబుతున్న కేటీఆర్ మాటలు పూర్తిగా సత్యదూరమని చెప్పారు. నల్గొండ ప్రజలు రెచ్చగొడితే రెచ్చిపోయేంత అమాయకులు కాదని.. స్వతహాగా పౌరుషం ఉన్న వ్యక్తులని ఆయన పేర్కొన్నారు. నల్గొండ ప్రజలకు పోరాటాలు కొత్తకాదని.. ఇలాగే మూసీకి అడ్డంపడితే మీ ఇంళ్ల ముందు శాంతియుతంగా లక్షలమంది నల్గొండ బిడ్డలతో కలిసి ముట్టడిస్తామని కోమటిరెడ్డిహెచ్చరించారు. మూసీకి అడ్డుపడే ప్రతీ రాజకీయ పార్టీని నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ లో ప్రజలు నామరూపాలు లేకుండా చేస్తారని ఆయన హెచ్చరించారు. మూసీ కాలుష్యంతో ప్రజలు క్యాన్సర్, నరాల జబ్బులు, గుండె, కిడ్నీలు పాడైపోవడం, పిల్లల్లో పెరుగుదల లోపించడం, కంటి సమస్యలు, చర్మవ్యాధులతో నానా అవస్థలు పడుతున్నారని.. ఇంకా వాళ్లు అలాగే చచ్చిపోవాలని కేటీఆర్ కోరుకుంటున్నారా అంటూ ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ మోసాలకు ఇప్పటికే నల్గొండ నరక యాతన పడుతున్నదని.. ఇప్పుడు ఆయన కొడుకు తయారయ్యిండని ఆక్షేపించారు. ఎవ్వరు అడ్డువచ్చినా మూసీ విషయంలో వెనకడుగువేసే పరిస్థితే లేదని తేల్చిచెప్పారు. మూసీ డీపీఆర్ చేసిన మెయిన్ హార్డ్ టీ కంపెనీ 29 దేశాల్లో అద్భుతమైన కట్టడాలను కట్టిందని ఎక్కడో పాకిస్థాన్ లో కేసు అయ్యిందని.. మూసీపై అవినీతి బురదజల్లడం దారుణమని ఆయన మండిపడ్డారు. కేసిఆర్ మానసపుత్రిక కాళేశ్వరం డీపీఆర్ ను తయారు చేసిన వ్యాప్కోస్ ను ఒరిస్సా గవర్నమెంట్ బ్లాక్ లిస్ట్ లో పెట్టింది. గుజరాత్ లో నిషేధించిందని చెప్పిన మంత్రి.. కేటీఆర్ బంధువుల సంస్థ గ్లోబరినా పదుల సంఖ్యలో విద్యార్థుల ప్రాణాలను బలిగొన్న విషయాన్ని కేటీఆర్ ప్రజలకు ఎందుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వేసి చెప్పలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం డీపీఆర్ కు 2015 లోనే 33 కోట్లు చెల్లించారని.. ఇప్పుడు 140 కోట్లు చెల్లిస్తుంటే గగ్గోలు పెడుతున్నరని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట్లాడటం వచ్చని అబద్ధాలు చెప్పి ప్రజల్ని నమ్మించాలనుకుంటే తెలంగాణ ప్రజలు అమాయకులు కాదని.. కేసిఆర్ కుటుంబ మోసాల్ని ప్రజలు పసిగట్టిన్రు కనుకనే 16 కు 16 స్థానాల్లో గుణపాఠం చెప్పారని ఎద్దేవా చేశారు. అసలు మూసీ డీపిఆర్ పూర్తికాకముందే ఎందుకు లక్షల కోట్లని ఎగిరెగిరి పడుతున్నరని ప్రశ్నించిన ఆయన.. కేటీఆర్, హరీష్ రావు అమెరికాకు పోయి ప్రభాకర్ రావును ఇండియాకు రాకుండా ఎందుకు అడ్డుపడుతున్నారో ముందు చెప్పాలని సవాల్ చేశారు.

### కేసీఆర్ కుటుంబ అవినీతి కారణంగా ఇప్పటికీ ఫ్లోరైడ్ నీళ్లే..

మిషన్ భగీరథలో 5 వేల కోట్ల రూపాయలను దోచుకున్న కేసీఆర్ కుటుంబం అవినీతి వల్ల ఇప్పటికి అనేక గ్రామాల ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లే తాగుతున్నారని కోమటిరెడ్డి ఆరోపించారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులను మార్చుకున్న వాళ్లకు ప్రతీది ఏటీఎం లలాగే కనిపిస్తున్నాయని చురకలు అంటించారు. ఆ దోపిడీ యావ నుంచి బయటికి రాలేకనే అన్నిట్లో అవినీతి జరిగిందని గగ్గోలు పెడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. 2 వేల కోట్లు పెట్టి 9 కిలోమీటర్ల ఎస్.ఎల్.బీ.సీ సొరంగం పని పూర్తి చేస్తే నేడు నాలుగు లక్షల ఎకరాల నల్గొండ భూములు బంగారు మాగాణంగా మారేవని, ఫ్లోరైడ్ ఇబ్బందులు తప్పేవని.. కేవలం నాకు పేరొస్తుందనే ఎస్.ఎల్.బీ.సీ సొరంగాన్ని పదేండ్లు పక్కన పెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్.ఎల్.బీ.సీ సొరంగం పూర్తియితే శ్రీశైలంలో డెడ్ స్టోరేజీ ఉన్నా నల్గొండకు నీటి కొరత ఉండేది కాదని ఆయన అన్నారు. అంతేకాదు, పులిచింతకు నీళ్లను సీమాంధ్రకు తరలిస్తుంటే అక్కడి మోటర్లను తగులబెట్టానని.. ఆ విషయం అందరికి తెలుసన్న మంత్రి.. ఎస్.ఎల్.బీ.సీ సొరంగం మంజూరీ చేయకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని వై.యస్. రాజశేఖర్ రెడ్డికి తెల్చిచెప్పినట్టు గుర్తు చేశారు . ఆనాడు పోరాడి ప్రాజెక్టును మంజూరీ చేయించి 80 శాతం పనులు పూర్తి చేస్తే.. కేవలం 11 కిలోమీటర్ల పనుల పూర్తి చేసేందుకు పదేండ్లు సరిపోకపోవడం అంటే.. నల్గొండపై వారికున్న సవతితల్లి ప్రేమకు నిదర్శనమని ఆరోపించారు. బ్రహ్మణవెల్లంల, శివన్నగూడెం, పూర్తిచేస్తే మరింతగా రైతులకు ఉపయోగం అవుతుందన్న మంత్రి నల్గొండలో బోర్ వేస్తే నీరు పసుపు రంగులో వస్తున్న విషయం ప్రపంచమంతా తెలుసుని చెప్పారు. ఆగష్టులో కేంద్ర పర్యావరణ సంస్థ మూసీలో ప్రమాదకరస్థాయిలో హెవీ మెటల్స్ ఉన్నాయని చెప్పిన సంగతి కేటీఆర్ కు తెలియదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మేం మంత్రులం అందరం కలిసి ముఖ్యమంత్రితో చర్చించి మూసీకి పరిష్కారం చూపెట్టాలని కోరామని తెలిపిన మంత్రి.. కోటిమంది తెలంగాణ బిడ్డల బతుకులు బాగు చేసేందుకే మూసీ శుద్ధీకరణను తీసుకున్నామని ఆయన వివరించారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మూసీలో ఫ్లోరిన్ తో పాటు, ఇతర హెవీ మెటల్స్ పెరిగాయని కేంద్రప్రభుత్వ సంస్థలు తేల్చిన విషయం కేటీఆర్ కు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. ఎస్టీపీల ద్వారా రెండు మూడు దశల్లో ట్రీట్మెంట్ చేసినప్పటికి వందశాతం హెవీమెటల్స్ ను తీసివేయలేమని ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు చెప్తుంటే ఎస్టీపీ ద్వారా నల్గొండకు స్వచ్ఛమైన నీళ్లు ఇవ్వడానికి ప్రయత్నించామని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. కేటీఆర్ కు అధికారం పోయినా అహంకారం తగ్గలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కొడుకు కాకుంటే కేటీఆర్ ను ఎవరు గుర్తుకూడా పట్టరని.. అట్లాంటిది కష్టపడి పైకొచ్చిన మా ముఖ్యమంత్రిపై, మాపై అవాకులు చెవాకులు పేలుతున్నాడని నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రికి రెజువేనేషన్ స్పెల్లింగ్ రాదని.. కండ్లు నెత్తికెక్కి మాట్లాడిన కేటీఆర్ మాటలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేవిధంగా ఉన్నాయని మండిపడ్డారు. మేం జడ్పీ స్కూళ్లో చదివినప్పటికి సంస్కారవంతంగా మాట్లాడతామని చెప్పిన మంత్రి.. అమెరికాకు పోయి చదువుకొని కోట్లమంది ప్రజల ప్రాణాలను బలితీసుకోవాలని చూడటం బాధాకరమని అన్నారు. 80 వేల పుస్తకాలు చదివిన ప్రపంచ మేథావి కేసిఆర్ ఫాంహౌజు నుంచి బయటికు వచ్చి మూసీ వల్ల మూడు జిల్లాల ప్రజలు పడుతున్న సమస్యలపై మాట్లాడాలని మంత్రి కోమటి రెడ్డి సూచించారు. ఇక నల్గొండలో పుట్టిన చిట్టి నాయుడు ఒకరు మొన్నటి ఎన్నికల్లో 3 వేల ఓట్లతో గెలిచినప్పటికి ఆయనకు నల్గొండ సమస్యలు పట్టవని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ని ఉద్దేశించి అన్నారు. బస్సు కిరాయిలు లేనోడికి ఇప్పుడు 80 ఎకరాల ఫామ్ హౌజ్ ఉందని, ఉప్పల్ లో వాటర్ ప్లాంట్ పెట్టి నడిపిన వ్యక్తి..మాజీ సీఎం కేసీఆర్ కు ఉన్నంత ఫామ్ హౌజ్ ఎట్లా వచ్చిందని ప్రశ్నించారు. అధికారం అడ్డం పెట్టుకొని పది వేల కోట్లు దోచుకున్న ఆ చిట్టినాయుడు.. ఎప్పుడు నల్గొండ బిడ్డల బాగుకోసం పనిచేయలేదని ఆరోపించారు.. మొన్నటి ఎన్నికల్లో మా అభ్యర్థి దామోదర్ రెడ్డికి మోకాలి ఆపరేషన్ కావడంతో చిట్టి నాయుడు బతికిబయటపడ్డాడని, లేదంటే యాభైవేల మెజార్టీతో ఇంటికి పంపేవాళ్లమని చెప్పారు.

# 24 గంటల వ్యవధిలో.. 20కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు




**ఢిల్లీ:** దేశంలో విమానాలకు వరుసగా బాంబు బెదిరింపులు రావడం తీవ్రకలకలం రేపుతోంది. తాజాగా శనివారం తెల్లవారు జాము నుంచి 20కి పైగా విమానాల కు బెదిరింపులు రావడం గమనార్హం. దీంతో అప్రమత్తమైన అధికారులు విమానాలను ఆపిక్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు, పేలుడు పదార్థాలు లభించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.ఇండిగోకు చెందిన ఐదు, ఆకాశ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఐదు,విస్తారాకు చెందిన మూడు విమానాలతో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్, స్టార్ ఎయిర్, అలయన్స్ ఎయిర్ విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. రెండు రోజుల క్రితం ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి ముంబైకి వస్తున్న విస్తారా విమానానికి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా అదే సంస్థకు చెందిన విమానానికే మరోసారి బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీ నుంచి లండన్ బయల్దేరిన విస్తారా విమానానికి బెదిరింపులు రావడంతో అప్రమత్తమైన అధికారులు సమాచారాన్ని విమాన సిబ్బందికి చేరవేశారు. ఈ నేపథ్యంలో పైలట్లు విమానాన్ని ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రాయనికి మళ్లించారు. అక్కడ భద్రతా పరమైన తనిఖీలు నిర్వహించారు. సెక్యూరిటీ ఏజెన్సీల నుంచి క్లియరెన్స్ వచ్చిన తర్వాత విమానం మళ్లీ గమ్యస్థానికి పయణమవుతుందని విస్తారా ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. ప్రస్తుతం ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నారని వెల్లడించింది.ఇక, పారిస్-హాంకాంగ్, దిల్లీ-పారిస్ విస్తారా విమానాలకు కూడా ఈ తరహా బెదిరింపులు రాగా.. వాటిని అత్యవసరంగా దించేశారు.ముంబయి-ఇస్తాంబుల్,దిల్లీ-ఇస్తాంబుల్, జోధ్‌పుర్-దిల్లీ, హైదరాబాద్-చండీగఢ్, జెడ్డా-ముంబయి ఇండిగో విమానాలకు శుక్రవారం ఉదయం బెదిరింపులు వచ్చాయి. వీటిల్లో కొన్నింటిని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. మరికొన్నింటి టేకాఫ్‌ను ఆపేసి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. ఈ పరిణామాలపై ఇండిగో స్పందించింది. ప్రయాణికుల భద్రతే తమకు అత్యధిక ప్రాధాన్యం అని, దీనిపై సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.దుబాయ్ నుంచి జైపుర్‌కు వచ్చిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ (ఐఎక్స్ 196) విమానానికి బెదిరింపులు రావడంతో దాన్ని జైపుర్‌లో అత్యవసరంగా దించేశారు.బెంగళూరు నుంచిముంబయికి వెళ్లేందుకు టేకాఫ్‌కు సిద్ధమైన ఆకాశ ఎయిర్‌లైన్స్ (క్యూపీ1366) విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన అధికారులు ప్రయాణికులను విమానం నుంచి దింపి క్షుణ్ణంగా పరి శీలించారు. తర్వాత అది నకిలీ బెదిరింపుగా తేలింది. దీంతో పాటు ఈ సంస్థకు చెందిన మరో నాలుగు విమానాలకు కూడా బెదిరింపులు వచ్చాయి.

**వారం రోజుల్లో 70కి పైగా విమానాలకు బెదరింపులు..**

ఈ నెల 17న 147 మంది ప్రయాణికులతో ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి ముంబైకి వస్తున్న విస్తారా విమానానికి బెదిరింపులు వచ్చాయి. సోషల్ మీడియా బెదిరింపులు వచ్చిన తర్వాత సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినట్లు విస్తారా ప్రతినిధి తెలిపారు. దీంతో విమానాన్ని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవవసరంగా ల్యాండ్ చేశారు. విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించి తనిఖీలు నిర్వహించారు.ఇక రెండు రోజుల క్రితం ముంబై నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిర్ ఇండియా విమానానికి కూడా బెదిరింపులు వచ్చాయి. ఎయిర్ ఇండియా బోగింగ్ 777 విమానం ముంబై నుంచి గురువారం ఉదయం 7.05 గంటలకు టేకాఫ్ అయ్యింది. తూర్పు ఇంగ్లండ్ వైపు వెళ్తున్న సమయంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. విమానం ఏఐ129 లండన్‌లోని హీత్రూ విమానాశ్రయంలో మధ్యాహ్నం 12:05 గంటలకు (యూకే కాలమానం ప్రకారం) దిగాల్సి ఉంది. ల్యాండింగ్‌కు గంట ముందుగానే ఎమర్జెన్సీని ప్రకటించారు. అనంతరం విమానం హీత్రూ విమానాశ్రయంలో సేఫ్‌గా ల్యాండ్ అవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.గడిచిన వారం రోజుల్లో దాదాపు 70కి పైగా విమానాలకు ఇంటువంటి నకిలీ బాంబు బెదిరింపులు రావడం తీవ్ర ఆందోళన కలిగించే అంశం. ఈ వరుస బాంబు బెదిరింపులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ బెదిరింపులను నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది.అందులో భాగంగా బాంబు బెదిరింపులకు పాల్పడే వ్యక్తులపై నిషేధంవిధించే అవకాశం ఉందని పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఇటీవల తెలిపారు. అదేవిధంగా ఇప్పటికే ఉన్న నిబంధనల్లో మార్పులు చేయాల్సి ఉందన్నారు.

## మహా వికాస్ అఘాడీలో ఎలాంటి విభేదాల్లేవు..

### కూటమిలో సీట్ల పంపకంపై త్వరలో క్లారిటీ : రమేశ్ చెన్నితాల



ముంబయి: మహారాష్ట్రలోని ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, అందరం కలిసే ఉన్నామని ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రమేశ్ చెన్నితాల చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా తాము కలిసికట్టుగానే పోటీ చేయబోతున్నామని ఆయన స్పష్టంచేశారు. ఎవరు ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలనే విషయంలో సంప్రదింపులు జరుగుతున్నాయని, ఇవాళ మధ్యాహ్నం మూడు గంటలకు కూడా కూటమి నేతలు మరోసారి సమావేశమై సీట్ల పంపకంపై చర్చలు జరుపుతారని రమేశ్ చెన్నితాల చెప్పారు. సీట్ల పంపకంపై కూటిమిలోని మూడు పార్టీల నుంచి నానా పటోల్, సంజయ్ రౌత్, జయంత్ పాటిల్ కసరత్తు చేస్తున్నారని తెలిపారు.గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం కూడా ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన పార్టీ, శరద్‌పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ కలిసి మహా వికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. అయితే ఏక్‌నాథ్ షిండే శివసేనను చీల్చి, బీజేపీ పంచన చేరి ముఖ్యమంత్రి అయ్యారు. దాంతో కూటమి ప్రభుత్వం కూలిపోయింది. ఆ తర్వాత అజిత్‌పవార్ కూడా ఎన్సీపీని చీల్చి మహా సర్కారులో ఉప ముఖ్యమంత్రి అయ్యారు.ఈ క్రమంలో ఇప్పుడు మహారాష్ట్రలో మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఈసారి ప్రజల తీర్పు ఎలా ఉండబోతున్నది అనేది ఆసక్తికరంగా మారింది. పార్టీలను చీల్చిన నేతలను ఆదిరిస్తారా.. చీలకలతో కుదేలైన పార్టీలకు అండగా నిలుస్తారా..? అనేది ఉత్కంఠ రేపుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం అధికార కూటమి కంటే, ప్రతిపక్ష కూటమి అభ్యర్థుల వైపే ఓటర్లు మొగ్గు చూపారు. అదే ట్రెండ్ కొనసాగితే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష కూటిమిదే విజయం అనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు.

## నిందితుడి ఫోన్‌లో బాబా సిద్ధిఖీ కుమారుడి ఫోటో స్నాప్‌చాట్‌లో షేరింగ్



**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిక్ హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అయితే నిందితుల ఫోన్‌లో బాబా సిద్దిక్ కుమారుడు జీషాన్ సిద్దిక్ ఫోటో ఉన్నట్లు గుర్తించారు. స్నాప్‌చాట్ ద్వారా ఆ ఫోటోను కుట్రదారులు నిందితులకు షేర్ చేశారని పోలీసులు వెల్లడించారు. ఫోటోను షేర్ చేసిన తర్వాత డిలీట్ చేయాలని ఆదేశాలు ఉన్నట్లు ముంబై పోలీసులు చెప్పారు. ఎన్సీపీ నేతను హత్య చేయాలని తనను కొందరు ఆశ్రయించినట్లు నిందితుడు రామ్ కనోజియా చెప్పినట్లు క్రైం బ్రాంచ్ పోలీసులు వెల్లడించారు. తొలుత అతను వెయ్యి కోట్లు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. బాబా సిద్ధిక్‌ను చంపాలని కాంట్రాక్టును రామ్ కనౌజియాకు అప్పగించినట్లు శుభమ్ లోంకర్ తెలిపాడు. తనతో పాటు నితిన్ సాప్రేకు కాంట్రాక్టు ఇచ్చినట్లు రామ్ చెప్పాడు.

## జైన దేవాలయంలో సత్యేందర్ జైన్ దంపతుల ప్రత్యేక ప్రార్థనలు



**ఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నాయకుడు, ఢిల్లీ ఆరోగ్య శాఖ మాజీ మంత్రి సత్యేందర్ జైన్ రెండేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత శుక్రవారం తీహార్ జైలు నుంచి బయటికి వచ్చారు. ఇవాళ ఆయన తన సతీమణితో కలిసి దేశ రాజధాని ఢిల్లీలోని సరస్వతి విహార్‌లోగల జైన దేవాలయాన్ని సందర్శించారు. అక్కడ జైన్ దంపతులిద్దరూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.కాగా సత్యేందర్ జైన్ మానీలాండరింగ్ కేసులో 2022 మే 30న అరెస్టయ్యారు. అప్పటి నుంచి ఈడీ జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉంటూ విచారణను ఎదుర్కొంటున్నారు. మధ్యలో అనారోగ్య కారణాలరీత్య సుప్రీంకోర్టు నుంచి తాత్కాలిక బెయిల్‌పై బయటికి వచ్చారు. అనంతరం మళ్లీ జైలుకు వెళ్లారు. రెండేళ్ల సుదీర్ఘ కాలం తర్వాత శుక్రవారం ఢిల్లీ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.సుదీర్ఘ దర్యాప్తు, ఎక్కువ కాలం విచారణ ఖైదీగా జైలులో ఉండటం లాంటి అంశాలను పరిగణలోకి తీసుకుని జైన్‌కు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు కోర్టు పేర్కొన్నది. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఓ కంపెనీ లావాదేవీలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ అధికారులు జైన్‌ను అరెస్ట్ చేశారు.2015-16 సమయంలో జైన్ కంపెనీలకు షెల్ కంపెనీల నుంచి దాదాపు రూ.4.81 కోట్లు ముట్టినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. సీబీఐ నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ ఈ కేసు దర్యాప్తు చేపట్టింది. అనంతరం సత్యేందర్ జైన్‌తోపాటు ఆయన కుటుంబసభ్యులకు చెందిన రూ.4.81 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసిన ఈడీ జైన్‌ను అదుపులోకి తీసుకుంది.

## అర్హత ఎక్కువ ఉందని జాబ్ ఇవ్వనన్నారు.. టెకీ పోస్ట్ వైరల్

**ఢిల్లీ:**ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగం సంపాదించేందుకు అభ్యర్థులు ఎంతగానే శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో ఉద్యోగానికి సరిపడా క్వాలిఫికేషన్ లేదనే కారణంతో చాలా మంది రిజక్షన్‌కు గురవుతుంటారు. కానీ, అర్హత ఎక్కువ ఉండడం వల్ల ఉద్యోగం రాకపోవడం ఎప్పుడైనా చూశారా..! దిల్లీలోని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి ఇటువంటి వింత అనుభవమే ఎదురైంది. అర్హతకు మించిన క్వాలిఫికేషన్ ఉందనే కారణంతో తాము ఉద్యోగం ఇవ్వలేమంటూ ఓ కంపెనీ పేర్కొంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఆ ఉద్యోగిని ఎక్స్ వేదికగా పంచుకోగా.. ప్రస్తుతం అది నెట్టింట వైరల్‌గా మారింది **ఢిల్లీ:**కి చెందిన అను శర్మ గూగుల్‌లో పనిచేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల ఓ స్టార్టప్ కంపెనీలో ఉద్యోగానికి ఆమె దరఖాస్తు చేసున్నారు. కొన్ని రోజుల తర్వాత అమె దరఖాస్తును రిజెక్ట్ చేస్తున్నట్లు ఆ కంపెనీ మెసేజ్ చేసింది. అయితే, అందుకు ఆ కంపెనీ చెప్పిన కారణం ఆమెను ఆశ్చర్యపర్చింది 'మీ దరఖాస్తును సమీక్షించిన తర్వాత మీ క్వాలిఫికేషన్ ఉద్యోగ అర్హతకు మించి ఉందని తెలిసింది. అధిక అర్హతలు ఉన్న అభ్యర్థులు తరచూ తమ పనిలో అసంతృప్తితో ఉంటూ.. కొన్ని రోజులకే వెళ్లిపోతారని మా అనుభవంలో తెలుసుకున్నాం' అని ఆ కంపెనీ బదులిచ్చింది. ఈ మెసేజ్‌ను ఎక్స్‌లో షేర్ చేసిన అను శర్మ.. 'మంచి అర్హత కలిగి ఉంటే రిజెక్ట్ అవుతారని నాకు తెలియదు' అని రాసుకొచ్చింది.ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. పలువురు నెటిజన్లు దీనిపై స్పందిస్తూ తమకూ ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయని కామెంట్లు చేస్తున్నారు. 'హై ర్యాంకింగ్ కాలేజీ నుంచి వచ్చానని నాకు

## జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా ముబారక్ గుల్ ప్రమాణ స్వీకారం



**శ్రీనగర్:** కేంద్రపాలిత ప్రాంతం జమ్ముకశ్మీర్‌లో సుదీర్ఘకాలం తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అక్కడ చివరగా బీజేపీ-పీడీపీ సంకీర్ణ సర్కారు కుప్పకూలడం, జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి జమ్ముకశ్మీర్, లధఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడం, కేంద్రం తీరును నిరసిస్తూ ఆందోళనలు వెల్లువెత్తడం లాంటి పరిణామాల నేపథ్యంలో 2018 నుంచి రాష్ట్రపతి పాలన కొనసాగింది.ప్రస్తుతం పరిస్థితి చక్కబడటంతో ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 90 స్థానాలకు గాను నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ 42 స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్, ఆప్ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు కొందరు మంత్రులుగా బాధ్యతలు తీసుకున్నారు. త్వరలో అసెంబ్లీ కొలువుదీరనుంది. ఈ నేపథ్యంలో శనివారం ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం జరిగింది.నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ సీనియర్ నేత ముబారక్ గుల్ ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. శ్రీనగర్‌లోని రాజ్‌భవన్‌లో ఈ ప్రమాణ స్వీకారకార్యక్రమం జరిగింది. జమ్ముకశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా.. ముబారక్ గుల్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. కొత్తగా కొలువుదీరబోయే అసెంబ్లీలో ఎమ్మెల్యేలందరి చేత ఆయన ప్రమాణస్వీకారాలు చేయించనున్నారు. ఆ స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ల ఎన్నిక జరగనుంది. ఇదిలావుంటే ఒమర్ అబ్దుల్లా క్యాబినెట్ ఇటీవల సమావేశమై జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని తీర్మానం చేసింది.

## డ్రైనేజీలో పడ్డ బస్సు ముగ్గురి మృతి, 24 మందికి గాయాలు

**సిద్ధార్థనగర్:** ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ సైక్లిస్ట్‌ను తప్పించబోయి.. బస్సు డ్రైనేజీలో పడింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా, 24 మంది గాయపడ్డారు. బల్‌రాంపూర్ నుంచి సిద్ధార్ధనగర్ వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో బస్సులో 53 మంది ఉన్నారు. సైక్లిస్ట్‌ను రక్షించే క్రమంలో బస్సు అదుపు తప్పి డ్రైనేజీలో పడినట్లు ఎస్పీ ప్రాచీ సింగ్ తెలిపారు. ఇద్దరు ప్రయాణికులతో పాటు ఆ సైకిల్ తొక్కే వ్యక్తి కూడా మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు రాత్రి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు.

# మాజీ ఇంటిలిజెన్స్ అధికారి అరెస్టు

## పన్నూ హత్యకు కుట్ర కేసులోనూ అభియోగాలు ఎదుర్కొంటున్న వికాస్ యాదవ్





**ఢిల్లీ:** సిక్కు వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర జరిగిందన్న ఆరోపణలపై అమెరికా దర్యాప్తు జరుపుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా భారత మాజీ ఇంటెలిజెన్స్ అధికారి వికాస్ యాదవ్‌పై ఇటీవల అభియోగాలు నమోదవ్వడం చర్చనీయాంశమైంది. వికాస్ పరారీలో ఉన్నట్లు అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ నోటీసులు జారీ చేసింది. ఈ తరుణంలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఆఅధికారిని ఢిల్లీ పోలీసులు గతేడాది ఓకిడ్నాప్, దోపిడీ కేసులో అరెస్టు చేసినట్లు జాతీయ మీడియాల్లో కథనాలు వెల్లడించాయి. ఢిల్లీలోని రోహిణీ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి గతేడాది డిసెంబరులో వికాస్ యాదవ్‌పై ఫిర్యాదు చేశాడు. వికాస్‌తో తనకు 2023 నవంబరులో పరిచయంఏర్పడిందని, కొంతకాలం పాటు టచ్‌లో ఉన్నామని చెప్పారు. అయితే, గతేడాది డిసెంబరులో ఓ హోటల్‌కు పిలిచి తనపై దాడి చేసి దోపిడీకి యత్నించాడని పేర్కొన్నారు. దీంతో గతేడాది డిసెంబరు 18న వికాస్, అతడి అనుచరుడిని దిల్లీ పోలీసులు అరెస్టు చేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. దీనిపై ఈ ఏడాది మార్చిలో ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా.. ఆ మరుసటి నెలలోనే వికాస్‌కు బెయిల్ మంజూరైనట్లు తెలుస్తోంది. పన్నూ హత్యకు కుట్ర కేసులో అతడిపై అభియోగాలు నమోదైన వేళ.. ఈ వార్తలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ కుట్ర కేసుకు సంబంధించి న్యూయార్క్‌లోని కోర్టులో న్యాయశాఖ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అందులో భారత పౌరుడైన వికాస్‌యాదవ్ (39)పై మనీలాండరింగ్, కుట్రకు వ్యక్తులను నియమించడం, పన్నూ హత్యకు ప్రణాళిక రచించడం వంటి అభియోగాలు మోపారు. ప్రస్తుతం ఆయన ఆచూకీ తెలియరావడం లేదని అందులో పేర్కొన్నారు. వికాస్ గతంలో భారత ప్రభుత్వ అధికారిగా విధులు నిర్వహించారు. భారత విదేశీ ఇంటిలెజెన్స్ విభాగం, రా విభాగాన్ని నిర్వహించే కేబినెట్ సెక్రటేరియట్‌లో ఉద్యోగిగా పనిచేశారు.అమెరికా గడ్డపై పన్నూ హత్యకు కుట్ర జరిగిందని, దాన్ని తాము భగ్నం చేశామని అగ్రరాజ్యం గతేడాది ఆరోపించిన సంగతి తెలిసిందే. భారత ప్రభుత్వ ఉద్యోగితో కలిసి పన్నూను హత్య చేసేందుకు నిఖిల్ గుప్తా కుట్ర పన్నారని అమెరికా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఇప్పటికే చెక్ రిపబ్లిక్ జైలులో ఉన్న నిఖిల్‌ను అమెరికాకు అప్పగించినట్లు ఆ మధ్య మీడియా కథనాలు వెల్లడించాయి. అటు ఈ కేసు వ్యవహారంపై అమెరికా కోర్టు భారత ప్రభుత్వానికి సమన్లు కూడా జారీ చేసింది.అయితే, ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన భారత్.. దీనిపై విచారణ జరిపేందుకు స్వదేశంలో ఓ దర్యాప్తు కమిటీని ఏర్పాటుచేసింది. ఈ క్రమంలోనే ఇటీవల భారత అధికారుల బృందం అమెరికాలోని విదేశాంగ శాఖ, న్యాయశాఖ అధికారులతో సమావేశమైంది. ఈ అభియోగాల్లో పేర్కొన్న భారత అధికారి ప్రస్తుతం ప్రభుత్వంలో పనిచేయడం లేదని న్యూదిల్లీ తమకు వెల్లడించినట్లు అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మాథ్యూ మిల్లర్ తెలిపారు. ఈ బృందం పర్యటన ముగిసిన తర్వాతే వికాస్ యాదవ్‌పై అగ్రరాజ్యం అభియోగాలు చేయడం గమనార్హం.

## కిమ్ రాజ్యంలోకి దక్షిణ కొరియా డ్రోన్..!



**పాంగ్యాంగ్:** ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య శత్రుత్వం గురించి ప్రపంచమంతటా తెలిసిందే. ఇరుదేశాల మధ్య వైరం నానాటికీ తీవ్రతరమవుతూనే ఉంది. ఈ క్రమంలో తాజాగా దక్షిణ కొరియాకు చెందిన ఓ డ్రోన్ తమ భూభాగంలో కనిపించిదని కిమ్ సర్కారు పేర్కొంది. ఇందుకు సంబంధించిన ఫొటోను ఆ దేశ అధికారిక మీడియా విడుదల చేసింది.రాజధాని పాంగ్యాంగ్‌లో జరిపిన సాధారణ సోదాల్లో దక్షిణ కొరియాకు చెందిన డ్రోన్‌ను కనుగొన్నట్లు కిమ్ సర్కారు పేర్కొంది. ఈ నెలలో మూడుసార్లు ద.కొరియా ఇలాంటి డ్రోన్‌లతో ప్రచార కరపత్రాలను వదిలినట్లు ఆరోపించింది. అదేవిధంగా తమ భూభాగంలో కనిపించిన డ్రోన్ గత నెల దక్షిణ కొరియా సైనిక కవాతులో కనిపించిన రకమేనని ఉ.కొరియా మిలిటరీ, స్టేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు సంయుక్తంగా నిర్ధారించాయి. మరోవైపు డ్రోన్‌లను ఉపయోగించి తమ భూభాగంలో కరపత్రాలు వదలడాన్ని ఉత్తర కొరియా మంత్రిత్వశాఖ తీవ్రంగా పరిగణించింది. మరోసారి తమ గగనతలంలో శత్రు దేశం డ్రోన్‌లు ఎగిరినా, సరిహద్దుల్లో నిబంధనలు ఉల్లఘించినా యుద్ధ ప్రకటనగా పరిగణిస్తామని హెచ్చరించింది. ప్రతీకార దాడులు సైతం తీవ్రతరంగా ఉంటాయని వ్యాఖ్యానించింది. కాగా.. మే చివరి వారం నుంచి దక్షిణ కొరియా గగనతలంపైకి కిమ్ ప్రభుత్వం వేల సంఖ్యలో చెత్త బెలూన్లు పంపించింది. అనంతరం దక్షిణ కొరియాతో తమకున్న సరిహద్దును పూర్తిగా మూసివేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఇరుదేశాలను కలిపే రోడ్లు, రైల్వే మార్గాలను ఇటీవల బాంబులతో పేల్చివేసింది. మరోవైపు దక్షిణ కొరియాను శత్రు దేశంగా పరిగణిస్తూ కిమ్ సర్కారు తమ రాజ్యాంగంలో సవరణలు చేసింది.

## సిన్వర్ లేకపోయినా హమాస్ ఉనికికి ధోకా లేదు: అయతుల్లా అలీ ఖమేనీ



టెహ్రాన్: హమాస్ మిలిటెంట్ సంస్థ అధినేత యాహ్యా సిన్వర్‌ను ఇజ్రాయెల్ దళాలు హతమార్చడంపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్పందించారు. సిన్వర్ మృతి బాధ కలిగిస్తోంది.. అయినప్పటికీ అతడు అమరుడు కావడంతో అంతా అయిపోయినట్లు కాదని ఆయన వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ దాడిలో అతడు చనిపోయినా హమాస్ ఇంకా ఉనికిలోనే ఉందని.. ఎప్పటికీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు."శత్రువులు తమపై విపరీత దాడులకు పాల్పడుతున్నా సిన్వర్ దృఢ సంకల్పంతో వారికి ఎదురు నిలిచారు. వారి వ్యూహాలకు దీటుగా బదులిచ్చారు. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై జరిపిన దాడులకు సూత్రధారిగా వ్యవహరించి ఇజ్రాయెల్‌ను ఆయన దెబ్బ కొట్టిన తీరును ప్రపంచం ఎప్పటికీ మరిచిపోదు" అని ఖమేనీ అన్నారు. ఇజ్రాయెల్- హెజ్‌బొల్లాల మధ్య జరుగుతున్న పోరులో హమాస్ చీఫ్ నస్రల్లా మరణం తర్వాత లెబనాన్‌లోకి తన బలగాలను పంపేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందని ఆ దేశ ఉన్నతస్థాయి అధికారిని ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా వెల్లడించింది.ఇటీవల ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రత్యక్ష దాడికి దిగిన సంగతి తెలిసిందే. దాదాపు 200 బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించింది. అనంతరం దీనిపై ఖమేనీ స్పందిస్తూ హమాస్ అప్పటి అధినేత ఇస్మాయెల్ హనియా, హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా, నిల్ఫోరూషన్ మరణానికి ప్రతీకారంగా ఈ దాడులు చేపట్టినట్లు ప్రకటించారు. అయితే ఇరాన్ తమపై చేసిన క్షిపణుల దాడికి ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధమవుతున్నట్లుగా ఇజ్రాయెల్ పేర్కొంది. అదే జరిగితే తమ స్పందన మరింత తీవ్రంగా ఉంటుందని టెహ్రాన్ ఇప్పటికే హెచ్చరించింది. ఈ పరిణామాల వేళ ఖమేనీని సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు వార్తలు వచ్చాయి.

# విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తాం: సీఎం చంద్రబాబు





**విశ్వంభర, అమరావతి:** అమరావతిలో రాజధాని నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు పునఃప్రారంభించారు. సీఆర్‌డీఏ ఆఫీసు పనులను ప్రారంభించి ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయుని పాలెం వద్ద పనులు ప్రారంభించారు. భవన ప్రాంగణంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ పూజా కార్యక్రమం నిర్వహించారు. రూ.160 కోట్లతో గతంలో తెదేపా హయాంలో ఏడంతస్తుల్లో సీఆర్‌డీఏ కార్యాలయ పనులు చేపట్టారు. ప్రాజెక్టు కార్యాలయ నిర్మాణాన్ని 2017లో ప్రారంభించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులను నిలిపేశారు. మొత్తం 3.62 ఎకరాల్లో జీ ప్లస్ 7 భవనాన్ని ఇక్కడ ప్రభుత్వం నిర్మిస్తోంది. అదనంగా పార్కింగ్, ల్యాండ్ స్కేపింగ్‌కు 2.51 ఎకరాల విస్తీర్ణం కేటాయించారు. ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్స్, ఇంటీరియర్స్,ఎలక్ట్రిక్‌పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. "చరిత్రను తిరగరాసేందుకు మనమంతా ఇక్కడ సమావేశమయ్యాం. రాష్ట్ర విభజన సమయంలో అనేక ఇబ్బందులు పడ్డాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైబరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దిన ఘనత మాదే. ముందుచూపుతో ఆనాడే సైబరాబాద్‌లో 8 వరుసల రోడ్లు వేశాం. శంషాబాద్ విమానాశ్రయానికి 5 వేల ఎకరాలు ఎందుకని అందరూ ప్రశ్నించారు.

అభివృద్ధికి అడ్డుపడే వారుప్రతిచోటా ఉంటారు.అమరావతి రైతులను ఒప్పించి భూమి సేకరించాం. రాజధాని, సమాజ హితం కోసం మీరంతా భూ ములు ఇచ్చారు. అమరావతి కోసం 54 వేల ఎకరాలు సేకరిం చాం. మహిళా రైతులు వైసీపీ ప్రభుత్వంపై గట్టిగా పోరాడారు" "రాష్ట్రానికి మధ్యలో ఉండే ప్రాంతం.. అమరావతి. ఒక రాష్ట్రం, ఒక రాజధాని అని.. ప్రతి చోటా చెప్పాను. విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తాం. కర్నూలులో హైకోర్టు బెంచ్, పరిశ్రమలను ఏర్పాటు చేస్తాం" అని చంద్రబాబు వెల్లడించారు.

బుల్లెట్ రైలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరా.."అమరావతికి విట్, ఎస్ఆర్ఎం, అమృత్ వర్సిటీలు వస్తున్నాయి. దేశంలోని టాప్ 10 విద్యాసంస్థల బ్రాంచ్‌లు ఇక్కడికి రావాలి. బుల్లెట్ రైలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరా. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అమరావతి మీదుగా బుల్లెట్ రైలు కావాలి. అమరావతి నిర్మాణానికి రుణం ఇచ్చేందుకు ప్రపంచబ్యాంకు అంగీకరించింది. అమరావతిలో నిర్మాణపనులు జెట్ స్పీడ్‌తో జరగాలి"అని చంద్రబాబు అన్నారు.

## ఇకపై ట్రాక్టర్ల ద్వారా కూడా ఉచితంగా తీసుకెళ్లే వెసులుబాటు

### ఉచిత ఇసుక విధానంపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం



**విశ్వంభర, అమరావతి:** ఉచిత ఇసుకకు సంబంధించి ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక అవసరాల కోసం వాగులు, వంకల నుంచి ఇసుకను ఉచితంగా తవ్వుకుని ఎడ్లబండి, ట్రాక్టర్లలో రవాణా చేసుకునేందుకు అనుమతినిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఉచిత ఇసుక విధానంలో భాగంగా వ్యక్తిగత అవసరాలకు వాగులు, వంకల నుంచి ఇసుకను తీసుకునేందుకు వీలుగా గత నెల 2వ తేదీన ఏపీ ప్రభుత్వం పలు మార్గదర్శకాలను విడుదల చేసింది. వ్యక్తిగత అవసరాల కోసం వాగులు, వంకల నుంచి ఉచితంగా ఇసుకను తవ్వుకుని ఎడ్లబండ్లలో తీసుకెళ్లొచ్చని ఆ మార్గదర్శకాల్లో తెలిపింది. దీనికోసం ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. ఎవరికీ పైసా చెల్లించాల్సిన అవసరం లేదు. పెద్ద నదుల విషయంలో మాత్రం నిబంధనలు ఉన్నాయి.ప్రభుత్వం ఇచ్చిన ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా వాగులు, వంకలకు సమీపంలో ఉండే గ్రామస్థులు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకెళ్తుంటే మాత్రం పోలీసులు ఆపి, జరిమానా విధిస్తారు. దీంతో ఏపీ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఈ క్రమంలో ట్రాక్టర్ల ద్వారా కూడా ఉచితంగా ఇసుకను తీసుకెళ్లేలా వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు ఇసుక పాలసీలో పలు సవరణలు చేసి ఉత్తర్వులు జారీ చేసింది.

## రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా డబుల్ ఇంజిన్ సర్కారు

### లంకా దినకర్



**విశ్వంభర, విజయవాడ:** గత ఐదేళ్లలో వైసీపీ హయాంలో కేంద్ర నిధులు పక్కదారిపట్టించారని బీజేపీనేత లంకా దినకర్ విమర్శించారు. 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్వర్ణాంధ్ర సాధనకు అందరం కలిసి కృషి చేస్తామన్నారు. 20 సూత్రాలు అందరికీ తెలిసేలా అన్ని కలెక్టరేట్ల వద్ద ఉంచుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా రాష్ట్రానికి సహకారం అందిస్తోందని పేర్కొన్నారు.సీఎం చంద్రబాబు వెంట తామంతా నడుస్తామని చెప్పారు. అర్హులైన అందరికీ పథకాలు అందించేందుకుసీఎం కృషి చేస్తున్నారని వివరించారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా డబుల్ ఇంజిన్ సర్కారు పనిచేస్తోందని లంకా దినకర్ తెలిపారు.

## పీవీ సింధుకు మరో ఏడాదిపాటు ఆన్‌డ్యూటీ

### ఏపీ ప్రభుత్వ కీలక నిర్ణయం



**విశ్వంభర,అమరావతి:** ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్ పీవీ సింధుకు ఆన్ డ్యూటీ సదుపాయాన్ని మరో ఏడాది పొడిగించింది. ఆసియా, కామన్‌వెల్త్ క్రీడలతో పాటు 2025–26లో వివిధ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు శిక్షణ నిమిత్తం పీవీ సింధుకు ఆన్ డ్యూటీ సదుపాయాన్ని పొడగించింది. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఓడీని పొడిగిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు 2016 ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. దీంతో అప్పటి తెలుగుప్రభుత్వాలు పీవీ సింధును ఘనంగా సన్మానించడంతో పాటు నజరానా ప్రకటించాయి.గ్రూప్–1 హోదాతో ప్రభుత్వ ఉద్యోగం కూడా ఆఫర్ చేశాయి. అయితే ఏపీలో ప్రభుత్వ ఉద్యోగం చేసేందుకు పీవీ సింధు సుముఖత వ్యక్తం చేశారు. తొలుత విజయవాడ గొల్లపూడిలోని ఏపీ భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయంలో పీవీ సింధు విధుల్లో చేరారు. డిప్యూటీ కలెక్టర్ విధులు, బాధ్యతలపై శిక్షణ తీసుకున్నారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో ఏపీ ప్రభుత్వం ఆదీనంలో ఉన్న లేక్‌వ్యూ అతిథిగృహంలో ఓఎస్డీగా విధులు నిర్వహిస్తున్నారు.

## వీఐపీ బ్రేక్ దర్శనాల పరిమితి పెంపు?



**విశ్వంభర, తిరుమల:** తిరుమలలో శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలపై ఒక వార్త ఇప్పుడు వైరల్‌గా మారింది. ఎమ్మెల్యేల సిఫారసు లేఖలపై ఇచ్చే వీఐపీ బ్రేక్ దర్శనాల పరిమితిని పెంచాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యేల సిఫారసు లేఖలపై రోజుకు రెండు వీఐపీ బ్రేక్ దర్శనాలు ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి.తిరుమలలో శ్రీవారి వీఐపీ దర్శనానికి ఎమ్మెల్యేల నుంచి రోజుకు ఒక సిఫారసు లేఖను మాత్రమే అనుమతిస్తున్నారు. దీని స్థానంలో రెండో లెటర్‌ను కూడా అనుమతించాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని పలువురు టీడీపీ ఎమ్మెల్యేలు కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన చంద్రబాబు..రెండో సిఫారసులేఖను అనుమతించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అలాగే వారానికి ఆరు రోజులు కూడా వీఐపీ బ్రేక్ దర్శనాలకు అనుమతించాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఎమ్మెల్యేల సిఫారసు లేఖలపై ఇచ్చే వీఐపీ బ్రేక్ దర్శనాల పరిమితిని పెంచబోతున్నట్లు వస్తున్న వార్తలతో భక్తుల్లో ఆందోళన మొదలైంది. అయితే దీనిపై అటు ప్రభుత్వం గానీ.. ఇటు టీటీడీ అధికారులు మాత్రం స్పష్టతనివ్వలేదు.

### తిరుమలలో శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు

తిరమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. దేశ, విదేశాల నుంచి వచ్చిన భక్తులతో వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న 31 కంపార్టుమెంట్లలో 8 కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీఅధికారులు తెలిపారు.సోమవారం స్వామివారిని 61,576 మంది భక్తులు దర్శించుకోగా 23,412 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు స్వామివారికి సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ.3.54 కోట్లు ఆదాయం వచ్చిందని వివరించారు.

## ఆర్ఓబీ పనులను వేగవంతం చేయాలి

### మంత్రి దుర్గేష్



**విశ్వంభర, నిడదవోలు:** పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఆర్ఓబి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు ఆర్ఓబి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం జరిగిన పనులు, చేపట్టవలసిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ సమయంలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రధాన ధ్యేయం

**విశ్వంభర, ఆదోని:** రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకొని ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. శనివారం ఆదోని మండలం పెద్ద తుంబలం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రూ.12 లక్షల వ్యయంతో సీసీ రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ చేసి మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి నిర్వీర్యం చేసిందన్నారు.ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామాల అభివృద్ధికి పల్లె పండుగ పేరుతో నడుం బిగించామన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు బీజేపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మద్యం విధానంపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదు : మంత్రి కొల్లు రవీంద్ర




విశ్వంభర, అమరావతి : ఏపీలో మద్యం విధానంపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో వైఎస్ జగన్ మద్యం వ్యాపారాన్ని జగన్ గుప్పిట్లో పెట్టుకుని ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని, ప్రజల ఆరోగ్యమూ దెబ్బతిందని ఆరోపించారు.ఐదేళ్ల వైసీపీ పాలనలో కల్తీ మద్యం తాగి ప్రజలు అనారోగ్యం బారిన పడ్డారు. చాలా మంది ప్రాణాలు కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమాలకు అడ్డురావొద్దనే ఎక్సైజ్‌శాఖను జగన్ నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకునే ఏపీలో కూటమి ప్రభుత్వం కొత్త మద్యం విధానం తీసుకొచ్చిందని గుర్తు చేశారు. అన్ని రకాల పరీక్షలు చేసిన తరువాతే రూ. 99 కే నాణ్యమైన మద్యాన్ని మార్కెట్‌లోకి తెచ్చామని అన్నారు. బ్రాండ్ల రేట్లు తగ్గించడానికి రిటైర్డ్ హైకోర్టు జడ్జితో టెండర్ కమిటీ వేస్తామని వెల్లడించారు.

## వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు రెండ్రోజులు పోలీసు కస్టడీ



**మంగళగిరి :** వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పోలీసు కస్టడీకి తరలించారు. వెలగపూడిలో మరియమ్మ అనే మహిళ హత్య కేసులో నందిగం సురేష్ నింది తుడిగా ఉన్నారు. ఈ కేసులో రిమాండ్ ఖైదీగా గుంటూరు జైలులో ఉన్న సురేష్‌ను కస్టడీకి ఇవ్వాలని తుళ్లూరు పోలీసులు పిటిషన్ వేయగా.. మంగళగిరి కోర్టు అను మతించింది. దీంతో తుళ్లూరు పోలీసులు నందిగం సురేష్‌ను గుంటూరు జిల్లా జైలు నుంచి తుళ్లూరుకు తరలించారు. తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో రెండు రోజులపాటు నం దిగం సురేష్‌ను పోలీసులు విచారించను న్నారు. సోమవారం మధ్యా హ్నం లోపు గుంటూరు జిల్లా జైలుకు తరలిస్తారు.

## గుర్లలో ఈ పరిస్థితికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణం: మంత్రి కొండపల్లి



**విశ్వంభర, గుర్ల:** విజయనగరం జిల్లా గుర్లలో అతిసారం తగ్గుముఖం పట్టిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో 41మంది బాధితులు ఉన్నారని, మిగతా వారంతా పూర్తిగా కోలుకున్నారని పేర్కొన్నారు. భూగర్భ జలాల కలుషితం వల్లే అతిసారం వ్యాప్తి చెందినట్లుమంత్రి వివరించారు.శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "గుర్లలో క్లోరినేషన్ పనులు చేపట్టాం. ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నాం. గత ప్రభుత్వ వైఫల్యమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. ఐదేళ్లలో పారిశుద్ధ్యాన్ని, తాగునీటి వ్యవస్థను పట్టించుకోలేదు. జలజీవన్ పథకం నిధులను దారి మళ్లిం చారు" అని విమర్శించారు. గుర్లలో డయేరియా వ్యాప్తి చెందడంతో ఇప్పటి వరకు ఏడుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

## చంద్రబాబు మాటలకు అర్థాలే వేరులే: మాజీ మంత్రి కాకాణి




**విశ్వంభర, అమరావతి:** ఏపీ సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. చంద్రబాబు చెప్పేదానికి, చేసేదానికి పొంతన ఉండటం లేదని విమర్శించారు. చంద్రబాబు మాటలకు అర్థాలే వేరులే అని ఎద్దేవా చేశారు. ఇసుక, మద్యం జోలికి వెళ్లొద్దని చంద్రబాబు చెబుతారని.. కానీ టీడీపీ నేతలు మాత్రం వాటినే ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారని అన్నారు.ఇసుక, మద్యం విషయంలో కూటమి ప్రభుత్వ పెద్దలు అవినీతికి పాల్పడ్డారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. సూపర్ సిక్స్‌లో ఒక్క హామీ చేయలేక.. ఇప్పుడు ఇసుకపై కొత్త నాటకానికి తెరతీశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇసుక, మద్యానికి సంబంధించి ఎన్నో దౌర్జన్యాలు జరిగాయని.. కానీ ఎవరి మీద చర్యలు తీసుకోలేదని తెలిపారు. లాటరీలో మద్యం షాపుల లైసెన్సులు పొందిన వారిని కిడ్నాప్ చేశారని, ఇసుక టెండర్లు పొందినవారిని మంత్రులు భయపెడుతున్నారనిఅన్నారు.నెల్లూరు జిల్లాలో నాలుగు ఇసుక రీచ్‌ల కోసం టెండర్లు పిలిచారని.. లాటరీ ద్వారా ఎంపిక చేయాలని మంత్రి నారాయణ ఆదేశాలు ఇచ్చారని కాకాణి అన్నారు. మా రీచ్‌లో తెలియకుండా టెండర్లు ఎలా వేశారంటూ ఒక మంత్రి,ఎమ్మెల్యే లాటరీల్లో పొందినవారిని భయపెడుతున్నారని విమర్శించారు. ఒక మంత్రి తీసుకున్న నిర్ణయాన్ని పట్టించుకోకుండా కలెక్టర్ టెండర్లు రద్దు చేశారని చెప్పారు. మంత్రి అంటే ఒక లెక్క లేకుండా చేశారని అన్నారు. దీనిపై కలెక్టర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 25న కలెక్టర్ వద్ద ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

# భారత్‌పై మార్పులేని కెనడా వైఖరి

- ఆరుగురు దౌత్యవేత్తలను బహిష్కరించాం
- వియన్నా కన్వెన్షన్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించం
- ఇండియాపై బురద జల్లిన విదేశాంగ మంత్రి



**టొరంటో:** భారత్‌తో దౌత్యసంబంధాలు తీవ్రస్థాయిలో దెబ్బతింటున్నా కెనడా వైఖరిలో మాత్రం ఎలాంటి మార్పులేదు. ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో మాటల్నే విదేశాంగమంత్రి మెలానీ జోలీ వల్లెవేశారు. అక్కడున్న మిగిలిన దౌత్యవేత్తలపై నిఘా ఉంచామంటూ భారత్‌పై బురదజల్లే ప్రక్రియను కొనసాగించారు. అంతటితో ఆగకుండా భారత్‌ను రష్యాతో పోలుస్తూ అక్కసు వెళ్లగక్కారు. వియన్నా కన్వెన్షన్ ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడితే సహించేది లేదని మెలానీ వ్యాఖ్యలు చేశారు. సిక్కుల అతివాద నేత హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకేసు అనుమానితుల జాబితాలో ఏకంగా భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్ వర్మను చేర్చింది. ఈ పరిణామం రెండు దేశాల మధ్య అగ్గి రాజేసింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన్ని, మరికొందరు అధికారుల్ని అక్కడి నుంచి వెనక్కి తెచ్చేయాలని కేంద్రం నిర్ణయించింది. దిల్లీలోని కెనడా తాత్కాలిక హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించింది. ప్రతిగా కెనడా సైతం అదే తరహా నిర్ణయం తీసుకుంది. ఇలా ఉద్రిక్తతలు కొనసాగుతోన్న తరుణంలో మెలానీ మాట్లాడుతూ రష్యా, భారత్ మధ్య పోలిక తెచ్చారు. "మా దేశ చరిత్రలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. అంతర్జాతీయ శక్తులు కెనడా గడ్డపై ఇలాంటి అణచివేతకు పాల్పడటాన్ని మేం జరగనివ్వబోం. ఐరోపాలో ఇలాంటివి మేం చూశాం. జర్మనీ, యూకేలో రష్యా ఆ పనిచేసింది. ఇలాంటివాటికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడాల్సి ఉంది" అని జోలీ వెల్లడించారు. కెనడాలో మిగిలిన భారత దౌత్యవేత్తలను కూడా బహిష్కరిస్తారా అని అడగ్గా.. "వారిపై నిఘా ఉంచాం. ఒట్టవా హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తలను బహిష్కరించాం. మిగిలినవారు వాంకోవర్, టొరంటోలో ఉన్నారు. వియన్నా కన్వెన్షన్‌కు విరుద్ధంగా వ్యవహరించే దౌత్యవేత్తలను మేం సహించబోం" అంటూ వ్యాఖ్యలు చేశారు. నిజ్జర్ హత్యకేసులో భారత్ ఏజెంట్ల ప్రమేయం ఉందంటూ గతేడాది ట్రూడో చేసినప్పటినుంచి రెండు దేశాల సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే కేవలం నిఘా సమాచారం ఆధారంగా అప్పుడు భారత్‌పై ఆరోపణలు చేశానని, ఆ సమయంలో ఎటువంటి ఆధారాలు లేవని ట్రూడో ఇటీవల అంగీకరించిన సంగతి తెలిసిందే. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. భారత్‌పై నిందలు వేస్తున్న విషయం ఆయన మాటల్లోనే తేటతెల్లమైందని మండిపడింది. అయినా కూడా ట్రూడో తన వ్యాఖ్యలను కొనసాగించారు. కెనడియన్లకు సంబంధించిన సమాచారాన్ని భారత దౌత్యవేత్తలు సేకరించారని, వాటిని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు అందజేశారని మరోసారి ఆరోపించారు.

# 4 నెలల సమయం ఇవ్వండి

- డిమాండ్లు పరిష్కరిస్తాం
- జూడాలతో బెంగాల్ సీఎం మమత
- కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల నిరశన



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆసుపత్రి ఘటనలో న్యాయం చేకూర్చాలని, తమ డిమాండ్లు నెరవేర్చాలని జూనియర్ వైద్యులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతోంది. కాగా ఈ విషయంపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ జూనియర్ వైద్యులు దీక్షను వీడాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే హక్కు ఉందని, అయితే.. వైద్యా రోగ్య సేవలపై దాని ప్రభావం పడకూడదని ఆమె వ్యాఖ్యానించారు. వైద్యులు తమ ముందుకు తెచ్చిన డిమాండ్లను ఇప్పటికే నెరవేర్చామని, మిగతా వాటి కోసం 3-4 నెలల సమయం ఇవ్వాలని మమత వైద్యులను కోరారు. చర్చలకు రావాలని మరోసారి జూనియర్ వైద్యులకు పిలుపునిచ్చారు. జూనియర్ డాక్టర్లు సోమవారం ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు రావాలని మమత మరోసారి ఆహ్వానించారు. ఆర్జీకర్ ఆసుపత్రి వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యుల వేదిక వద్దకు శనివారం చీఫ్ సెక్రటరీ మనోజ్ పంత్ వెళ్లారు. ఈ సమయంలో సీఎం వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. వైద్యులు చేసిన పలుడిమాండ్లను నెరవేర్చడానికి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని ఆమె పేర్కొ న్నారు. ఏం చేయాలి ఏం చేయకూడదు అనే విషయాలను ప్రభుత్వానికి వైద్యులు నిర్దేశించడం సరికాదని వ్యాఖ్యానించారు. వైద్యుల డిమాండ్లపై చర్చించిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. కోల్‌కతాలోని ఆర్జీకర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగస్టు 9న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

# ఆదివాసీల గురించి బోధించడంలో విద్యా వ్యవస్థ విఫలం

- గిరిజనుల హక్కులను హరిస్తున్న మోదీ
- కుల గణన సమాజానికి ఎక్స్‌రే
- కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శలు



**రాంచీ:** ఆదివాసీల గురించి బోధించడంలో మన విద్యావ్యవస్థ విఫలమైందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. త్వరలో ఝార?ండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే రాంచీలో ఏర్పాటు చేసిన 'సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్' లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ఎన్డీఏ సర్కారుపై తీవ్ర ఆరోపణలు చేశారు. "గిరిజనుల చరిత్ర, వారసత్వం, సంస్కృతి, వైద్య విధానాలను బీజేపీ నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోంది. దళితులు, గిరిజనులు, వెనకబడిన వర్గాల వారిని గౌరవిస్తున్నట్లు ప్రధాని మోదీ చెబుతున్నారు. కానీ, ఆయన మీ హక్కులను హరిస్తున్నారు. సంస్థల నుంచి బహిష్కరిస్తున్నారు. ఆర్థిక శాఖలో ఒక్క దళితుడు, గిరిజనుడు లేడు. ఆదివాసీల మూలాల గురించి బోధించడంలో మన విద్యావిధానం విఫలమైంది. మోదీ సర్కార్ రాజ్యాంగాన్ని అన్ని రకాలుగా నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోంది. దాన్ని రక్షించాల్సిన అవసరం ఉంది" అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. కులగణన సమాజానికి ఎక్స్-రే వంటిదని రాహుల్ గాంధీ, అన్నారు. దాన్ని ప్రధాని మోదీ వ్యతిరేకించారని ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలను బీజేపీ నియంత్రిస్తోందన్నారు. కాషాయ పార్టీ రాష్ట్రానికి నిధులు, సంస్థలను నియంత్రించగలదేమో కానీ, నిజాయతీ కాదని వ్యాఖ్యానించారు. కాగా.. ఝార?ండ్ ఎన్నికల నేపథ్యంలో రాహుల్ పలు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వస్తే వస్తే రిజర్వేషన్లపై 50శాతం పరిమితిని ఎత్తేస్తామన్నారు. అధికార కూటమి పార్టీలైన జేఎంఎం, కాంగ్రెస్ మధ్య పొత్తు కుదిరింది.

## ఆకట్టుకున్న కూచిపూడి నాట్యం



**విశ్వంభర, బషీర్ బాగ్:** రవీంద్ర భారతిలో కందుల కూచిపూడి నాట్యాలయం నాట్య గురువులు నృత్య నిపుణ రవి కూచిపూడి శిష్యురాలు, రఘురాం చంద్రరావు, శైలజల పుత్రిక కుమారి రితిక కంబలదిన్నె నాట్య అరంగేట్రం ప్రేక్షకులను కట్టి పడేసింది. కృతి, శివ స్తుతి, కంజదళాయతాక్షి అంటూ ఆ అమ్మవారిని కీర్తిస్తూ ప్రదర్శించిన నృత్యాంశాలు అపూర్వం. భామాకలాపం, నారాయణ తీర్థుల తరంగం నృత్యాభినయం సమ్మిళితం తో కుమారి రితిక ఆకట్టుకుంది. నాట్యాచార్య గురు శ్రీవేదాంతం నరసింహ శాస్త్రి, గురు డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం, సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, కె వి జి కె రాజు, డాక్టర్ సి డి నాయుడు, కుమారి కొక విజయలక్ష్మి వేదం పండిట్ కె లక్ష్మి నారాయణ ఆచార్య అతిథులుగా విచ్చేసి కళాకారిణి కుమారి రితికను అభినందించారు.

## మహిళపై సామూహిక అత్యాచారం

**విశ్వంభర, నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఓ మహిళపై నలుగురు దుండగులు సామూహిక అత్యాచారం చేశారు. ఆటోలో మహిళను ఎక్కించుకుని తీసుకెళ్లి ఈ దుర్ఘటనకు పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి ఈ ఘటన జరగగా శనివారం ఉదయం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి ఒంటరిగా ఉన్న ఓ మహిళను నలుగురు వ్యక్తులు ఆటోలో నిజామాబాద్ బస్టాండ్ వద్ద ఎక్కించుకున్నారు.అక్కడి నుంచి డిచ్‌పల్లి ప్రాంతానికి తీసుకువెళ్లి దారుణమైన అఘాయిత్యానికి పాల్పడ్డారు. అనంతరం బాధితురాలు నగరానికి చేరుకుని శనివారం ఉదయం జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ అత్యాచారానికి పాల్పడిన వారు డిచ్‌పల్లికి చెంది ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. బాధిత మహిళను వెంటబెట్టుకుని ఘటనాస్థలికి తీసుకెళ్లి పోలీసులు పరిశీలించారు. బస్టాండ్ వద్ద ఆటోకు సంబంధించిన సీసీ కెమెరాలో రికార్డయిన వీడియో ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.ఈ ఘటన సంచలనం రేపింది. నిందితులను వీలైనంత త్వరగా పట్టుకొని కఠినంగా శిక్షించాలని స్థానికులు, మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా రాత్రి వేళ పోలీసుల పెట్రోలింగ్ పెంచాలని కూడా వారు కోరుతున్నారు.
**వరుస ఘటనలతో కలవరం:** 20 రోజుల క్రితం వరంగల్‌లో కూడా ఓ యువతిపై సామూహిక అత్యాచారం జరిగింది. ఆమె నమ్మిన స్నేహితుడే బలవంతంగా తీసుకెళ్లి తన మిత్రులతో కలిసి అత్యాచారానికి పాల్పడ్డాడు. మాట్లాడే పని ఉంది రావాలంటూ కారులో ఎక్కించుకొని వరంగల్?లోనే ఓ హెూటల్?కు తీసుకెళ్లి స్నేహితులతో కలిసి అత్యాచారానికి పాల్పడ్డాడు. అప్పట్లో ఈ ఘటన సంచలనం రేపింది. పోలీసులు నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

## అంబర్‌పేటలో వృద్ధ దంపతుల దారుణహత్య

**విశ్వంభర,** హైదరాబాద్: అంబర్‌పేట సాయిబాబా నగర్ కాలనీలో వృద్ధ దంపతులు దారుణహత్యకు గురైన ఘటన కలకలం రేపింది. మూడంతస్తుల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటున్న వృద్ధ దంపతులు లింగారెడ్డి, ఊర్మిళాదేవిని గుర్తు తెలియని దుండగులు దారుణంగా హత్య చేశారు. తలపై బాది, గొంతు కోసి కిరాతకంగా హతమార్చినట్టు పోలీసులు గుర్తించారు. దొంగతనానికి వచ్చిన దుండగులే దంపతులను హత్య చేసి ఉంటారని, మూడు రోజుల క్రితం ఘటన జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు.

# రిటైర్డ్ రైల్వే ఉద్యోగులకు మళ్లీ జాబ్స్

- తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కీలక నిర్ణయం
- 25వేల ఉద్యోగాలకు ప్రారంభమైన రిక్రూట్‌మెంట్ డ్రైవ్
- 65 ఏళ్ల లోపువారే అర్హులు



**దిల్లీ:** సిబ్బంది కొరతను అధిగమించేందుకు రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా పలు జోన్లలో 25వేల ఉద్యోగాలకు రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను ప్రారంభించింది. అయితే, వీటికి దరఖాస్తు చేసుకునేందుకు రిటైర్డ్ రైల్వే ఉద్యోగులకు కూడా అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అధికారిక వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ కొత్త నిబంధన కింద.. సూపర్‌వైజర్ల నుంచి ట్రాక్‌మెన్ వరకు పలు ఉద్యోగాలకు రైల్వే నుంచి రిటైర్ అయిన ఉద్యోగులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, 65 ఏళ్ల లోపు వారు మాత్రమే ఇందుకు అర్హులని చెప్పినట్లు సమాచారం. రెండేళ్ల పదవీకాలానికి గానూ వీరిని నియమించుకోనున్నారు. అవసరమైతే పదవీకాలాన్ని పొడిగించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం, ఇప్పటికే అన్ని జోనల్ రైల్వే జనరల్ మేనేజర్లకు ఉత్తర్వులు జారీ చేసినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. రిటైర్డ్ ఉద్యోగులు గత ఐదేళ్ల మెడికల్ ఫిట్‌నెస్‌తో పాటు, పదవీ విరమణకు ముందు ఉద్యోగంలో ఉన్నప్పుడు వారి పనితీరును పరిశీలించి ఈ నియామకాలు చేపట్టనున్నారు. గతంలో విజిలెన్స్, లేదా డిపార్ట్‌మెంట్ చర్యలను ఎదుర్కొన్న వారు దరఖాస్తులకు అనర్హులని తేల్చినట్లు సమాచారం. ఇలా నియమించుకున్న వారికి.. చివరిసారిగా వారు పొందిన నెలవారీ వేతనంలో నుంచి బేసిక్ పింఛనును తొలగించి జీతాలు చెల్లించనున్నారు. అంతేగాక, ట్రావెల్ అలెవెన్స్‌లు, అధికారిక టూర్ల వంటి ప్రయోజనాలు కల్పించనున్నారు. అయితే, ఇంక్రిమెంట్ల వంటి బెనిఫిట్స్ వీరికి ఉండవని సదరు కథనాలు పేర్కొన్నాయి. సిబ్బంది కొరతతో పాటు గత కొంతకాలంగా రైలు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఒక్క వాయవ్య రైల్వే జోన్‌లోనే 10వేలకు పైగా ఖాళీలు ఉన్నాయి. మిగతా జోన్లలోనూ పెద్ద ఎత్తున సిబ్బంది అవసరం ఉందని రైల్వే శాఖ వర్గాలు వెల్లడించాయి.

# భారతీయ చిత్రసీమపై పుతిన్ ప్రశంసలు

- రష్యాలో ఇండియన్ సినిమాలకు ఆదరణ
- 'బ్రిక్స్ ఫిల్మ్ ఫెస్టివల్' నిర్వహిస్తున్నాం



**మాస్కో:** రష్యా అధ్యక్షుడు పుతిన్ భారతీయ చిత్రసీమపై ప్రశంసలు కురిపించారు. తమ దేశంలో భారతీయ చిత్రాలకు మంచి ఆదరణ ఉందన్నారు. ఇండియా సభ్యదేశంగా ఉన్న ఐదు దేశాల కూటమి 'బ్రిక్స్' ఈనెల 22, 23 తేదీల్లో రష్యాలో జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు భారత ప్రధాని మోదీ పర్యటన కూడా ఖరారు అయింది. బ్రిక్స్ సమావేశాల నేపథ్యంలో పుతిన్ మీడియా సమావేశంలో మాట్లాడారు. బ్రిక్స్ సభ్యదేశాలకు రష్యాలో తీయబోయే చిత్రాలకు ప్రోత్సాహకాలు ప్రకటిస్తారా అన్న ప్రశ్నకు పుతిన్ సమాధానమిచ్చారు. "భారతీయ చలన చిత్రాలకు రష్యాలో మంచి ఆదరణ ఉంది. రష్యాలో 24 గంటలూ ఇండియన్ మూవీస్ వచ్చే ప్రత్యేక టీవీ ఛానల్ సైతం ఉంది. మాకు భారతీయ చిత్రాలు అంటే ఎంతో ఆసక్తి. మేము 'బ్రిక్స్ ఫిల్మ్ ఫెస్టివల్' నిర్వహిస్తున్నాం. మాస్కో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ ఏడాది బ్రిక్స్ దేశాలకు చెందిన చలన చిత్రాలను సైతం ప్రదర్శించనున్నాం. ఇండియన్ మూవీస్‌ను రష్యాలో ప్రదర్శించడానికి మేము సానుకులంగా ఉన్నాం. వారి చిత్రాలను ప్రమోట్ చేసేందుకు ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తాం. అంతేకాకుండా ఫార్మా రంగానికి సైతం ఇక్కడ అనుకూలంగా ఉంటుంది. ఈ విషయాలపై భారత ప్రధాని మోదీతో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాను. ఈ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదు" అని పుతిన్ పేర్కొన్నారు. "భారత ప్రధాని మోదీతో 'కజన్'లో ఈ విషయంపై మాట్లాడతాను. ఈ ప్రతి పాదన ముందుకు వెళ్తుందని నాకు 100 శాతం నమ్మకం ఉంది. ఎలాంటి ఇబ్బందులు లేవు. భారత్‌తో పాటు బ్రిక్స్ కూటమిలోని ఇతర దేశాల చిత్రాల సంస్కృతులు, నటులను చూడడం చాలా మనోహరంగా ఉంటుంది. థియేట్రికల్ ఆర్ట్ ఫెస్టివల్ ఏర్పాటు చేయాలని బ్రిక్స్ కూటమి సభ్యులం చర్చించు కున్నాం. సినిమా అకాడమీని ఏర్పాటు చేశాము" అని పుతిన్ పేర్కొన్నారు. భవిష్యత్తులో బ్రిక్స్ కూటమి దేశాలతో కలిసి మ్యూజిక్ ఫెస్టివల్‌ను సైతం ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవలి కాలం లో భారతీయ చిత్రాలను రష్యాలో ఎంతో ఆదరిస్తున్నారు. ఇక1982లో వచ్చిన 'డిస్కో డ్యాన్సర్' మూవీ సోవియట్ యూనిన్‌లో ప్రభంజనం సృష్టించింది. అత్యధిక వసూళ్లు రాబట్టిన ఇండియన్ చిత్రంగా నిలిచింది.

# 15ఏళ్ల తర్వాత కలుసుకున్న తల్లీకొడుకులు!

- మతిస్థిమితం బాగాలేక కుటుంబానికి దూరమైన మహిళ
- నిరాశ్రయురాలిని చేరదీసిన వైట్ డౌస్ సేవా సంస్థ



**మంగళూరు:** 15ఏళ్ల క్రితం అయినవారికి దూరమైన ఓ మహిళ, ఎట్టకేలకు కుటుంబ సభ్యుల్ని కలుసుకుంది. మతిస్థిమితం బాగాలేక కుటుంబ సభ్యుల నుంచి తప్పిపోయిన ఆమె కొడుకును కలిసింది. ఆమె ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. ఈ ఘటన కర్ణాటకలోని మంగళూరులో జరిగింది.
**అసలేం జరిగిందంటే:** మద్దూరుకు చెందిన ఫర్జానా అనే మహిళ 2009లో కుటుంబానికి దూరమైంది. మానసిక ఆరోగ్యం బాగాలేక ఇంటి నుంచి వెళ్లిపోయింది. మంగళూరులోని హెూయిగే బజార్‌లో ఫర్జానా నిరాశ్రయురాలిగా తిరగడాన్ని చూసిన వైట్ డౌస్ సేవా సంస్థకు చెందిన కొరినా రస్కిన్ ఆమెను రక్షించి, చికిత్స చేయించారు. ఆశ్రయం కల్పించారు. అయితే ఆమె ఫర్జానాకు అడ్రస్, కుటుంబ సభ్యుల గురించి సరిగ్గా చెప్పలేకపోయింది.
**అడ్రస్ కోసం కష్టాలు:** మద్దూరులోని మాంసం దుకాణం వద్ద తన ఇల్లు ఉందని ఫర్జానా చెబుతుండేది. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో మద్దూరు పేరుతో పట్టణాలు ఉన్నాయి. దీంతో ఫర్జానా అడ్రస్ సరిగ్గా తెలియలేదు. ఈ నేపథ్యంలో వైట్ డౌవ్స్ సంస్థ తన సిబ్బందిని రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు పంపించి ఫర్జానా కుటుంబసభ్యుల ఆచూకీ కోసం వెతికినా లభించలేదు.
**అదృష్టవశాత్తూ కుటుంబ సభ్యుల ఆచూకీ!:** ఇటీవల మద్దూరుకు చెందిన ఓ మానసిక రోగిని తీసుకెళ్లేందుకు ఆమె కుటుంబ సభ్యులు వైట్ డౌస్ సేవా సంస్థ వద్దకు వచ్చారు. వారికి మద్దూరులోని మాంసం వ్యాపారులకు ఫర్జానా గురించి తెలియజేయాలని వైట్ డౌస్ సేవా సంస్థ సభ్యులు ఒక స్లిప్‌ను ఇచ్చారు. ఫర్జానా కుమారుడు ఆసిఫ్‌కు స్లిప్ అందింది. వెంటనే తన తల్లి ఆచూకీ తెలియడం వల్ల ఆసిఫ్ సంతోషపడ్డాడు. తన భార్యాపిల్లలు, సోదరి, బావతో కలిసి మంగళూరులోని వైట్ డౌస్‌కు వచ్చాడు.
**కొడుకును గుర్తు పట్టిన తల్లి!:** తనను ఇంటికి తీసుకెళ్లేందుకు వచ్చిన కొడుకు, కుమార్తె, అల్లుడు, మనవరాళ్లను చూసి ఫర్జానా ఆనందానికి అవధుల్లేవు. అయితే తన కొడుకు అసిఫ్‌ను మాత్రమే ఫర్జానా గుర్తుపట్టింది. ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయేసరికి అసిఫ్ వయసు మూడేళ్లే. "గత కొన్నేళ్లుగా వెతుకుతున్నా మా అమ్మ అచూకీ తెలియలేదు. మా అమ్మని చూడడం సంతోషంగా ఉంది. నాకు మా అమ్మ గుర్తుంది. కానీ మాచెల్లి మాత్రం మా అమ్మను గుర్తుపట్టలేదు " అని అసిఫ్ ఈటీవీ భారత్?కు తెలిపాడు.
**గత 15ఏళ్లుగా ఆశ్రయం:** 2009 ఆగస్టులో ఫర్జానాను తాను రక్షించి, ఆశ్రయం కల్పించామని వైట్ డౌస్ సంస్థ వ్యవస్థాపకురాలు కొరినా రాస్కిన్ తెలిపారు. అప్పుడు ఆమె తన అడ్రస్?ను చెప్పలేకపోయారని పేర్కొన్నారు. తాజాగా తన కుటుంబ సభ్యులతో ఫర్జానా ఇంటికి వెళ్లారని పేర్కొన్నారు.

# మూసీ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు రేవంత్ ప్లాన్

- ఢిల్లీకి మూటలు మోసేందుకే ఈ పని
- మూసీ పునరుజ్జీవానికి రూ.26 వేల కోట్లు చాలు
- వంద శాతం మురుగునీటి శుద్ధి ఘనత కేసీఆర్‌దే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:** మూసీ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు రేవంత్ రెడ్డి ప్లాన్ వేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రూ.26 వేల కోట్లతో మొత్తం మూసీ పునరుజ్జీవం అవుతుందని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్‌కు మూటలు మోయడానికి రేవంత్ రెడ్డి దొరికాడని చెప్పారు. హైడ్రా పేరుతో బిల్డర్లను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. మూసీ బఫర్ జోన్‌లో ఉన్నవాళ్లను కబ్జాదారులని రేవంత్ ముద్ర వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నాగోల్‌లోని ఎస్టీపీని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కేటీఆర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. నాగోల్‌లో దేశంలోనే అతిపెద్ద మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించామని చెప్పారు. ఇక్కడ శుద్ధి చేసిన నీళ్లు నల్లగొండ జిల్లాకు పోతాయన్నారు. రేవంత్ రెడ్డి కొత్తగా చేసేదేం లేదన్నారు. ఈ ఎస్టీపీలను సక్రమంగా నడుపుకుంటే చాలన్నారు. మూసీ నది హైదరాబాద్ ఒక వరమని, దానిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలేనని చెప్పారు. హైదరాబాద్‌లో రోజూ 20 కోట్ల లీటర్ల మురికినీరు ఉత్పత్తి అవుతున్నదని తెలిపారు. దక్షిణాసియాలోనే వంద శాతం మురుగు శుద్ధి చేసే నగరం లేదని వెల్లడించారు. మురుగునీటిని వంద శాతం శుద్ధి చేస్తున్నది ఒక్క హైదరాబాద్‌లోనేనని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే ఈ ఘనతను సాధించామన్నారు. రూ.3,800 కోట్ల ఖర్చుతో ఎస్టీపీల నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. నగరంలోని 54 నాలాల నుంచి మూసీలోకి మురికి నీరు వస్తుందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఎస్టీపీలను రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో 57.7 కిలోమీటర్లు మూసీ ప్రవహిస్తుందన్నారు. మూసీపై 15 చోట్ల బ్రిడ్జిలను నిర్మించాలని ప్రణాళికలు రూపొందించామని వెల్లడించారు. చారిత్రక, వారసత్వ సంపదను కాపాడుతూ ఆధునికంగా నిర్మించాలని నిర్ణయించామన్నారు. బ్రిడ్జిల నిర్మాణానికి రూ.545 కోట్లు మంజూరు చేశామన్నారు. రోడ్ కం బ్రిడ్జ్ కం చెక్ డ్యాం నిర్మించాలనుకున్నామని చెప్పారు. మూసీపై రూ.10 వేల కోట్లతో భారీ స్కై ఓవర్ నిర్మించాలనుకున్నామని తెలిపారు. ఎంత శుద్ధి చేసినా మూసీ నీళ్లు తాగేవి కాదని చెప్పారు. అందువల్ల కొండపోచమ్మ సాగర్ నుంచి మూసీకి నీళ్లు తేవాలని నిర్ణయించామన్నారు. గోదావరి నుంచి నీళ్లు తెచ్చేందుకు రూ.1100 కోట్లతో ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఆ ప్రాజెక్టుకు గతేడాది మే 18న శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. మూసీ పక్కన తాను మూడు నెలలు కాదు మూడేండ్లు ఉంటానని స్పష్టం చేశారు. మూసీ తనకు చిన్నప్పటి నుంచి తెలుసని, కొత్తగా రేవంత్ చెప్పాల్సింది లేదన్నారు. సోకుల కోసం పేదలను రోడ్డున పడేయొద్దని ముఖ్యమంత్రికి సూచించారు. రేవంత్ తన కుర్చీ కాపాడుకోవడానికి కావాలంటే చందాలిస్తామన్నారు.

# అందుకే బాలీవుడ్‌పై ఆసక్తి కోల్పోయా

ఇటీవల జరిగిన 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ నటిగా పురస్కారాన్ని అందుకొని అందరి దృష్టిని ఆకర్షించారు మానసి పరేఖ్. గుజరాతీ చిత్రం 'కచ్ ఎక్స్‌ప్రెస్'లో నటనకుగానూ మానసి ఈ అవార్డును అందుకున్నారు. ఐదో చిత్రానికే నేషనల్ అవార్డు రావడంతో ఆమె పేరు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. తాజాగా మానసి ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్ ప్రారంభ రోజులను గుర్తుచేసుకున్నారు. 'రోజూ ఉదయం 8 గంటలకు మూడు జతల డ్రెస్‌లు తీసుకొని ఇంటి నుంచి బయటకు వచ్చేదాన్ని. ఆడిషన్స్ జరిగే చోటు ఎంత దూరమైనా వెళ్లేదాన్ని. ఒక్కోసారి ఒక పాత్రకు 150 మంది లైన్‌లో ఉండేవారు. ఎంత కష్టమైనా ఆడిషన్స్ ఇచ్చే ఇంటికి వేళ్లేదాన్ని. పోరాటాలు, కష్టాలను ఎదుర్కొవాలని నిర్ణయించుకున్నాను. ఎందుకంటే మనం చేసే పోరాటాలే మనల్ని నిర్వచిస్తాయి. నేను అన్ని పోరాటాలు చేసి కష్టపడ్డాను కాబట్టే.. ఈ స్థాయిలో ఉన్నాను. కష్టాల తర్వాత వచ్చే విజయం మరింత మధురంగా ఉంటుంది. అప్పుడే ప్రతి క్షణాన్ని ఆస్వాదించగలుగుతాం. మనపై మనకు నమ్మకం ఉంటే ఏదైనా సాధించగలం' అని అన్నారు. ఇక 'ఉరి: ది సర్జికల్ స్ట్రయిక్' సినిమాలో విక్కీ కౌశల్‌కు సోదరిగా నటించిన తర్వాత అందరూ తనను సోదరి పాత్ర కోసమే సంప్రదించారని మానసి అన్నారు. అందుకే బాలీవుడ్‌పై ఆసక్తి కోల్పోయినట్లు తెలిపారు. ''ఉరి' తర్వాత నేను కొన్ని సినిమాలకు నిర్మాతగానూ వ్యవహరించాను. అయినా.. బాలీవుడ్‌లో మాత్రం నాకు సోదరి పాత్రలే వచ్చాయి. నేను ఆ పాత్రకు మించి చేయగలనని ఎన్నో ఇంటర్వ్యూల్లో చెప్పాను. కానీ ఎవరూ పట్టించుకోలేదు. అందుకే బీటౌన్‌పై ఆసక్తి పోయింది. ఇప్పుడు నేను నిర్మాతను కాబట్టి గొప్ప పాత్రలను సృష్టించుకోగలను' అని చెప్పారు. ఇక 2003లో ఓ ఛానల్ నిర్వహించిన రియాలిటీ షోలో పాల్గొని, ఫైనలిస్టుల్లో ఒకరిగా మానసి నిలిచారు. ఆ తర్వాత బుల్లితెరపై గుర్తింపు తెచ్చుకొని 'కిత్నీ మస్త్ హై జిందగీ' సీరియల్‌తో నటిగా కెరీర్ ప్రారంభించారు. సీరియల్స్‌లో నటిస్తూనే హీరోయిన్‌గాను ఎంట్రీ ఇచ్చారు. 2012లో విడుదలైన 'లీలై'తో నటిగా పరిచయమయ్యారు. ఆ తర్వాత వరుస అవకాశాలతో ఆకట్టుకుంటున్నారు.





# క్యాస్టింగ్ కౌచ్ పరిస్థితులైతే ఇండస్ట్రీలో లేవు

## అనన్య నాగళ్ల

అచ్చ తెలుగమ్మాయి హీరోయిన్ అనన్య నాగళ్ల త్వరలో పొట్టేల్ అనే రూరల్ పిరియాడిక్ డ్రామా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. దీపావళికి ఈ మూవీ రిలీజ్ కానున్న నేపథ్యంలో తాజాగా ఈ చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించి చిత్రం ట్రైలర్ రిలీజ్ చేశారు. అనంతరం మీడియాతో క్వశ్చన్ అవర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ లేడీ జర్నలిస్టు ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ పై షాకింగ్ ప్రశ్నలు వేయగా నటి అనన్య కూడా అదే రేంజ్‌లో జవాబు ఇచ్చి ఔరా అనిపించింది.వివరాల్లోకి వెళితే.. తెలుగు అమ్మాయిలు ఇండస్ట్రీలోకి రావాలంటే భయపడతారు.. ఇండస్ట్రీలో అవకాశాలు ఇవ్వాలంటే కమిట్మెంట్ అడుగుతారని టాక్ ఉంది కదా మీకు ఇలాంటి అనుభవం ఎదురైందా అని ఓ మహిళా విలేకరి అనన్యకు ప్రశ్న వేసింది. దానికి ఆమె మీరు తెలుసుకోకుండా వంద శాతం ఉంటుందని ఎలా అడుగుతున్నారని జవాబిచ్చింది. మీరు చేసే అగ్రిమెంట్ లో కూడా ఉంటుందట కదా, మా ఫ్రెండ్సే చెప్పారు అని మరో క్వశ్చన్ వేయగా ఈ వందశాతం తప్పు అని అనన్య సమాధానమిచ్చింది. అవకాశం రావడం కంటే ముందే కమిట్మెంట్ అనేది టాలీవుడ్‌లో లేదని, ఎక్కడైనా పాజిటివ్, నెగెటివ్ అనేది సమానంగా ఉంటాయని మీరు ఎక్స్ పీరియన్స్ చేయకుండా అలా ఎలా అడుగుతున్నారంటూ అనన్య ఆన్సర్ ఇచ్చింది. అంతేగాక నటిగా నేను చెబుతున్నా క్యాస్టింగ్ కౌచ్ పరిస్థితులైతే ఇండస్ట్రీలో లేవని తెలిపారు. కమిట్మెంట్ ను బట్టే పారితోషికం ఉంటుందని ఇండస్ట్రీలో వినిపిస్తుంటుంది అని మరో ప్రశ్న అడగగా.. మీరు విన్న మాటలు చెబుతున్నారు. కానీ, నేను ఆ ఫీల్డ్ లోనే ఉన్నా. మీరు అనుకున్నది ఇక్కడ లేదని అనన్య గట్టిగా బదులిచ్చింది. అక్కడ అనన్య సమాధానాలు విన్న చాలామంది అనన్య ధైర్యాన్ని, బయ పడకుంగా చెప్పిన విధానాన్ని చాలామంది మెచ్చుకోవడమే కాక చప్పట్లతో ప్రశంసించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది.

# 'శంబాల' ది మిస్టికల్ ల్యాండ్




డిసిప్లిన్, డెడికేషన్‌కు కేరాఫ్‌గా నిలిచిన ఆది సాయికుమార్ ఈసారి జియో సైంటిస్ట్‌గా ఛాలెంజింగ్ రోల్‌లో నటిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న ఆనంది ఈ సినిమాలో ఆదికి జోడీగా నటిస్తున్నారు. 'ఏ' యాడ్ ఇన్‌ఫినిటిమ్ అనే డిఫరెంట్ మూవీతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న యుగంధర్ ముని దర్శకత్వంలో తెరకెక్కుతున్న మూవీ 'శంబాల ది మిస్టికల్ ల్యాండ్స . ఈ సినిమా తొలి పోస్టర్‌తోనే.. గతంలో ఎప్పుడూ ఎక్స్‌పీరియన్స్ చేయని ఓ డిఫరెంట్ వరల్డ్‌లోకి ఆడియన్స్‌ను తీసుకువెళ్లబోతున్నామన్న హింట్ ఇచ్చారు. హాలీవుడ్ స్థాయి నిపుణులు పని చేస్తున్న ఈ సినిమా పోస్టర్ ప్రస్తుతం అందర్నీ ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం వాస్తవానికి దూరంగా మరో ప్రపంచంలో జరిగే కథలకు ఆడియన్స్ నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అలాంటి ఓ మిస్టిక్ వరల్డ్‌లో రూపొందుతున్న సినిమా 'శంబాల'. తాజాగా ఈ సినిమా టైటిల్ ఎనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. టైటిల్ పోస్టర్‌లో ఒక్క మనిషి కూడా లేని గ్రామం, ప్రళయానికి ముందు భీకరంగా ఉన్న ఆకాశం, మబ్బుల్లో ఓ రాక్షస ముఖం ఇవన్నీ చూస్తుంటే 'శంబాల' కథలో వెన్నులో వణుకు పుట్టించే థ్రిల్స్ చాలానే ఉన్నట్టుగా అనిపిస్తోంది. సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఇండియన్ స్క్రీన్ మీద ఇంత వరకు టచ్ చేయని డిఫరెంట్ స్టోరీ లైన్‌ను చూపించబోతున్నారు. అమెరికాలోని న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో ఫిల్మ్ మేకింగ్ ట్రైనింగ్ తీసుకున్న యుగంధర్, 'శంబాల' సినిమాను హాలీవుడ్ స్థాయిలో హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో, గ్రాండ్ విజువల్స్‌తో రూపొందిస్తున్నారు. ఖర్చు విషయంలో ఏ మాత్రం వెనుకాడకుండా విజువల్స్ పరంగా, టెక్నికల్ గా సినిమాను టాప్ క్లాస్ అనే రేంజ్‌లో తెరకెక్కిస్తున్నారు. డ్యూన్, ఇన్సెప్షన్, బ్యాట్ మ్యాన్, డన్ కిర్క్ సినిమాలకు మ్యూజిక్ డైరెక్టర్ అయిన హాన్స్ జిమ్మర్ లాంటి లెజెండరీ హాలీవుడ్ కంపోజర్స్‌తో కలిసి పని చేసిన ఇండియన్ మ్యూజీషియన్ శ్రీరామ్ మద్దూరి ఈ సినిమాకు సంగీతమందిస్తున్నారు. బ్యాక్‌గ్రౌండ్స్ స్కోర్స్ విషయంలోనూ ఇంతకు ముందు ఏ సినిమాలో ఎక్స్‌పీరియన్స్ చేయని కొత్త సౌండింగ్‌ను ఈ సినిమాలో వినిపించబోతున్నట్లు సమాచారం.

# 'బ్లడీ బెగ్గర్'.. డార్క్ కామెడీ థ్రిల్లర్!

యంగ్ హీరో కెవిన్ కథానాయకుడిగా తాను తెరకెక్కించిన 'బ్లడీ బెగ్గర్' (Bloody Beggar) చిత్రం డార్క్ కామెడీతో కూడిన డ్రామా థ్రిల్లర్ అని ఆ సినిమా దర్శకుడు శివబాలన్ ముత్తుకుమార్ అన్నారు. తాజాగా జరిగిన మీడియా సమావేశంలో ఈ చిత్ర విశేషాలను ఆయన వివరించారు. 'ఇందులో హీరో ఆరంభం నుంచే 'బ్లడీ బెగ్గర్'గా ఉంటారు. ఆయన అలా ఎందుకున్నారనే అంశంతో స్టోరీ ప్రారంభమవుతుందన్నారు. ఈ చిత్రాన్ని చూసి నెల్సన్ కుమార్ మెచ్చుకున్నారన్నారు. నిజానికి ఈ చిత్రం నెల్సన్ ప్రొడ్యూస్ చేయాలన్న ఆలోచన లేదు. పలువురు నిర్మాతలను సంప్రదించిన తర్వాత స్క్రిప్టుపై ఉన్న నమ్మకంతో నిర్మాతగా ముందుకు వచ్చారన్నారు. స్వతహాగా దర్శకుడైన నెల్సన్ దిలీప్ కుమార్.. ఈ స్క్రిప్టులోనూ కొన్ని మార్పులు చేర్పులు చేశారు. కానీ, చిత్రీకరణలో ఎలాంటి జోక్యం చేసుకోలేదని, పూర్తి స్వేచ్ఛనిచ్చారన్నారు. తొలి షెడ్యూల్ మైసూరులో పూర్తి చేయగా, రెండో షెడ్యూల్ చెన్నైలో చిత్రీకరించాం. ఇందులో ప్రత్యేకంగా చెప్పుకునే రీతిలో హీరోయిన్ లేదు. కానీ, కథ డిమాండ్ మేరకు ఒక నటి ప్రధాన పాత్ర పోషించారు. బిచ్చగాడి వేషంలో కెవిన్‌ను ఐదారు విధాలుగా టెస్ట్ చేశాం. ఓ వేషంలోనే కెవిన్ రోడ్డుపై నిజంగానే భిక్షాటన చేయగా, ఎవరూ గుర్తుపట్టలేదు. పైగా ఓ మహిళ రూ.20 కూడా వేశారు. సో.. ఈ లుక్‌లో బెగ్గర్‌గా సరిగ్గా సరిపోయాడని భావించి దాన్నే ఖరారు చేశాం. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ప్రోమోకు మంచి స్పందన వచ్చింది. దర్శకుడుగా నా తొలి చిత్రం. దీపావళికి విడుదల చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

# ఈ సంక్రాంతికి సినిమాల సందడి

సంక్రాంతి పండగ తెలుగు ప్రజలకు ఎంత ప్రత్యేకమైనదో.. సినీ అభిమానులు కూడా అంతే ప్రత్యేకం. తరతరాలుగా సంక్రాంతి పండగకు ఫ్యామిలీతో కలిసి సినిమాలకు వెళ్లడం అనేది ఆనవాయితీ. ఈ ఆనవాయితీని ప్రోత్సహిస్తూ తెలుగు సినిమా ఇండస్ట్రీ కూడా బడా హీరోల సినిమాలు దింపి భారీ కాసులు సంపాదించుకుంటుంది. అయితే ఈ సంక్రాంతికి పండగ హాలిడేస్ కాకుండా మరిన్ని హాలిడేస్ అదనంగా యాడ్ అయ్యాయి. దీంతో సినీ నిర్మాతలతో పాటు ప్రేక్షకులు ఎగిరి గంతేస్తున్నారు. ఇంతకీ ఏంటి ఆ హాలిడేస్.. సినిమాలకి ఎలా కలిసి వస్తుందంటే..ఈ సారి సంక్రాంతి సోమవారం రానుంది. దీంతో సంక్రాంతి, భోగి, కనుమ హాలిడేస్ ముందే శని, ఆదివారాలు సెలవులు అదనంగా లభించనున్నాయి. పిల్లలకు ఎలాగో సంక్రాంతి హాలిడేస్ కలిసొస్తాయి. ఇంకా ఒకటి లేదా రెండు రోజులు లీవ్ పెట్టె జనాలు కూడా ఎక్కువే.. దీంతో ఈ సంక్రాంతి ఫిల్మ్ మేకర్స్‌తో పాటు ప్రేక్షకులకి ఎంతో కలిసొచ్చింది. గత సంక్రాంతిలతో పోల్చుకుంటే ఈ సారి పోటీ కాస్త తక్కువగానే కనిపిస్తుంది. అయితే మెగా స్టార్ 'విశ్వంభర'ని కాదని రంగంలోకి దిగుతున్న రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ పైన నిర్మాతలతో పాటు అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. మరో వైపు వెంకీ- అనిల్ రావిపూడి, బాలయ్య 109వ చిత్రాలు కూడా సంక్రాంతి బరిలో ఉండగా ఆ సినిమాలకి ఇంకా టైటిల్స్ ఖరారు చేయకపోవడం కొసమెరుపు. ఇక వెంకటేష్ సినిమా కాన్సెప్ట్ విషయానికి వస్తే.. హీరో, అతని ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, అతని ఎక్సలెంట్ వైఫ్.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ఎక్స్‌ట్రార్డినరీ ట్రైయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన మీనాక్షి చౌదరి , ఐశ్వర్య రాజేష్ లు హీరోయిన్లుగా నటిస్తున్నారు. టాప్ టెక్నిషియన్స్ ఈ సినిమా కోసం పని చేస్తున్నారు. ఇన్-ఫార్మ్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా.. సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనింగ్, తమ్మిరాజు ఎడిటింగ్.. ఎస్ కృష్ణ, జి ఆదినారాయణ కో -రైటర్స్, వి వెంకట్ యాక్షన్ డైరెక్టర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

# కేసీఆర్ సినిమా థియేట్రికల్ ట్రైలర్ లాంచ్

## లంబాడీ యువకుడు రియల్ లైఫ్ నుంచి స్ఫూర్తి



రాకింగ్ రాకేష్ లీడ్ రోల్ లో నటిస్తున్న మూవీ 'కేశవ చంద్ర రమావత్స (కేసీఆర్), గ్రీన్ ట్రీ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ మూవీకి గరుడవేగ అంజి దర్శకత్వం వహించారు. అన్నన్య కృష్ణన్ కథానాయికగా నటిస్తున్నారు. రాకింగ్ రాకేష్ స్వయంగా నిర్మించిన ఈ చిత్రం లంబాడీ వర్గానికి చెందిన యువకుడి రియల్ లైఫ్ నుంచి స్ఫూర్తి పొందింది. మేకర్స్ శనివారం సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. కేశవ చంద్ర రమావత్ (కేసీఆర్), అతని మరదలు మధ్య చిన్ననాటి స్నేహాన్ని ప్రజెంట్ చేయడం ద్వారా ట్రైలర్ ప్రారంభమైంది . అది క్రమంగా ప్రేమగా మారుతుంది. తన షార్ట్ నేమ్ కేసీఆర్ అని సగర్వంగా చెప్పుకునే ఆ యువకుడు కేసీఆర్‌తో ఎంతో స్ఫూర్తి పొందాడు. అయితే అతను తన చిన్ననాటి మరదలుతో మ్యారేజ్ ప్రపోజల్ ని రిజెక్ట్ చేస్తాడు. కథ ఇలా సాగుతుండగా, కేసీఆర్ ఒక లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌కు బయలుదేరుతాడు.

రాకింగ్ రాకేష్ మనసుని హత్తుకునే కథను రాసారు. గరుడ వేగ అంజి దర్శకుడిగా, సినిమాటోగ్రాఫర్‌గా కట్టిపడేశారు. ఈ కథనం గ్రామీణ తెలంగాణ సారాంశాన్ని, సంస్కృతిని అందంగా చూపించింది. చరణ్ అర్జున్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పవర్ ఫుల్ ఎమోషనల్ లేయర్‌ని యాడ్ చేసింది. బలగం మధు ఎడిటింగ్ బ్రిలియంట్ గా వుంది , మహేష్ బల్లంట్ ఆర్ట్ డైరెక్టర్. గోరెటి వెంకన్న, కాసర్ల శ్యామ్‌లు సాహిత్యం అందించారు.

రాకేష్, కేసీఆర్ పాత్రలో లీనమై హీరోగా ఆకట్టుకునే పెర్ఫార్మెన్స్ కనబరిచారు. అన్నన్య కృష్ణన్ బ్యూటీఫుల్ గా వుంది. తనికెళ్ల భరణి, ధనరాజ్, తాగుబోతు రమేష్, జోర్దార్ సుజాత, లోహిత్ కుమార్, బలగం మైమ్ మధు, రచ్చ రవి, కృష్ణ భగవాన్, అంజి, సాయి చరణ్ కిష్టప్ప, జబర్దస్త్ ప్రవీణ్, జబర్దస్త్ నవీన్, జబర్దస్త్ సన్నీ జబర్దస్ రాజు వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించారు. ఈ చిత్రాన్ని త్వరలో థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరో రాకింగ్ రాకేష్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమాని మూడు ఫిలిం ఫెస్టివల్స్‌లో ప్రదర్శించాలని నా కోరిక. దానికి మీరందరి సపోర్ట్ కావాలి. సాయి రాజేష్ అన్నకు ఎంత థాంక్స్ చెప్పుకున్న తక్కువే. సాయి రాజేష్ అన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. చరణ్ అర్జున్ అన్న అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఆయన త్వరలో బిగ్ బ్యానర్స్ లో పనిచేయబోతున్నారు. నా సక్సెస్ కారణం నా భార్య సుజాత. ఈ జర్నీలో చాలా సపోర్ట్ చేశారు. మా సినిమాలో పని చేసిన ఆర్టిస్టులు, టెక్నిషియన్స్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు' తెలిపారు.

డైరెక్టర్ అంజి మాట్లాడుతూ.. అందరికీ థాంక్యూ సో మచ్. రాకేష్ చాలా అద్భుతమైన కథను రాశారు. కథ విన్న వెంటనే ఈ సినిమా చేస్తానని చెప్పాను. సినిమాటోగ్రఫీ డైరెక్షన్ రెండు నేనే చేశాను. వండర్ఫుల్ కథ తీసుకువచ్చిన రాకేష్ కి థాంక్యూ సో మచ్. మా ట్రైలర్ లాంచ్ చేసిన సాయి రాజేష్ కు, అనసూయకు థాంక్యూ సో మచ్ . వారు సపోర్ట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. వారు ఎంకరేజ్ చేయడం నిజంగా మాకు ఒక సక్సెస్. ఈ సినిమాల్లో పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు' తెలిపారు.

డైరెక్టర్ సాయి రాజేష్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. హృదయ కాలేయం ఆడియో ఫంక్షన్ కి రాకేష్ ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా స్కిట్ చేసి వెళ్ళాడు. ఆ కృతజ్ఞత నాకు అలా ఉండిపోయింది. కొన్ని రోజులుగా ముంబైలో ఉన్నప్పటికీ రాకేష్ కోసం ఈ ఈవెంట్ కి వచ్చాను. ఆ రోజు మాకు సపోర్ట్ చేసిన రాకేష్ కి ఈ వేదిక పైన థాంక్స్ చెప్తున్నాను. తనకి కెరీర్ లో బెస్ట్ క్యారెక్టర్ రాస్తానని మాట ఇచ్చాను. తొందరలోనే ఆ క్యారెక్టర్ రాసి రుణం తీర్చుకుంటాను. సినిమా తీసి చూస్తే జీవితం అంటే ఏంటో తెలుస్తుంది. ఈ సినిమా ట్రైలర్ చాలా బావుంది. ఈ సినిమాతో రాకేష్ మంచి స్థాయికి వెళ్ళాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ అంజి మంచి దర్శకులు మంచి కెమెరామెన్. అర్జున్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చాలా బాగుంది. టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్' చెప్పారు.

అనసూయ మాట్లాడుతూ... మీడియాకి థాంక్యూ. రాకేష్ నా తమ్ముడు లాంటివాడు. చాలా హానెస్ట్ గా ఈ సినిమా తీశారు. రెండు డబ్బులు సంపాదిస్తే ఇల్లు, కారు కొనుక్కోవాలి అనుకుంటారు. కానీ రాకేష్ మాత్రం ఒక మంచి సినిమా తీయాలనుకున్నాడు, ట్రైలర్ చాలా బాగుంది. చాలా ప్రౌడ్ గా అనిపించింది. అంజి చాలా బ్రిలియంట్ గా ఈ కథని తీశారు. చరణ్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఈ సినిమాలో పనిచేసిన ఆర్టిస్టులకి, టెక్నీషియన్ అందరికీ ఆల్ ది బెస్ట్. రాకేష్ చాలా హానెస్ట్ గా ఈ సినిమా తీసుకొస్తున్నారు. ఆడియన్స్ కూడా అంతే హానెస్ట్ గా రిసీవ్ చేసుకోవాలని కోరుకుంటున్నాను. థాంక్యూ సో మచ్' అన్నారు.

యాక్టర్ శివబాలాజీ మాట్లాడుతూ... జనరల్ గా పెళ్లి చేసి చూడు ఇల్లు కట్టి చూడు అంటారు. ఈమధ్య సినిమా తీసి చూడు కూడా అంటున్నారు. ఈ మూడు చేశాడు రాకేశ్. కంగ్రాజులేషన్స్ రాకేష్. ఈవెంట్ కు రావడం చాలా ఆనందంగా ఉంది. మూవీ ఎలాగైనా సక్సెస్ అవ్వాలి, అంతా రాకేష్ కి సపోర్ట్ చేయాలనుకుంటున్నాను. మా ఆర్టిస్ట్ ల తరపున అందరు మూవీని ప్రమోట్ చేయాలని కోరుకుంటున్నాను. అంజి సూపర్ టెక్నీషియన్. షాట్స్ అద్భుతంగా తీస్తాడు. అంజి రాకేష్ కి మంచి సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నాను. చరణ్ శంభో శివ శంభో సినిమాకి లిరిక్స్ రాశాడు. అప్పుడు మేమంతా లేచి క్లాప్స్ కొట్టాం. ఇందులో కూడా చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. అనన్య చాలా అద్భుతంగా నటించింది. టీం అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్' అన్నారు.

యాక్టర్ శివారెడ్డి మాట్లాడుతూ.. ఒక మనిషి పట్టుపడితే సాధించకుండా మానడు అనడానికి నిలువెత్తు నిదర్శనం నా తమ్ముడు రాకింగ్ రాకేష్. చాలా కృషి పట్టుదలతో ఈ స్థాయికి వచ్చాడు. అదే పట్టుదలతో ఈ సినిమా తీశాడు. ఈ సినిమా మంచి విజయం సాధించి రాకేష్ కి మరిన్ని సినిమాలు చేసే శక్తిని ఆ దేవుడు ప్రసాదించాలని కోరుకుంటున్నాను' అన్నారు. టీం సభ్యులంతా హాజరైన ఈ ట్రైలర్ లాంచ్ వేడుక గా గ్రాండ్ గా జరిగింది.

**నటీనటులు:** రాకింగ్ రాకేష్, అనన్య కృష్ణన్, తనికెళ్ల భరణి, ధనరాజ్, తాగుబోతు రమేష్, జోర్దార్ సుజాత, లోహిత్ కుమార్, బలగం మైమ్ మధు, రచ్చ రవి, కృష్ణ భగవాన్, అంజి, సాయి చరణ్ కిష్టప్ప, జబర్దస్త్ ప్రవీణ్, జబర్దస్త్ నవీన్, జబర్దస్ రాజ్ రాజ్, జబర్దస్త్ జబర్దస్త్ , కీర్తి లత, బలగం తాత, జబర్దస్త్ కర్తానందం
**సాంకేతిక సిబ్బంది:**
**బ్యానర్:** విభూది క్రియేషన్స్
**స్క్రీన్ ప్లే, రైటింగ్ & ప్రొడ్యూసర్:** రాకింగ్ రాకేష్
**సినిమాటోగ్రఫీ & దర్శకత్వం:** 'గరుడవేగ' అంజి
**సంగీతం:** తెలంగాణ మాస్ట్రో 'చరణ్ అర్జున్'
**ఎడిటర్:** మధు
**ఆర్ట్ డైరెక్టర్:** మహేష్ బల్లంట్
**డైలాగ్స్:** రాజ్ కుమార్ కుసుమ
**చీఫ్ కో-డైరెక్టర్:** హేమంత్
**కో-డైరెక్టర్:** రామారావు, ఉంద్రావట్టి నాగరాజు
**మేనేజర్:** గణేష్ నాయక్
**ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్:** ముదిగొండ సాయికుమార్
**పీఆర్వో:** వంశీ శేఖర్

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com